www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 19-6-2024 | పేజీలు: 14 | వెల (Price): Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 64 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి ఉ. 7.28 తదుపరి త్రయోదశి; నక్షత్రం: విశాఖ సా. 5.23 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా. 9.30-11.09; దుర్ముహూర్తం: ఉ. 11.50-12.42; అమృతఘడియలు: ఉ. 8.03-9.44; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.47 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చదరపు అడుగుకు రూ.30 వేలు

రుషికొండపై నిర్మాణాలకు అతి భారీ వ్యయం



స్టార్ హోటళ్లలో రూ.కోటితో అన్ని హంగుల గది

రూ.450 కోట్లకు రావలసిన రూమ్‌లు 450

కానీ.. నిర్మించినవి 12 బెడ్ రూమ్‌లే 12

జగన్ నిర్వాకంపై జనంలోకి!

పోలవరం ప్రాజెక్టును దెబ్బతీసిన 'రివర్స్'

ప్రజలకు వివరించి.. చట్టపరమైన చర్యలు?

చంద్రబాబు సర్కారు ఆలోచన!?

తాజా సమీక్షలో వెలుగు చూసిన దారుణాలు

ఐదేళ్లలో 5 వేల కోట్లయినా ఖర్చుపెట్టలేదు!

పనుల్లో కేవలం 4 శాతం పురోగతి

రివర్స్ టెండరింగ్ నిర్ణయం జగన్‌దే!

దాస్, సుధాకరబాబు అమలు చేశారు

నష్టానికి బాధ్యులను గుర్తించే పనిలో కేంద్రం



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

పోలవరం ప్రాజెక్టుపై 'రివర్స్' వద్దన్నా జగన్ పట్టించుకోలేదు. చివరికి... ఒక విధ్వంసానికి కారకుడయ్యారు. జగన్ చేసిన ఈ నిర్వాకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. జగన్ కారణంగా పోలవరానికి జరిగిన నష్టం, విధ్వంసాన్ని వివరించి... ఆ తర్వాత అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు... పోలవరానికి జరిగిన నష్టంపై కేంద్ర ప్రభుత్వం కూడా దృష్టి సారించింది. డయాఫ్రం వాల్‌కు తీవ్ర నష్టం, గైడ్‌బండ్ కుంగిపోవడం.. ఎగువ కాఫర్ డ్యాంలో సీపేజీ వంటి వాటికి బాధ్యులెవరో గుర్తించే పనిలో పడింది. వాస్తవానికి 2019లో రివర్స్ టెండర్‌కు వెళ్లాలని జగన్ నిర్ణయించినప్పుడు కేంద్ర జలశక్తి శాఖ వద్దని చెప్పింది. పనులు జోరుగా సాగుతున్న తరుణంలో కాంట్రాక్టు సంస్థను మార్చేస్తే.. నిర్మాణం జాప్యం కావడమే కాకుండా.. అంచనా వ్యయం కూడా భారీగా పెరుగుతుందని హెచ్చరించింది. అయినా జగన్ పెడచెవిన పెట్టారు. 'రివర్స్' రాజకీయాలకు తెరలేపారు. జలశక్తి శాఖ హెచ్చరించిన విధంగానే.. పనుల్లో జాప్యం కారణంగా ప్రాజెక్టుకు నష్టాలు సంభవించాయి. దీనిపై

మిగతా 11వ పేజీలో...

పోలవరం ప్రాజెక్టు ఎవరికీ అర్థం కాదు



ఎందుకంటే నాకే అర్థం కాలేదు

మాజీ మంత్రి అంబటి రాంబాబు వింత వ్యాఖ్యలు



ఉప ముఖ్యమంత్రి హోదాలో మంగళవారం తొలిసారి సచివాలయానికి వచ్చిన పవన్‌తో తన చాంబర్‌లో సీఎం చంద్రబాబు కరచాలనం

ఇంటర్ విద్యార్థులకు సర్కారు కానుక



ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు

బ్యాగులు కూడా.. ఉత్తర్వులు జారీ

2 లక్షల మందికి మేలు చేసే నిర్ణయం

గత ప్రభుత్వంలో ఉచితానికి మంగళం

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఇంటర్ విద్యార్థులకు తీపికబురు అందింది!. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు ఉచితంగా పంపిణీ చేయాలని ఆదేశిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ మొదటి సమీక్షలో దీనిపై అధికారులను ఆదేశించగా, ఈ మేరకు ఉత్తర్వులు

మిగతా 11వ పేజీలో...

ఇక అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి!

నాడు అంబేడ్కర్ పేరు తీసేసి తన పేరు పెట్టుకున్న జగన్.. నేడు మళ్లీ పునరుద్ధరణ

ప్రక్షాళన మొదలుపెట్టిన కొత్త ప్రభుత్వం

వైఎస్, జగన్ పేరిట ఉన్న పథకాలకు తిరిగి పాత పేర్లు పెడుతూ ఉత్తర్వులు 11



అడ్వకేట్ జనరల్‌గా దమ్మాలపాటి!

గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపిన సీఎస్

ఆయన ఆమోదించగానే ఉత్తర్వులు జారీ

ఏజీ ఎస్.శ్రీరామ్ రాజీనామా ఆమోదం

ఏఏజీ పొన్నవోలు, పీపీ నాగిరెడ్డివి కూడా

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అడ్వకేట్ జనరల్(ఏజీ)గా సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ నియమితులు కానున్నారు. ఆయన పేరును ప్రతిపాదిస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు నోట్ ఫైల్ వెళ్లింది. దీంతో ఆయన గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ప్రతిపాదనలు పంపారు. గవర్నర్ ఆమోదించిన వెంటనే ఏజీగా దమ్మాలపాటి నియామకానికి

మిగతా 3వ పేజీలో...



ఎల్లుండి నుంచి అసెంబ్లీ సమావేశాలు

రెండ్రోజులు నిర్వహించాలని ప్రభుత్వ నిర్ణయం

ప్రొటెమ్ స్పీకర్‌గా బుచ్చయ్యచౌదరి

21న నూతన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

22న శాసనసభ స్పీకర్ ఎన్నిక 11

ఇప్పటికే అయ్యన్నపాత్రుడి పేరు ఖరారు

ఈ ఎన్నిక తర్వాత సభ నిరవధిక వాయిదా

జూలైలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

ఈ నెల 24న రాష్ట్ర కేబినెట్ తొలి భేటీ

బాబు సర్కారులో జగన్ చొరబాటు!

కీలక శాఖల సారథులుగా ఇంకా పాత అధికారులే

మైన్స్, స్కిల్ డెవలప్‌మెంట్, బేవరేజెస్ కార్పొరేషన్ వంటి కీలక విభాగాల్లో వైసీపీ ప్రభుత్వం వందల మందిని జొప్పించింది. వీరంతా దిగువ, మధ్యస్థాయి అధికారులే. ఇప్పుడూ వాళ్లనే కొనసాగిస్తే... అవి ప్రభుత్వ కార్యాలయాలుగా కాకుండా, వైసీపీ ఆఫీసులుగానే పని చేస్తాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఆడిట్ విభాగం అధికారిణి మాధురి... వైసీపీ హయాంలో ధనుంజయ రెడ్డి పేషీలో పని చేశారు. ఆమెకు కన్ఫర్డ్ ఐఏఎస్ కట్టబెట్టేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టడంతో... ఆరోగ్యశ్రీలోని ఆర్థిక విభాగంలోకి జొప్పించే ప్రయత్నాలు మొదలయ్యాయి.

వారిని మార్చడంపై దృష్టి పెట్టని చంద్రబాబు

సందట్లో సడేమియాగా పోస్టింగ్‌ల జాతర

మధ్యస్థాయి అధికారులుగా జగన్ భక్తులు

2014-19నాటి టెక్నిక్ వాడుతున్న వైసీపీ

అధికారులు, సిబ్బంది ద్వారా సమాచార సేకరణ

వక్రీకరించి రోత పత్రికలో అడ్డగోలు కథనాలు

జగన్ అధికారంలోకి రాగానే అందరిపైనా నిఘా

ఇప్పుడూ ప్రభుత్వంలోకి ఆయన మనుషుల చేరిక!?

జగన్ మార్క్ నిర్వాకం

ఆరోగ్యశ్రీలో పోస్టుకు ధనుంజయ్ రెడ్డి ఓఎస్డీ దరఖాస్తు

నిమిషాల్లోనే ప్రాసెస్ చేసిన ఉన్నతాధికారులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కొత్త ప్రభుత్వం ఏర్పడింది! కానీ... చాలా శాఖల్లో పాత అధికారులే కొనసాగుతున్నారు! కొందరిపైనే దృష్టి సారించి, మార్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంకా చాలామంది వివాదాస్పద, వైసీపీ అనుకూల అధికారులను ప్రస్తుతానికి అలాగే వదిలేశారు. భవిష్యత్తులో వీరికీ స్థాన చలనం తప్పకపోవచ్చు. కానీ, ఈలోపే ఆయా ఉన్నతాధికారుల ద్వారా తమకు

మిగతా 12వ పేజీలో...



ప్రభుత్వ సొమ్ముతో కొన్నవన్నీ అప్పగించండి

మాజీ సీఎం జగన్‌కు జీఏడీ లేఖ 11

సమాధానం ఇవ్వని జగన్‌రెడ్డి కార్యాలయం

తప్పు జరిగితే ఒప్పుకోండి



0.001% నిర్లక్ష్యం ఉన్నా కఠిన చర్యలు అవసరం

మోసగాడు వైద్యుడైతే సమాజానికే హానికరం

నీట్ కేసులో ఎన్‌టీఏ, కేంద్రంపై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష నిర్వహణలో 0.001% నిర్లక్ష్యం ఉన్నా.. కఠినచర్యలు అవసరమని, తప్పు జరిగితే ఒప్పుకొని చక్కదిద్దాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అప్పుడే నీట్ పరీక్షలపై ప్రజల్లో మళ్లీ విశ్వాసం నెలకొంటుందని పేర్కొంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాసేందుకు పడే శ్రమను తీవ్రంగా పరిగణనలోకి తీసుకుని నిర్లక్ష్యానికి తావు లేకుండా నిర్వహించాలని కేంద్రానికి, ఎన్‌టీఏకి సూచించింది. నీట్ అక్రమాలపై దాఖలైన తాజా రిట్ పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎస్వీ భట్టితో కూడిన వెకేషన్ బెంచ్ మంగళవారం

మిగతా 2వ పేజీలో...

రాష్ట్రంలో 2 ఎమ్మెల్సీ స్థానాలకు ఉప ఎన్నిక

రెండూ ఎమ్మెల్యే కోటావే

25 నుంచి నామినేషన్లు

అవసరమైతే 12న పోలింగ్

కర్ణాటక, యూపీ, బిహార్లో 3 స్థానాలకూ అదే రోజు ఎన్నిక 11

80 శాతం మంది ఓటు వేశారు. బటన్ నొక్కిన తర్వాత ఏ పార్టీకి ఓటు వేశారో వీవీ ప్యాట్‌లో వాళ్లకు కనిపిస్తా ఉంది. తేడా వచ్చిందని ఎక్కడా ఫిర్యాదులు రాలేదు. నేను ఫ్యాను గుర్తుకు నొక్కినాక వీవీప్యాట్‌లో నాకు సైకిల్ గుర్తు కనిపిస్తే ఎందుకు గమ్మునుంటా? బూత్‌లో అక్కడే ఉండి గొడవ చేసి ఉండేవాడిని కదా! మరి ఈవీఎంలలో అది జరిగాయి.. ఇది జరిగాయని ఏవిధంగా చెబుతారు?

- 2019లో గెలుపు తర్వాత జగన్మోహన్ రెడ్డి

న్యాయం జరగడం ఒక్కటే ముఖ్యం కాదు. జరిగినట్లు కనిపించాలి కూడా. ప్రజాస్వామ్యం గెలవడంతో పాటు నిస్సందేహంగా గెలిచినట్లు కనిపించాలి కూడా. ప్రపంచం మొత్తమ్మీద ప్రజాస్వామ్యం కొనసాగుతున్న అత్యధిక దేశాల్లో ఎన్నికల ప్రక్రియ కోసం పేపర్ బ్యాలెట్లు వాడుతున్నారు. ఈవీఎంలు కాదు. ప్రజాస్వామ్యం అసలైన స్ఫూర్తిని కొనసాగించేందుకు మనం కూడా ఇదే దిశగా ముందుకు కదలాలి.

- తాజా ఓటమి నేపథ్యంలో మంగళవారం 'ఎక్స్'లో జగన్

తాను గెలవలేక ఈవీఎంలు 'ఓడు'!



ఈవీఎంలపై జగన్ నాలుక మడత

2019లో తాను గెలిచినప్పుడు ఓహో

ఇప్పుడు ఈవీఎంలపై అనుమానాలు

పేపర్ బ్యాలెట్‌కే వెళ్లాలంటూ ట్వీట్

ఆయన వల్లే ఓడామంటున్న అభ్యర్థులు

సమస్యలు చెప్పినా పట్టించుకోని జగన్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు.. వైఎస్ జగన్ ఎన్నికల్లో గెలవలేక ఈవీఎంల వల్లే ఓడిపోయానని ఇప్పుడు వాపోతున్నారు. 2014లో టీడీపీ-బీజేపీ కూటమిని ప్రజలు గెలిపించినప్పుడు.. చంద్రబాబు ఇచ్చిన తప్పుడు హామీలు నమ్మి జనం ఆయనకు ఓట్లేశారని అన్నారు. 2019లో వైసీపీ గెలిచాక ఈవీఎంలపై ఆరోపణలు వచ్చినప్పుడు.. చంద్రబాబు

మిగతా 11వ పేజీలో...

వైసీపీ వనిత.. కోట్లలో మేత!?



బయానా ఇచ్చిన పోలీసులు లబోదిబో

పనిని బట్టి రేటు కట్టిన వైనం

ఎవరు ఎక్కువ ఇస్తే వారికే 'పని'

చార్జి మెమోల రద్దుకు కౌంటర్లు

ఎన్నికల ముందు రెచ్చిపోయి మరీ భారీగా దండుకున్న మాజీ 'హోం'

'ఆంధ్రజ్యోతి'కి ఫోన్ చేసి బాధితుల ఆవేదన

తూర్పు ఎస్పీని ఆశ్రయించిన మరికొందరు

వెలుగు చూస్తున్న తానేటి అవినీతి లీలలు

12

'నేనే రాజు.. నేనే మంత్రి' అన్న చందంగా సాగిన జగన్ జమానాలో 'రండి బాబూ.. రండి' అంటూ అవినీతికి కౌంటర్లు తెరిచి మరీ అమాత్యులు రెచ్చిపోయారు. అధికారం అచ్చంగా తమకే సొంతమనే భ్రమలో వసూళ్లకు డోర్లు బార్లా తెరిచేశారు. చేతికి మట్టి అంటకుండా భర్త, తమ్ముడు, అన్న, అక్క, ఇలా అయినవారిని రంగంలోకి దించి మరీ చక్కబెట్టేశారు. అందినకాడికి సొమ్ములు చుట్టబెట్టేశారు. చట్టం చూస్తోందన్న బెరుకు, భవిష్యత్తులో జనానికి జవాబు చెప్పాలన్న భయం కూడా లేకుండా బరితెగించారు. తాజా మాజీ హోం మంత్రి తానేటి వనిత సాగించిన అవినీతి లీలలు వెలుగు చూస్తున్నాయి.

పాన్ పరేషాన్



భారీ స్కామ్‌లా పాన్ కార్డుల దుర్వినియోగం

మరణించిన వారి పేరిట లావాదేవీలు

వృద్ధులు, రైతులు, కార్డు వాడని వారే టార్గెట్

ఐటీ నోటీసులతో బాధితులు లబోదిబో

దేశవ్యాప్తంగా పలుచోట్ల కేసుల నమోదు 2

వేసవి నైరుతి!

2

రుతుపవనాలు వచ్చినా తగ్గని ఎండలు

ఎన్‌టీఏలో సంస్కరణలు!

సూచనలకు ఉన్నత స్థాయి కమిటీ

కోర్టు తీర్పు ఆధారంగా నీట్ పరిష్కారం

కేంద్ర ఉన్నతాధికారి వెల్లడి 2

24 లక్షల మంది భవిష్యత్తు గందరగోళం



నీట్‌లో వ్యవస్థీకృత అవినీతిని రుజువు చేస్తున్న అరెస్టులు

అయినా ఎప్పటిలాగే మోదీ మౌనం: రాహుల్ 2



అనంతపురం నగరంలో మంత్రి సత్యకుమార్ ర్యాలీ

వైసీపీ ఆస్పత్రులకు ఐదేళ్లు దోచిపెట్టారు

» ఆరోగ్య శాఖ నిధుల మళ్లింపుపై విచారణ చేస్తాం: సత్యకుమార్

అనంతపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజల ఆరోగ్యం కన్నా ఆ పార్టీతో అంటకాగే ఆస్పత్రులకు దోచిపెట్టడమే ధ్యేయంగా పనిచేశారని, వీటిపై సమగ్ర విచారణ చేసి తగిన చర్యలు చేపడతామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. ఆరోగ్య శాఖ నిధుల మళ్లింపు గురించి లోతైన విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లాలో మంగళవారం తొలిసారి పర్యటించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, నేతలు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి అనంతపురంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధిచేసే సమర్థ నాయకుడు సీఎం చంద్రబాబు అని, ఆయన నేతృత్వంలో ఏపీ అభివృద్ధికి చిరునామాగా మారుతుందని చెప్పారు. ఆరోగ్యశాఖలో అనేక అవకతవకలు జరిగాయని చెప్పారు. హాస్పిటల్స్ ఎంపానెల్‌లో అక్రమాలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.1500 కోట్లకుపైగా ఉన్నాయని విమర్శించారు. జాతీయ ఆరోగ్య మండలి నిబంధనలు పాటించకుండా వైద్య కళాశాలల ఏర్పాటు పేరిట వైసీపీ ఆర్భాటం చేసిందన్నారు.

ఏపీలో పరిశ్రమల స్థాపనకు కృషి

» విశాఖ ఉక్కు ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట: శ్రీనివాసవర్మ



న్యూఢిల్లీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో నూతన పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తానని భరోసానిచ్చారు. మంగళవారం ఢిల్లీలోని ఉద్యోగ భవన్‌లో కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రిగా ఉదయం 11 గంటలకు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా 12 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గడచిన ఐదేళ్లలో ఏపీలో పారిశ్రామిక విధ్వంసం జరిగిందని, కొత్త పరిశ్రమలు రాకపోగా రాష్ట్రం నుంచే పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోయాయని పేర్కొన్నారు. కొత్త పరిశ్రమల స్థాపనకు త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబును కలుస్తానన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ కూటమిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూడా ఉన్నారు కాబట్టి, వారితో సమావేశం నిర్వహించిన తర్వాత విశాఖ ఉక్కుపై సరైన నిర్ణయాన్ని వెల్లడిస్తామని తెలిపారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అనే సెంటిమెంట్ దెబ్బతినకుండా ఏపీ ప్రజల ప్రయోజనాలు కాపాడుతానని తెలిపారు. నరసాపురం పరిధిలోని ఎమ్మెల్యేల సహకారంతో లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తానని చెప్పారు. బాధ్యతలు స్వీకరించినవర్మకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, ఆరిమిల్లి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, పితాని సత్యనారాయణ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీని ఎయిర్‌లైన్ హబ్‌గా మారుస్తాం

» 3 నెలల్లో భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తి: రామ్మోహన్



శ్రీకాకుళం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఎయిర్‌లైన్ హబ్‌గా మారుస్తామని పౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. మంగళవారం శ్రీకాకుళంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'మూడోసారి ఎంపీగా ప్రజలు గెలిపించారు. చంద్రబాబు మరింత నమ్మకం ఉంచారు. దేశంలో ప్రధానమంత్రితో కలుపుకొని 30మంది కేంద్రమంత్రులతో ఉన్న పరిచయాలతో రాష్ట్రానికి శాఖల వారీగా నిధులు తీసుకువస్తాను. రాష్ట్రాన్ని హబ్‌గా మారుస్తాం. భోగాపురం ఎయిర్‌పోర్టు నత్తనడకన ఇంతవరకు పనులు జరిగాయి. మూడు నెలల్లో ఎయిర్‌పోర్టు పనులను పూర్తిచేయించి జాతికి అంకితమిస్తాం" అని స్పష్టం చేశారు.

ఐటీడీఏ, ఐసీడీఎస్ ప్రక్షాళనకు శ్రీకారం

» డోలీ మోతలు లేకుండా చేస్తాం: మంత్రి సంధ్యారాణి



విజయనగరం రూరల్, జూన్ 18: ఐటీడీఏ, ఐసీడీఎస్ విభాగాలను త్వరలోనే ప్రక్షాళన చేస్తామని స్త్రీ శిశుసంక్షేమ, గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మంగళవారం విజయనగరం టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ జగన్ పాలనలో ఈ శాఖల్లో ఏం జరుగుతుందో సంబంధిత వర్గాలకు కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో విద్యార్థుల మరణాలు సంభవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. వీటిని అరికట్టడానికి ప్రతి హాస్టల్‌కు ఒక ఏఎన్ఎంను నియమించే ఫైలుపై తొలి సంతకం చేసినట్లు తెలిపారు. చాలాచోట్ల గిరిజనులు డోలీలు కట్టి ఆస్పత్రులకు వెళ్లే ఘటనలు ఉన్నాయని, నివారించేందుకు గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.

పేదలకు సౌకర్యవంతమైన ఇళ్లు నిర్మిద్దాం

» కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయండి: పార్థసారథి

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదలకు అన్ని సౌకర్యాలతో గృహాలు నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందని, ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. మంగళవారం తొలిసారి రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయానికి వెళ్లి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా ఇళ్ల నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయి? మౌలిక సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆప్షన్-3 లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లతో సమావేశాలు నిర్వహించి, కేటాయించిన ఇళ్లను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కౌరవ సభ స్థానంలో గౌరవ సభ

» చంద్రబాబు నాయకత్వంలో అన్నీ మంచి రోజులే: భువనేశ్వరి



అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కౌరవ సభ స్థానంలో కొలువయ్యే గౌరవ సభ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేరుస్తుందని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి ఇక అన్నీ మంచి రోజులేనని మంగళవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. 'నాడు నిజం గెలవాలి కార్యక్రమంలో ప్రజల ఆవేదన చూశాను. వారి బాధలు విన్నాను. నాటి పాలకుల అణచివేతను అర్థం చేసుకున్నాను. కోరుకున్నట్లుగానే అద్భుతమైన ప్రజాతీర్పుతో ప్రజాపాలన మొదలైంది. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ప్రజలు తామే గెలిచామన్నంత సంతోషంగా ఉన్నారు. స్వేచ్ఛగా మాట్లాడుతున్నారు. నాడు జరిగిన అన్యాయాలను నిర్భయంగా ప్రస్తావిస్తున్నారు. అశాంతితో బతికిన ప్రజల మనసులు తేలిక పడ్డాయి. మహిళలు తమ రక్షణపై, తల్లులు తమ బిడ్డల భవిష్యత్‌పై ధైర్యంగా ఉన్నారు. ఇది నా మనసుకు ఎంతో సంతోషాన్నిచ్చింది. ఇక ప్రజలకు అంతా మంచే జరుగుతుంది. కూటమి ప్రభుత్వంలో.. చంద్రబాబు పాలనలో.. అమరావతి రాజధానిగా మళ్లీ గర్వంగా నిలబడుతుంది. రాజధాని రైతుల పోరాటాలు ఫలించి, వారి జీవితాల్లో చీకట్లు తొలగిపోయాయి. బాబు దీక్ష, పట్టుదలతో పోలవరం సవాళ్లను, విధ్వంసాన్ని అధిగమించి ముందడుగు వేస్తుంది. ప్రాణాలు పణంగా పెట్టి, పని చేసిన పార్టీ కార్యకర్తలకు గౌరవం దక్కుతుంది. ప్రజలు ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందనే పూర్తి నమ్మకం నాకుంది' అని పేర్కొన్నారు. పోలవరం పరిశీలనకు వెళ్లిన చంద్రబాబు ఫొటోలను తన పోస్టుకు జత చేశారు.

తప్పు జరిగితే ఒప్పుకోండి

(మొదటి పేజీ తరువాయి)



విచారణకు స్వీకరించింది. అయితే.. నీట్‌పై గతంలో దాఖలైన పిటిషన్లతో కలిపి దీన్ని కూడా జూలై 8నే విచారిస్తామని వెల్లడించింది. "వ్యవస్థను మోసం చేయడం ద్వారా ఒక వ్యక్తి డాక్టర్ అయితే ఎలా ఉంటుందో ఊహించండి. ఆ వ్యక్తి సమాజానికి మరింత హానికరం. పరీక్ష నిర్వహించే బాధ్యత కలిగిన ఏజెన్సీ నమ్మకంగా, న్యాయంగా వ్యవహరించాలి" అని జస్టిస్ భట్టి వ్యాఖ్యానించారు. నీట్ పరీక్షకు సిద్ధమయ్యే అభ్యర్థులు పడే కష్టం అందరికీ తెలిసిందేనని ఆయన గుర్తుచేశారు. "పరీక్షలు నిర్వహించే వ్యవస్థకు ప్రతినిధిగా మీరు దృఢమైన వైఖరి తీసుకోవాలి. ఏదైనా తప్పు జరిగి ఉంటే.. 'అవును, ఈ తప్పు జరిగింది. దీనిపై మేం ఈ చర్య తీసుకోబోతున్నాం' అని చెప్పాలి. కనీసం అప్పుడైనా మీ పనితీరుపై విశ్వాసం కలుగుతుంది. ఎంతో పోటీ నెలకొని ఉన్న ఈ పరీక్షల కోసం విద్యార్థులు ఎంత శ్రమ పడతారో మనందరికీ తెలుసు" అని ఎన్‌టీఏ తరఫు న్యాయవాదిని ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. నుంచి దీనిపై సకాలంలో చర్యలు ఆశిస్తున్నామని పేర్కొంటూ.. ఈ పిటిషన్‌పై రెండు వారాల్లో స్పందన తెలపాల్సిందిగా ఎన్‌టీఏకి, కేంద్రానికి ఆదేశాలు జారీచేసింది.

లీకేజీలకు అడ్డాలుగా బీజేపీ పాలిత రాష్ట్రాలు

నీట్ ప్రశ్నపత్రం లీకేజీతో 24 లక్షల మంది నీట్ విద్యార్థుల భవిష్యత్తు గందరగోళంగా మారినప్పటికీ ప్రధాని మోదీ ఎప్పటిలాగే మౌనంగా ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. బిహార్, హరియాణా, గుజరాత్‌లో జరిగిన అరెస్టులు.. నీట్ పరీక్షలో వ్యవస్థీకృత అవినీతి జరిగిందనే విషయాన్ని రుజువు చేస్తున్నాయని 'ఎక్స్' వేదికగా ఆయన ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు పేపర్ లీకేజీలకు కేంద్ర బిందువుగా మారాయని మండిపడ్డారు. పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా కఠిన విధానాలను రూపొందించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి తమ పార్టీ కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. బాధ్యతాయుత ప్రతిపక్షంగా వీధుల నుంచి పార్లమెంటు వరకూ యువత గళాన్ని వినిపిస్తామన్నారు. పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన చట్టాలను రూపొందించి యువత భవిష్యత్తుకు భరోసా ఇస్తామని తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చామని రాహుల్ గుర్తుచేశారు. నీట్ అక్రమాలు, పేపర్ లీకేజీ వ్యవహారం దేశంలో ప్రవేశ పరీక్షల వ్యవస్థనే దెబ్బతీశాయని కేరళ సీఎం విజయన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అవకతవకలపై కేంద్రంగానీ, ఎన్‌టీఏగానీ సంతృప్తికరమైన వివరణ ఇవ్వలేకపోయాయన్నారు.



నీట్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో ఆప్ నేతలు సంజయ్ సింగ్, గోపాల్ రాయ్ తదితరుల నిరసన ప్రదర్శన

ఎన్‌టీఏలో సంస్కరణలు!

సూచనలకు ఉన్నత స్థాయి కమిటీ

కేంద్ర ఉన్నతాధికారి ఒకరు వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 18: నీట్ పరీక్షల వివాదాల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)లో కీలక సంస్కరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎన్‌టీఏ కార్యకలాపాలు, పరీక్షల నిర్వహణలో విస్తృత మార్పులను పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మార్పులను సూచించేందుకు ఉన్నతస్థాయి కమిటీని వేసే అవకాశం ఉంది. ఈ నెల 4న వెలువడిన నీట్ ఫలితాలు దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నాయి. కోర్టుల్లో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. విద్యార్థులు మూడు అంశాలను ప్రధానంగా లేవనెత్తుతున్నారు. 1) కొంతమంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడం, 2) కొన్నిచోట్ల పరీక్ష పేపర్ లీక్ అయినట్లు ఆరోపణలు, 3) కొన్ని పరీక్ష కేంద్రాల్లో నిబంధనలు పాటించలేదన్న ఆరోపణలు. మొత్తం వ్యవహారంపై దర్యాప్తు జరపాలని, పరీక్షను మళ్లీ నిర్వహించాలని ఎక్కువ మంది కోరుతున్నారు. నీట్ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడ్డట్లు రుజువైతే బాధ్యులకు అత్యంత కఠినమైన శిక్ష పడేట్లు చూస్తామని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గత ఆదివారం హామీ ఇచ్చారు. ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని చెప్పారు. ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ, "ప్రస్తుతం వ్యవహారం కోర్టుల్లో ఉంది. విద్యాశాఖ, ఎన్‌టీఏ సమస్య వివరాలను పరిశీలిస్తున్నాయి. దర్యాప్తు, కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ప్రస్తుత సమస్య పరిష్కారం అవుతుంది. అది పూర్తవగానే నీట్ పరీక్షలకు సంబంధించి కీలక సంస్కరణలు జరుగుతాయి" అన్నారు. ఇందుకోసం విద్యాశాఖ కమిటీని వేయనుందని చెప్పారు. 2023 నవంబరులో ఎన్‌టీఏలో వివిధ పరీక్షలు రాయడానికి 1.23 కోట్ల మంది నమోదు చేసుకున్నారు. చైనాలోని గావ్‌కావ్ పరీక్ష తర్వాత ప్రపంచంలోనే అతిపెద్ద పోటీ పరీక్ష వ్యవస్థ ఎన్‌టీఏ. గత ఏడాది నవంబరులో నీట్ యూజీ పరీక్ష రాయడానికి 24 లక్షల మంది నమోదు చేసుకున్నారు. ఎన్‌టీఏ కింద జేఈఈ(14.7 లక్షల మంది), క్యూట్ యూజీ(13.4 లక్షల మంది) నమోదు చేసుకున్నారు. ఇవి కాకుండా అనేక ఇతర పోటీ పరీక్షలు ఎన్‌టీఏ కిందకు వస్తాయి.



వేసవి నైరుతి..!

» రుతుపవనాలు వచ్చినా తగ్గని ఎండలు

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ఉత్తరాంధ్రలో రెండు జిల్లాలు తప్ప దక్షిణ భారతం మొత్తం విస్తరించాయి. అయినప్పటికీ ముసురు వాతావరణం కనిపించడం లేదు. పైగా వేసవి మాదిరిగా ఎండలు, వడగాడ్పులు కొనసాగుతున్నాయి. మే నెల వరకు ఎండ ఒక్కటే ఉంది. జూన్‌లో ఎండకు ఉక్కపోత తోడైంది. ఈ వాతావరణం తొలకరి పనులకు అవరోధంగా మారింది. రుతుపవనాల సీజన్‌లో పొరలు పొరలుగా మేఘాలు ఆవరించి ఎక్కువ ప్రాంతాల్లో వర్షాలు కురవాలి. కానీ, అందుకు భిన్నంగా వేసవిలో మాదిరిగా క్యుములోనింబస్ మేఘాలు ఆవరించి కొద్దిప్రాంతాల్లో రెండు, మూడు గంటల వ్యవధిలో ఒక మోస్తరు నుంచి భారీవర్షం కురుస్తోంది. ఆ తర్వాత మళ్లీ మామూలే. వేడి సెగలు వస్తున్నాయి. దీంతో వాతావరణం చల్లబడడం లేదు సరికదా మరింత వేడెక్కుతుంది. అందుకే ప్రస్తుత కాలాన్ని 'వేసవి నైరుతి'గా పలువురు వాతావరణ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. అరేబియా సముద్రం మీదుగా వచ్చే నైరుతి రుతుపవనాలు బలంగా లేకపోవడంతో పది రోజుల నుంచి విజయనగరం వద్దే నిలిచిపోయాయి. రెండు మూడు రోజుల్లో రుతుపవనాల్లో కదలిక వచ్చే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

నేడు తేలికపాటి వర్షాలు

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న 24గంటల్లో రాష్ట్రంలో అనేక జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. బుధవారం అల్లూరి, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కడప, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మరికొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు పడతాయని పేర్కొంది.

రూ. 20వేల కోట్లు

పీఎం కిసాన్ నిధుల విడుదల

వారణాసి, జూన్ 18: రైతులకు వ్యవసాయంలో పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' 17వ విడత నిధులను ప్రధాని మోదీ మంగళవారం విడుదల చేశారు. యూపీలోని తన సొంత నియోజకవర్గమైన వారణాసిలో నిర్వహించిన 'పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళన్' కార్యక్రమంలో ఆయన ఈ నిధులను విడుదల చేశారు. దీంతో సుమారు 9.26 కోట్ల రైతుల ఖాతాల్లో రూ. 2వేల చొప్పున రూ.20వేల కోట్లు జమకానున్నాయి. మోదీ ఈ నెల 10వ తేదీన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పీఎం కిసాన్ 17వ వాయిదా చెల్లింపు దస్త్రంపైనే తొలి సంతకం చేశారు. కాగా, ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వారణాసిలో పర్యటించడం మోదీకి ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంగా మాత తనను దత్తత తీసుకుందని, తాను వారణాసి వాసుల్లో ఒకడినయ్యానని అన్నారు. కాశీ విశ్వనాథుని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా, ప్రతి నెల ఆఖరి ఆదివారం రేడియోలో ప్రసారమయ్యే 'మన్ కీ బాత్' జూన్ 30 నుంచి తిరిగి ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని మోదీ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఎన్నికల కారణంగా నిలిచిపోయిన మన్ కీ బాత్ ఈ నెల నుంచి పునఃప్రారంభమవుతుందని, విలువైన సలహాలు, సూచనలు అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మరోవైపు, జూన్ 21న కశ్మీర్‌లోని షేర్-ఈ-కశ్మీర్ అంతర్జాతీయ సమావేశ కేంద్రంలో మోదీ ఆధ్వర్యంలో ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాలను నిర్వహించనున్నారు.

'పాన్' పరేషాన్!



» భారీ స్కామ్‌లా పాన్ కార్డుల దుర్వినియోగం

» వృద్ధులు, రైతులు, కార్డు వాడని వారే టార్గెట్

» ఐటీ నోటీసులు.. తల పట్టుకుంటున్న బాధితులు

న్యూఢిల్లీ, జూన్ 18: మరణించిన వారు, నిరక్షరాస్యులు, వృద్ధులు, రైతులు, తరచూ పాన్ కార్డు వినియోగించని వ్యక్తుల పాన్ నంబర్లు దుర్వినియోగానికి గురవుతున్నాయని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' తాజాగా ఒక కథనంలో వెల్లడించింది. ఐటీ శాఖ వారికి నోటీసులు పంపిన తర్వాతే ఇలాంటివి వెలుగులోకి వస్తున్నాయని తెలిపింది. దీనికి సంబంధించి ఇప్పటికే దేశవ్యాప్తంగా అనేక కేసులు నమోదయ్యాయని అందులో పేర్కొంది. ముంబైకి చెందిన ఒక వృద్ధురాలు.. తన పాన్‌కార్డును దుర్వినియోగం చేశారనే ఆరోపణలతో ఆదాయ పన్ను అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఐటీఏటీ)లో కేసు ఎదుర్కోవాల్సి వచ్చింది. 2010-11లో ఆమె రూ.1.3 కోట్ల విలువైన ఆస్తిని తన ఆదాయంగా భావించి విక్రయించినట్టు ఐటీ అధికారులు ఐటీఏటీకి నివేదించారు. గతంలో ఎన్నిసార్లు నోటీసులు పంపినా ఆమె స్పందించలేదని ఆరోపించారు. ఇటీవల జరిగిన విచారణ సందర్భంగా.. ఆ వృద్ధురాలికి అవగాహన లేకపోవడం, కేన్సర్ రోగి కావడంతో గతంలో ఐటీశాఖ నోటీసులకు స్పందించలేదని ఆమె తరఫున సీనియర్ న్యాయవాది ట్రైబ్యునల్‌కు తెలిపారు. ఆస్తి రిజిస్ట్రేషన్ సమయంలో ఆమె పాన్ కార్డును ఎవరో దుర్వినియోగం చేశారని వాదనలు వినిపించారు. ఇదొక్కటే కాదు.. దేశవ్యాప్తంగా ఈ తరహా కేసులు చాలా వెలుగుచూస్తున్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన ఉషా సోనీ అనే వ్యక్తికి ఆమె మరణించిన పదేళ్ల తర్వాత రూ.7.5 కోట్లకు సంబంధించిన ఐటీ నోటీసులు అందాయి. అదేవిధంగా రాజస్థాన్‌కు చెందిన నందన్ లాల్ అనే చిరు వ్యాపారికి రూ.12.2 కోట్లకు ఐటీ నోటీసులు రావడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'పాన్ విషయంలో అత్యంత గోప్యత పాటించాల్సి ఉన్నా ప్రజలు వివిధ అవసరాల కోసం ఆ వివరాలను యథేచ్ఛగా పంచుకుంటున్నారు' అని చార్టర్డ్ అకౌంటెంట్ చేతన్ వజానీ అన్నారు. సీబీడీటీ కూడా దీనిపై స్పందించింది. వ్యక్తులు తమ పాన్ వివరాలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తప్పనిసరి కాని చోట, పబ్లిక్ డొమైన్‌లలో పంచుకోకూడదని సూచించింది. ఎవరికైనా తమ పాన్ కార్డు దుర్వినియోగమైనట్టు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించింది. కాగా, వివిధ ఏజెన్సీలు దాఖలు చేసిన సమాచారంపై పూర్తిగా ఆధారపడుతున్న ఐటీ శాఖ.. పన్ను చెల్లింపుదారులపై చర్యలు తీసుకోవడం తీవ్రమైన అంశమని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసినప్పుడల్లా ఆ సమాచారం ఐటీ శాఖకు వెళ్లేలా ఏర్పాటు ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఎప్పుడైనా కూలొచ్చు!

» చాలా బలహీనంగా ఎన్డీఏ సర్కారు

» మాతో ఎన్డీఏ నేతల సంప్రదింపులు

» 'ఫైనాన్షియల్ టైమ్స్'కు రాహుల్ ఇంటర్వ్యూ

న్యూఢిల్లీ, జూన్ 18: కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి చాలా బలహీనంగా ఉందని, చిన్నపాటి సమస్య తలెత్తినా పడిపోతుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పారు. కూటమి నుంచి ఏ ఒక్క పార్టీ బయటకొచ్చినా గందరగోళం మొదలవుతుందన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉందని, కొన్ని పార్టీల నేతలు తమతో సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. అయితే, వారు ఎవరనేది వెల్లడించలేదు. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ పత్రిక 'ఫైనాన్షియల్ టైమ్స్'కు రాహుల్ ఇంటర్వ్యూ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో మోదీ అనే భావన, మోదీ ఇమేజ్ పూర్తిగా ధ్వంసమయ్యాయని.. భారత రాజకీయాల్లో భూకంపం సంభవించిందని రాహుల్ వ్యాఖ్యానించారు. 2014, 2019ల్లో మోదీ పట్టిందల్లా బంగారమయ్యిందని, ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని.. కాబట్టే, అధికార కూటమికి ఇబ్బందులు తప్పవన్నారు. 'ద్వేషాన్ని, ఆగ్రహాన్ని వ్యాప్తి చేసి దాన్నించి లాభపడదామనుకునే(బీజేపీ) భావజాలాన్ని ఈ ఎన్నికల్లో భారతీయ ఓటర్లు తిరస్కరించారు. బీజేపీ తీవ్రంగా దెబ్బతిన్నది. మూసుకుపోయిన భారతీయ రాజకీయ వ్యవస్థను ఓటర్లు తెరిచారు' అని పేర్కొన్నారు.

తీవ్ర ఇబ్బందుల మధ్య పోరాడాం!

మోదీ హయాంలో ప్రతిపక్షాలు తీవ్ర సమస్యలను ఎదుర్కొన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. 'న్యాయవ్యవస్థ, మీడియా, ప్రభుత్వ యంత్రాంగం, అధికారిక సంస్థలు.. అన్నీ మాకు తలుపులు మూసేశాయి. దీంతో మాకు ప్రజల వద్దకు వెళ్లటం మినహా మరో దారి లేకుండా పోయింది' అని చెప్పారు. దీంట్లో భాగంగానే భారత్ జోడోయాత్ర, భారత్ జోడో న్యాయ్‌యాత్రలను చేపట్టానన్నారు. 'మా చేతులు వెనక్కి కట్టేశారు. అయినా మేం పోరాడాం' అని రాహుల్ పేర్కొన్నారు. అయోధ్య గురించి మాట్లాడుతూ పదేళ్లు గడిపిన పార్టీని (బీజేపీ) అయోధ్యలోనే ఓటర్లు తుడిచిపెట్టారని గుర్తు చేశారు. బీజేపీకి పునాదిలా తయారైన.. మత విద్వేషాన్ని నిర్మించటం అనే మూలసిద్ధాంతం ఈ ఎన్నికల్లో కుప్పకూలిందన్నారు. ఎన్నికలు నిష్పక్షపాత పరిస్థితుల్లో జరిగి ఉంటే ఇండియా కూటమి లోక్‌సభలో మెజారిటీ సాధించి ఉండేదని, దాంట్లో సందేహం లేదని చెప్పారు. ఎన్నికల వేళ ఇండియా కూటమి నేతలను జైలుకు పంపారని తెలిపారు.

మోదీ రెండు చోట్ల పోటీ చెయ్యలేదా?

వయనాడ్ లోక్‌సభ స్థానం ఉపఎన్నికలో ప్రియాంక గాంధీ పోటీ చేయనుండడం రాజకీయ దుమారం రేపింది. వయనాడ్ ప్రజలను మోసగించిన కాంగ్రెస్ వారసత్వ రాజకీయాలకు ఇదే నిదర్శనమని బీజేపీ విమర్శించింది. అయితే, 2014లో మోదీ ఏం చేశారో మరచిపోయారా? అంటూ కాంగ్రెస్ కౌంటరిచ్చింది. బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పందిస్తూ.. వయనాడ్ ప్రజలను మోసగించిన కాంగ్రెస్ పార్టీ వారసత్వ రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నేతలు పవన్ ఖేరా, వీడీ సతీశన్ మాట్లాడుతూ.. 2014 ఎన్నికల్లో వడోదర, వారాణసీ స్థానాల్లో గెలిచిన మోదీ వడోదర స్థానాన్ని వదులుకున్నారని గుర్తు చేశారు. కాగా, రాహుల్ గాంధీ వయనాడ్ స్థానానికి రాజీనామా చేశారు.

మోసం చేస్తే సహించం

» రేషన్ తూనికల్లో మోసాలపై కఠిన చర్యలు: నాదెండ్ల

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు ఏదైతే మార్పు కోరుకున్నారో.. అందుకనుగుణంగా నిజాయితీగా, చట్టప్రకారం కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతామని, ప్రజలను మోసం చేసి, ఇబ్బందులు పెట్టే కార్యక్రమాలను సహించబోమని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం చెల్లించే కనీస మద్దతు ధరకు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి ముందుకు వచ్చే రైతులకు మేలు చేయడంతోపాటు రేషన్ సరుకులు, బహిరంగ మార్కెట్లో సరుకులు, వస్తువుల తూకాల్లో తేడాల్లేకుండా వినియోగదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ సరుకుల తూకాల్లో తేడాలను గుర్తించిన మంత్రి మనోహర్ మంగళవారం విజయవాడలోని సివిల్ సప్లయిస్ ప్రధాన కార్యాలయంలో తూనికలు, కొలతలశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. రేషన్ సరుకుల పంపిణీలో మోసాలకు తావు లేకుండా ప్రజా పంపిణీ వ్యవస్థలో తీసుకురావాల్సిన సంస్కరణలపై చర్చించారు. పౌరసరఫరాలశాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, తూనికలు, కొలతలశాఖ ఉన్నతాధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

వాణిజ్య ప్రకటనలకు స్వీయ ధ్రువీకరణ

» మంగళవారం నుంచి అమల్లోకి కొత్త నిబంధన

» సుప్రీం ఆదేశాల మేరకు విధించిన కేంద్రం

» కొత్త యాడ్స్‌కే పరిమితం.. పాతవాటికి వర్తించదు

» ఈ నిబంధనతో ఇబ్బందే అంటున్న ప్రకటనకర్తలు

న్యూఢిల్లీ, జూన్ 18: వాణిజ్య ప్రకటనలకు 'స్వీయధ్రువీకరణ పత్రం' సమర్పించడాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్రం తెచ్చిన నిబంధన మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది! రాందేవ్‌బాబా పతంజలి కేసును విచారించిన సుప్రీంకోర్టు.. ప్రకటన కర్తలు, ఏజెన్సీలు మీడియాకు వాణిజ్యప్రకటనలు ఇచ్చేటప్పుడు స్వీయధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సిందేనంటూ మే 7న తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఆ తీర్పు మేరకు.. ఈ నెల 3న కేంద్ర సమాచార ప్రసార శాఖ స్వీయధ్రువీకరణను తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆ నిబంధనను వెంటనే అమల్లోకి తేకుండా.. ప్రకటనకర్తలు/ఏజెన్సీలు ఈ నిబంధనను పాటించడానికి రెండు వారాల గడువు ఇచ్చింది. 18వ తేదీ, ఆ తర్వాత నుంచి ప్రచురించే/ప్రసారం చేసే అన్ని కొత్త వాణిజ్యప్రకటనలకూ స్వీయధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఇప్పటికే ప్రచురిస్తున్న/ప్రసారం చేస్తున్న ప్రకటనలకు మాత్రం ప్రస్తుతానికి ఈ నిబంధన వర్తించదని కేంద్రం వెల్లడించింది. టీవీ/రేడియోలో ఇచ్చే వాణిజ్య ప్రకటనలకు అడ్వర్టైజర్లు సమాచార, ప్రసార శాఖకు చెందిన 'బ్రాడ్‌కాస్ట్ సేవా పోర్టల్'లో.. ప్రింట్/డిజిటల్ మీడియాలో ఇచ్చే వాణిజ్య ప్రకటనలకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పోర్టల్‌లోను స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని వివరించింది. ఆ రెండు పోర్టళ్లలో ఇందుకు తగిన ఏర్పాట్లు చేసినట్టు పేర్కొంది.

ఏమని ధ్రువీకరించాలంటే..

తమ వాణిజ్య ప్రకటనలో తప్పుదోవ పట్టించే వివరాలేవీ లేవని.. తమ వాణిజ్య ప్రకటన సంబంధిత నియంత్రణ నిబంధనలకు లోబడే ఉందని.. ప్రకటనకర్తలు/ఏజెన్సీలు తాము సమర్పించే స్వీయధ్రువీకరణ పత్రంలో స్పష్టం చేయాలి. ఈ పత్రాన్ని సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, అలా అప్‌లోడ్ చేసినట్టుగా రుజువును.. ఆ వాణిజ్యప్రకటనను ప్రచురించే/ప్రసారం చేసే మీడియా ప్లాట్‌ఫామ్‌కు సమర్పించాలి. స్వీయధ్రువీకరణ పత్రం లేనిదే ప్రసారమాధ్యమాలు వాటిని ప్రచురించకూడదు/ప్రసారం చేయకూడదు. వినియోగదారుల హక్కుల సంరక్షణ, పారదర్శకత, సహేతుకమైన వాణిజ్యప్రకటనల విధానాన్ని ప్రోత్సహించేందుకే.. సుప్రీం ఆదేశాల మేరకు తాము ఈ చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్రం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఏజెన్సీల ఆందోళన..

స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసినప్పటి నుంచే ప్రకటనకర్తలు, ఏజెన్సీలు ఈ నిబంధనపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిబంధన.. 'పిడుక్కి, బియ్యానికి ఒకటే మంత్రం' అన్న చందంగా ఉందన్న వాణిజ్యప్రకటనల పరిశ్రమ పెద్దల మాట. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న 'ద ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఏఎంఏఐ)' కూడా ఈ నిబంధనపై అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. వాణిజ్య పరిశ్రమ నుంచే కాక.. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. 800కు పైగా ప్రచురణ సంస్థలను సభ్యులుగా కలిగిన 'ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్)' కేంద్రానికి ఇప్పటికే ఒక లేఖ రాసింది. పత్రికల్లో, టీవీల్లో వచ్చే యాడ్స్‌పై మనకు ఏవైనా అభ్యంతరాలుంటే వాటిపై ఫిర్యాదు చేసేందుకు 'భారత వాణిజ్య ప్రకటనల ప్రమాణాల మండలి (ఏఎస్‌సీఐ)' ఉంది. ఆ సంస్థ తనకు వచ్చే ఫిర్యాదులను పరిశీలించి వాటిని పరిష్కరిస్తుంది. ఏఎస్‌సీఐ చేసే సూచనలను అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు తప్పనిసరిగా స్వీకరించి, పాటిస్తాయి. ఇలా ఇప్పటికే ఒక వ్యవస్థ ఉండగా.. కొత్తగా ఈ స్వీయధ్రువీకరణ దేనికనే ప్రశ్న వినిపిస్తోంది.

న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్‌గా జస్టిస్ దుర్గాప్రసాదరావు



అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్‌గా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యూ దుర్గాప్రసాద రావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. హైకోర్టులో రెండో స్థానంలో ఉన్న న్యాయమూర్తిని కార్యనిర్వాహక చైర్మన్‌గా నియమించడం సంప్రదాయంగా వస్తుంది. ఇటీవల వరకు ఆ బాధ్యతలను నిర్వహించిన జస్టిస్ ఏవీ శేషసాయి పదవీ విరమణ చేయడంతో ఆ పోస్టు ఖాళీ అయ్యింది. దీంతో సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ దుర్గాప్రసాద్ ఆ పోస్టులో నియమితులయ్యారు.

అడ్వకేట్ జనరల్‌గా దమ్మాలపాటి!



(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దమ్మాలపాటి 2014 జూన్ 30 నుంచి 2016 మే వరకు అదనపు అడ్వకేట్ జనరల్(ఏఏజీ)గా సేవలు అందించారు. 2014 జూన్ నుంచి ఏజీగా వ్యవహరించిన సీనియర్ న్యాయవాది పి.వేణుగోపాల్ తన పదవికి రాజీనామా చేయడంతో 2016 మే 28న దమ్మాలపాటిని ప్రభుత్వం ఏజీగా నియమించింది. అప్పటి నుంచి వైసీపీ ప్రభుత్వం వచ్చే వరకు ఆయన సేవలు అందించారు. ఈ అనుభవమే ప్రస్తుతం ఆయన రెండోసారి ఏజీగా నియమితులయ్యేందుకు దోహదపడింది. అధికారిక ఉత్తర్వులు వెలువడిన అనంతరం గురువారం ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

వైసీపీ సర్కారుపై పోరాటంలో కీలకపాత్ర

2019లో జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత దమ్మాలపాటిపై క్రిమినల్ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారు. వాటన్నిటినీ ఆయన సమర్థంగా ఎదుర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి, నాటి విపక్ష నేత చంద్రబాబుపై వైసీపీ ప్రభుత్వం 2023 సెప్టెంబరు 9 నుంచి వరుస కేసులు నమోదు చేసింది. ఆయన్ను అరెస్టు చేసి జైలులో ఉంచిన సందర్భంలో ఏసీబీ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో జరిపిన న్యాయపోరాటంలో దమ్మాలపాటి కీలక పాత్ర పోషించారు. అలాగే కక్షసాధింపుల్లో భాగంగా అప్పటి వైసీపీ ప్రభుత్వం పలువురు టీడీపీ నేతలు, పలు మీడియా సంస్థలపై తప్పుడు కేసులు పెట్టి వేధించగా.. వారి తరఫున గట్టిగా వాదనలు వినిపించి తప్పుడు కేసులను తిప్పికొట్టారు. రాజధాని అమరావతి ప్రాంతంలో మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా రాజధానియేతర ప్రాంతవాసులకు వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రయత్నించగా.. ఈ వ్యవహారంలో దాఖలైన వ్యాజ్యాల్లో రైతుల తరఫున సమర్థంగా వాదనలు వినిపించారు.

ఏఏజీగా పలు కీలక కేసుల్లో..

దమ్మాలపాటి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రెండేళ్లు ఏఏజీగా వ్యవహరించినప్పుడు కూడా.. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ కేసులు, పట్టిసీమ ప్రాజెక్టు కేసుల్లో సమర్థంగా వాదనలు వినిపించారు. చిత్తూరు జిల్లాలో హీరోమోటోకార్ప్‌నకు కేటాయించిన భూముల వివాదంలో వాదనలు వినిపించి ప్రాజెక్టు నెలకొల్పడంలో కీలకంగా వ్యవహరించారు. రాజధాని అమరావతి ఏర్పాటు కోసం చేపట్టిన భూసమీకరణ పథకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాల్లోనూ కీలక వాదనలు వినిపించి ప్రాజెక్టుకు ఉన్న అవాంతరాలను అధిగమించారు.

రెండ్రోజుల క్రితమే నిర్ణయం

వాస్తవానికి రెండ్రోజుల క్రితమే ముఖ్యమంత్రి చంద్రబాబు దమ్మాలపాటిని పిలిచి ఏజీగా బాధ్యతలు చేపట్టాలని సూచించారు. అయితే గవర్నర్ అబ్దుల్ నజీర్ విజయవాడలో లేకపోవడంతో.. వైసీపీ ప్రభుత్వంలో అడ్వకేట్ జనరల్‌గా వ్యవహరించిన ఎస్.శ్రీరామ్, ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.నాగిరెడ్డి రాజీనామాలు ఆమోదం పొందడంలో జాప్యం చోటుచేసుకుంది. దీంతో దమ్మాలపాటి నియామకం కొంత ఆలస్యమైంది. రాష్ట్రప్రభుత్వం మంగళవారం వారి రాజీనామాలు ఆమోదించింది. అనంతరం కొత్త ఏజీ నియామకానికి చర్యలు చేపట్టింది.

నేపథ్యం..

దమ్మాలపాటి శ్రీనివాస్ స్వగ్రామం ఉమ్మడి కృష్ణా జిల్లా కంచికచర్ల. ఆయన తండ్రి దమ్మాలపాటి నాగేశ్వరరావు, విజయలక్ష్మి. పూర్తిగా వ్యవసాయ నేపథ్యం. కంచికచర్లలో పాఠశాల విద్యను పూర్తి చేసిన శ్రీనివాస్.. విజయవాడ పి.బి సిద్ధార్థ కళాశాలలో డిగ్రీ పట్టా పొందారు. విజయవాడలోని వెలగపూడి దుర్గాంబ న్యాయ కళాశాల నుంచి 1991లో న్యాయ శాస్త్రంలో పట్టాపొందారు. అదే ఏడాది బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. ఉమ్మడి హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించారు. సీనియర్ న్యాయవాది ఎస్ఆర్ అశోక్ వద్ద రాజ్యాంగం, సివిల్, క్రిమినల్, పన్నులకు సంబంధించిన కేసులు వాదించడంలో నైపుణ్యం సాధించారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో పాటు పలు ప్రభుత్వరంగ సంస్థలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవహరించారు. అలాగే అనేక కార్పోరేట్ సంస్థలకు న్యాయసలహాదారుగా సేవలు అందించారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 59% ఉత్తీర్ణత

ఫస్టియర్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ ఫలితాలు 26న

ఇకపై రీకౌంటింగ్ ఉండదన్న అధికారులు

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ద్వితీయ సంవత్సరంలో 59శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆన్‌లైన్ మూల్యాంకనంతో జరిగిన జాప్యం వల్ల కేవలం ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాలను ఇంటర్ విద్యామండలి మంగళవారం విడుదల చేసింది. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వీవీ సుబ్బారావు వివరాలు వెల్లడించారు. జనరల్ కోర్సుల విద్యార్థులు 115319 మంది పరీక్షలు రాయగా 68,070(59శాతం) ఉత్తీర్ణులయ్యారని, ఒకేషనల్ విద్యార్థులు 11,871 మందికిగాను 6,798 (57శాతం) ఉత్తీర్ణత సాధించారని వివరించారు. మొత్తంగా 58.86శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. కేటగిరీల వారీగా చూస్తే అబ్బాయిలు 59 శాతం, అమ్మాయిలు 58శాతం మంది పాసయ్యారు. ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలతో కలిపి చూస్తే జనరల్ విద్యార్థులు 87శాతం మంది, ఒకేషనల్ విద్యార్థులు 84శాతం మంది సెకండియర్‌లో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఈ ఏడాది సప్లిమెంటరీ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో మూల్యాంకనం చేశామని, అందువల్ల రీకౌంటింగ్ ఉందని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో కౌంటింగ్ పొరపాట్లు రావన్నారు. రీవెరిఫికేషన్ కావాలంటే ఈ నెల 20 నుంచి 25లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఒక్కో పేపరుకు రూ.వెయ్యి ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఫస్టియర్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ ఫలితాలను ఈ నెల 26న విడుదల చేస్తామని చెప్పారు.

ఏపీపీజీఈసెట్‌లో 90.44 % ఉత్తీర్ణత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 18: ఫార్మసీ, ఇంజనీరింగు పీజీ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీపీజీఈసెట్-2024 ఫలితాలను ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి మంగళవారం తిరుపతిలో విడుదల చేశారు. 8706 మంది పరీక్షలు రాశారని.. 90.44 శాతం అంటే 78,744 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఫలితాల కోసం..హెచ్‌టీటీపీఎస్.సెట్స్‌ఏపీఎస్‌సీహెచ్ఈ.ఎపి.గవర్నమెంట్.ఇన్.పీజీసెట్స్. వెబ్‌సైట్ చూడాలని కోరారు.



శారదా పీఠాధిపతికి సెక్యూరిటీ (ఫైల్ ఫొటో)

సెక్యూరిటీ ఎందుకు స్వామీ?

- శారదా పీఠాధిపతికి ఇద్దరు గన్‌మెన్లు.. ఉత్తరాధికారికి కూడా
- పీఠం వద్ద పోలీసులతో బందోబస్తు.. జగన్ హయాంలో ఏర్పాటు
- వారికి భద్రత అవసరమా?.. దృష్టి సారించిన కొత్త ప్రభుత్వం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సంసారం వదిలేసి సన్యాసి జీవితం గడిపేవారికి సైతం నాడు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం భద్రత ఏర్పాటు చేసింది. విశాఖపట్నంలోని శారదా పీఠం నిర్వాహకులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతికి చెరో ఇద్దరు గన్‌మెన్లను ఇచ్చింది. రాష్ట్రంలో ఏ స్వామికీ లేని సెక్యూరిటీ వీరికి ఎందుకు అంటూ కొందరు...టీడీపీ ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో ఎంతమంది పీఠంలో పనిచేస్తున్నారు....వారికి ఎంత వ్యయం అవుతున్నదో వివరాలు పంపాల్సిందిగా కోరినట్టు తెలిసింది. త్వరలోనే దీనిపై ఒక నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. జగన్ హయాంలో చినముషిడివాడలోని శారదా పీఠం వద్ద ఒక ఏఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లను బందోబస్తు కోసం ఏర్పాటుచేశారు. ఐదేళ్ల క్రితం వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచే సాములోరికి భద్రత కల్పిస్తున్నారు. అంతకుముందు లేదు. జగన్ ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చీఫ్ సెక్రటరీలు, సెక్రటరీలు, కమిషనర్లు, ఎస్పీలు.... ఇలా అనేక మంది .... స్వాములను దర్శించుకొని కోర్కెల చిట్టా విప్పి సిఫారసులు చేయించుకునేవారు. ఈ బుగ్గ కార్ల వెంబడి వచ్చే వైసీపీ నాయకులు, కార్యకర్తలను అదుపు చేయడానికి పోలీసు బందోబస్తు ఇచ్చారు. గతంలో ఈ స్వాములు తిరుపతి, హరిద్వార్, కాశీ వంటి పుణ్యక్షేత్రాలకు రైలులో వెళ్లేవారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ప్రత్యేక విమానాల్లో రాకపోకలు చేస్తున్నారు. అందులో వీరు తప్ప ఇంకెవరూ ఉండరు. విశాఖ విమానాశ్రయంలో కూడా వీరికి ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి. వీరు ప్రయాణికులందరితో పాటు వెళ్లి చెకిన్ చేసుకోరు. ముందుగానే ఆ ఏర్పాట్లు జరిగిపోతాయి. స్వాములు రాగానే సెక్యూరిటీ సిబ్బంది తలుపులు బార్లా తెరిచి పట్టుకుంటే...భుజాన కర్ర వేసుకొని, పంచెను సర్దుకుంటూ నేరుగా వెళ్లిపోతారు. ఇప్పుడు ఇవన్నీ చర్చనీయాంశంగా మారాయి.



ఆర్యాపేటలో కార్మికులతో కలిసి పని చేస్తున్న మంత్రి నిమ్మల

పోలవరాన్ని ప్రశ్నార్థకం చేసిన జగన్

- మళ్లీ మొదటికొచ్చిన ప్రాజెక్ట్ పనులు: మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, పాలకొల్లు రూరల్, జూన్ 18: పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని జగన్ ప్రశ్నార్థకం చేశారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మంగళవారం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు పనులను చంద్రబాబు 70శాతం పూర్తి చేశారని చెప్పారు. అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో 13 నెలలు పనులు నిలిపేసిందని, అదే సమయంలో గోదావరికి వరదలు రాగా, డయాఫ్రం వాల్‌ను కాపాడకుండా గాలికొదిలేశారన్నారు. దీంతో డయాఫ్రం వాల్ నాలుగుచోట్ల భారీగా దెబ్బతిందని తెలిపారు. దీని మరమ్మతులకు రూ.447కోట్లు ఖర్చవుతుందని, మరమ్మతులు చేపట్టినా పూర్తిగా ఆగుతుందో లేదో నమ్మకం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు చెప్పారన్నారు. కొత్తగా డయాఫ్రం వాల్ నిర్మాణానికి రూ.996 కోట్లు అవుతుందని, 4 సీజన్లలోగానీ ప్రాజెక్ట్ పనులు పూర్తి కావని చెప్పారు. అంటే పోలవరం ప్రాజెక్ట్ పనులు పూర్తిచేయడానికి నాలుగేళ్లు పడుతుందన్నారు. కాగా.. మంత్రి పదవి చేపట్టినప్పటికీ ప్రజా సేవకుడినేనని నిమ్మల స్పష్టంచేశారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం ఆర్యాపేటలో ఆయన కార్మికులతో కలిసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల షెల్టర్ నిర్మాణ పనులు చేశారు. సొంత నిధులతో ఆ విగ్రహాలకు షెల్టర్ నిర్మిస్తానని గతంలో ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు చేపట్టిన పనులను మంగళవారం ఆయన పరిశీలించిన కార్మికులతో కలిసి పనులు చేశారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మరో ఘోరం

ఇది రాజకీయానికి సమయం కాదు అని రైల్వేమంత్రి అశ్విన్ వైష్ణవ్ ఎంతో గొప్పగా వ్యాఖ్యానిస్తున్నారు కానీ, పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రైలుప్రమాదం విపక్షాలు డిమాండ్ చేస్తున్నట్టుగా రైల్వేవ్యవస్థ సమూల ప్రక్షాళన అవసరాన్ని గుర్తుచేస్తోంది. సరిగ్గా ఏడాదిక్రితం ఒడిశాలోని బాలాసోర్‌లో మూడురైళ్ళు ఢీకొని దాదాపు మూడువందలమంది మరణించారు. ఇప్పుడు కంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్‌ను గూడ్స్ రైలు వెనకనుంచి ఢీకొంది. ప్రమాదం తీవ్రత ఏ స్థాయిలో ఉన్నదంటే, గూడ్స్‌రైలు బోగీలు అనేకం ధ్వంసమైనాయి, కొన్ని బోగీలు ఏకంగా గాలిలోకి లేచివున్న దృశ్యాలు కూడా చూశాం. ఈ గూడ్స్‌రైలు స్థానంలో మరో ఎక్స్‌ప్రెస్ రైలు ఉండివుంటే ఊహకు అందనంత విధ్వంసం జరిగివుండేది. సరిగ్గా ఏడాదిలో బాలాసోర్ స్థాయి ఘోరం మరొకటి మనం చూడాల్సివచ్చేది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చాలా రంగాల్లో అద్భుతాలు సాధిస్తున్నాం కానీ, రైల్వేని మాత్రం ఉద్ధరించలేకపోతున్నాం. నిజానికి, సాంకేతికత పెరుగుతున్నకొద్దీ ప్రమాదాలు తగ్గాలి. కానీ, ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయంటే, ఉద్యోగాలను కుదించే టెక్నాలజీయే తప్ప, ప్రాణాలు రక్షించే పరిజ్ఞానం మీద అది శ్రద్ధ పెట్టడం లేదని అర్థం. దశాబ్దాలుగా అవే ప్రమాదాలు, విచారణ కమిషన్లు, మంత్రులూ అధికారుల సమర్థనలూ వింటున్నాం, చూస్తున్నాం. ఇక, ఈ దుర్ఘటన జరగడానికి సరిగ్గా మూడుగంటల ముందు సిగ్నలింగ్ వ్యవస్థ పాడైందని, స్టేషన్‌మాస్టర్ ఈ రెండు రైళ్ళను ఒకదానివెనుక మరొకటి అనుమతించారని వార్తలు వచ్చాయి. ఈ ప్రత్యేకపరిస్థితిలో రెడ్‌సిగ్నల్ దాటినప్పటికీ వెనుక ఉన్న గూడ్స్‌రైల్ నెమ్మదిగా పోవాల్సివుండగా, డ్రైవర్ వేగాన్ని తగ్గించకపోవడం పెను ప్రమాదానికి దారితీసిందని అంటున్నారు. సిగ్నల్ ఎందుకు పనిచేయ లేదు, అడపాదడపా అది విఫలం అవుతున్నదన్నమాట నిజమేనా, ఉన్నతాధికారులకు ఆ విషయం తెలుసునా ఇత్యాదివి విచారణలో బయటకు రావాల్సివుంది. అలాగే, ఈ ప్రమాదంలో మానవ తప్పిదాలు, నిర్లక్ష్యాలు, వైఫల్యాల శాతం ఎంతో కూడా నిగ్గుతేల్చాల్సివుంది.

బాలాసోర్ ఘటన మన పాలకుల, అధికారుల మనసులను బాధించినట్టు లేదు. ఆ తరువాత కూడా చాలా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. గత ఏడాది విజయనగరం జిల్లాలో ఆగివున్న ప్యాసింజర్ రైలును మరో రైలు వెనుకనుంచి వచ్చి ఢీకొట్టడంతో పద్నాలుగుమంది ప్రాణాలు కోల్పోయారు. విశాఖ–రాయగడ ప్యాసింజర్ రైలు పైలట్, కో పైలట్ ఇద్దరూ క్రికెట్ మ్యాచ్ చూస్తూ రెడ్‌సిగ్నల్ పట్టించుకోక ఈ ప్రమాదానికి కారకులైనారని రైల్వేమంత్రి అప్పట్లో ప్రకటించారు. కానీ, ఆ తరువాత అది నిజం కాదనీ, దర్యాప్తులో తగిన ఆధారాలు దొరకలేదనీ తేల్చారు. మరి, ప్రమాదం ఎందుకు జరిగిందన్నది ఓ శేషప్రశ్న. లోకోపైలట్లు ఏమరుపాటుగా ఉండకుండా చూడటానికి వారికి పంపే సందేశాలను ఒకటికి రెండు సార్లు పునరుద్ఘాటించే పద్ధతి పాటిస్తున్నట్టుగా అధికారులు చెబుతున్నారు. అటువంటప్పుడు నిర్లక్ష్యం కారణంగా జరిగే ఇటువంటి ప్రమాదాల సంఖ్య బాగా తగ్గాలి.

ప్రమాదాలు జరిగినప్పుడల్లా కవచ్ ఎందుకులేదన్న ప్రశ్న వినబడుతూనే ఉంది. అన్నిరూట్లలోనూ అమలుచేయాలనీ, అన్ని రైళ్ళకూ ఆ రక్షణకవచాన్ని అమర్చాలనీ సంకల్పమైతే ఉన్నది కానీ, ఆ దశలవారీ విధానం ఎప్పటికీ పూర్తికావడం లేదు. తయారీసంస్థల సంఖ్య పరిమితంగా ఉన్నందున, ప్రధానమైన, ఖరీదైన, అధిక రద్దీ రూట్లలో దానిని నెలకొల్పడమే ఇంకా పూర్తికాలేదు. కానీ, వేగంగా పరిగెత్తే రైళ్ళ సంఖ్య మాత్రం మరోపక్క పెరిగిపోతోంది. బాలాసోర్ రైలు దుర్ఘటన తరువాత, ఈ ఏడాదికాలంలో కవచ్ వ్యవస్థ ఏర్పాటు ఒక్క కిలోమీటర్ కూడా జరగలేదని కాంగ్రెస్ అంటోంది. రైల్వేల్లో ఖాళీగా ఉన్న మూడులక్షల పోస్టులను భర్తీచేయకపోవడం, కేవలం నాలుగేళ్ళలో లక్షమంది రైలుప్రమాదాల్లో మరణించడం, 'రైల్ సురక్షాకోశ్' నిధులను 75శాతం మేరకు కుదించడం, రైళ్ళలో జనరల్ బోగీల సంఖ్యను తగ్గించి నిరుపేదలకు అన్యాయం చేయడం, రైల్వేబడ్జెట్‌ను జనరల్ బడ్జెట్‌లో కలిపివేసి జవాబుదారీతనం నుంచి ప్రభుత్వం తప్పించుకోవడం ఇత్యాది పలు అంశాలతో కాంగ్రెస్ వేసిన ప్రశ్నలు సముచితమైనవి. మరో రెండేళ్ళలో తమ బుల్లెట్ ట్రైన్ కల నెరవేరుతుందని సంతోషిస్తున్న పాలకులకు, ఈ దేశంలో సగటు రైలు ప్రయాణీకుడి ప్రాణం ప్రమాదంలో ఉన్నదని, వారిని భద్రంగా గమ్యస్థానాలకు చేర్చే అంశంమీద కాస్తంత దృష్టిపెట్టాలని మొన్నటి రైలు ప్రమాదం హెచ్చరిస్తోంది.


వారికీ అవ్వాతాతలుంటారుగా!

యాభైఏళ్ల ఉద్యోగిని... ఆఫీసుకు వెళ్లేందుకు బస్సుకోసం బస్టాప్‌లో నిల్చుని ఉన్నారు. ఇద్దరు పోలీసులు హడావుడిగా వచ్చి, ఇక్కడ నిల్చుని ఉండకూడదు... కూర్చోండి... కూర్చోండి అంటూ ఉద్యోగినితో సహా అక్కడ ఉన్నవారినందరినీ నేలపై కూర్చోమని చెప్పారు. ఎందుకు ఇలా అని అడిగితే, సీఎం వస్తున్నారు కూర్చోండి... కూర్చోండి అంటూ బలవంతంగా కూర్చుండబెట్టేశారు. పక్కకి వెళ్లిపోతాం అన్నా వినకుండా హల్‌చల్ చేశారు. చేసేది లేక సిగ్గుతో చితికిపోయి... రయ్‌మంటూ వాహనాలు దూసుకుపోయే వరకు వారంతా అలాగే కూర్చున్నారు. ఇది కథ కాదు... అనుభవం.

* * *

'జనం కోరేది మనం సేయడమా... మనం చేసేది జనం చూడడమా' -పాతాళభైరవి సినిమాలో మాంత్రికుని డైలాగ్ ఇది. కానీ, 'పవర్‌ఫుల్ డైలాగ్. నేనెంత చేసినా జనం నన్నెందుకు ఇలా చేశారు అనే మాట వచ్చిందంటే ఖచ్చితంగా వారు కోరేది చేయలేదన్న మాటే. తాజా ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ మార్పునకు కారణాలు అనేకం అనేది రోజూ చర్చకు వస్తూనే ఉంది. జనం తిరస్కరించిన అధినాయకత్వమైతే అసలు తమను గద్దె దింపడం ఏమిటన్న భావననే వెళ్లగక్కుతూ వస్తోంది. ఇంకా, ద్వితీయ శ్రేణి నాయకగణం 'ఎక్కడా వ్యతిరేకత కనబడలేదు... ఎందుకు ఇలా జరిగిందో తెలియడం లేదు' అంటూ శోకతప్తహృదయాన్ని అధినేత వద్ద ఆవిష్కరిస్తున్నారు. ఫలితాలు వెల్లడై ఇన్ని రోజులు అవుతున్నా ప్రక్షాళన దిశగా చూడకుండా పరనింద కోసం పాకులాడుతున్నవారు తెలుసుకోవలసినవి చాలానే ఉన్నా- వారు మరిచినట్టు నటిస్తున్న కొన్ని అంశాలనైతే ముచ్చటించాల్సి ఉంది.

ఒక్కసారి వెనక్కు చూసుకుంటే, కుర్చీ ఎక్కిన తొలినాళ్లలోనే నమ్మకానికి బీటలు పడ్డాయి. అభివృద్ధి కంటే కక్షసాధింపునకే నాయకుని ప్రాధాన్యం అనేట్టుగా పాలన ప్రారంభమైంది. విడిపోయిన రాష్ట్రంలో వేసిన అభివృద్ధి పునాదులను కూకటివేళ్లతో పెకలించే విధానంపైనే ఆలోచనలు సాగాయి. ప్రజావేదికతో ప్రారంభమైన కూల్చివేతలు నలుదిశలా పాకాయి. రాజధానిపై చేసిన హేళన... పాలన చివరివరకూ కొనసాగి అసలు రాష్ట్రానికి ఒక దిక్కులేకుండా ఉండే పరిస్థితి ఏర్పడింది. మీ రాజధాని ఏదంటే చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నారంటూ నగుబాటుకు గురికావలసి వచ్చింది. మూడు, మూడు అని సాగదీస్తుంటే జనం నమ్మేస్తున్నారని అనుకున్నారు కానీ, ఒక కన్నేసి ఉంచారని గమనించలేకపోయారు. నెపమంతా వైరిపక్షం వైపు తోసివేసి మార్కులు పడుతున్నాయని భ్రమలో గడిపేశారు కానీ, వాస్తవంలోకి తొంగి చూడలేకపోయారు. ప్రాజెక్టులు, రహదార్లు, ఇతర జనావసరాలకు సంబంధించి వైఫల్యాలపై వేళ్లన్నీ ఒక వ్యక్తివైపే చూపి కాలం వెళ్లబుచ్చారన్న భావన ఉందనే విషయం గ్రహించలేకపోవడం జనం తప్పు కాదుకదా! మొత్తంగా మన నిరంతర శత్రుజపం జనంపై ప్రభావం చూపుతుందనే ఆలోచన తిప్పి కొడుతుందని ఊహించలేకపోవడం కూడా జనం తప్పు కానేకాదు.



....మందలించాల్సిన వారు మందహాసం చేస్తుండిపోయారు. తప్పిదాల్ని వెనకేసుకొచ్చారు. మనవాడు కాదనుకుంటే చాలు రచ్చరచ్చ చేసిన వైనం అగ్రనేతల కళ్లల్లో ఆనందబాష్పాల్ని నింపిందేమో కానీ, జనామోదం పొందలేదు. సరికదా ఎల్లెడలా ఛీత్కరించారు. అసలు సైన్యం, ఏర్పాటు చేసుకున్న డిజిటల్ సైన్యం చేసిన అల్లరికి శిక్ష విధించారు.

అధికారం ఒక ముళ్లకిరీటం... బాధ్యతగా మోయాల్సి ఉంటుంది. తానే కాదు, తన సైన్యం క్రమశిక్షణ బాధ్యతనూ నాయకుడు తీసుకోవలసి ఉంటుంది. భిన్న మనస్తత్వాల శ్రేణుల్ని సమన్వయపరిచి తీర్చిదిద్దే శక్తి నాయకుడికి అవసరం. ప్రజల్లోకి వెళ్లిన అనుచరగణం మాట తూలితే, క్రమశిక్షణ తప్పి ప్రవర్తిస్తే మచ్చ పడేది నాయకునిపైనే. దురదృష్టవశాత్తు ఐదేళ్ల కాలంలో గట్టు తప్పిన దూడలెన్నో! అయితే, మందలించాల్సిన వారు మందహాసం చేస్తుండిపోయారు. తప్పిదాల్ని వెనకేసుకొచ్చారు. మనవాడు కాదనుకుంటే చాలు రచ్చరచ్చ చేసిన వైనం అగ్రనేతల కళ్లల్లో ఆనందబాష్పాల్ని నింపిందేమో కానీ, జనామోదం పొందలేదు. సరికదా ఎల్లెడలా ఛీత్కరించారు. అసలు సైన్యం, ఏర్పాటు చేసుకున్న డిజిటల్ సైన్యం చేసిన అల్లరికి శిక్ష విధించారు.

చరిత్రలో కనుమరుగైన రాచరికదర్పాన్ని వర్తమానానికి తీసుకువచ్చిన నాయకులను జనం ఎలా ఆదరిస్తారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడాలంటే భయం... ఒక ప్రదర్శన చేయాలంటే వణుకు... సమావేశం పెట్టాలంటే ఏం జరుగుతుందో అన్న సందేహం... ప్రతిపక్ష నేతలే కాదు... ఉద్యోగులు, ప్రజాసంఘాలు, జర్నలిస్టులు ఇలా ప్రజలతో మమేకమైన వర్గాలకు అభద్రతా వాతావరణాన్ని రుచి చూపించిన నేతలు ప్రజలకు ఎలా దగ్గరవుతారు? ఏం చేసినా ఆదుకునేందుకు పైన ఉన్నారు అనే భావనతో చెలరేగిన మూకలను ఆదిలోనే కట్టడి చేయలేకపోయారు. ఘోరనేరాలకు సంబంధించి వాస్తవాలు వెలుగులోకి రాకుండా అడ్డుపడ్డారన్న అపప్రథను మూటగట్టుకున్నారు. జనం క్రైం సీరియల్ చూస్తున్నారని అనుకున్నారేమో గానీ, ముగింపు ఇలా ఉంటుందని ఊహించలేకపోయారు. వ్యక్తులకే కాదు... భూములకూ భద్రత లేని పరిస్థితిని కొని తెచ్చుకున్నారు. టార్గెట్ చేసిన వారిపై కక్షగట్టి, సాధించామని అనుకుంటే... జనం మరోలా అనుకున్నారు. వెరసి కసిగా ఫలితాన్ని అందించారు.

* * *

బస్టాప్‌లో ఆత్మాభిమానం దెబ్బతిన్న మహిళ ఒక్కరే కాదు... ఎన్నో సంఘటనల్లో అవమానం, బాధ, గాయాలకు లోనైన వారికీ సంక్షేమ పథకాలు తీసుకుంటున్న అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు ఉంటారు. వారు ఇళ్లకు వెళ్లి తమ గోడును వెళ్లగక్కితే... 'పోనీలేమ్మా... పెన్షన్లు ఇస్తున్నాడుగా, డబ్బులు వస్తున్నాయిగా... బాధపెడితేనేం, బటన్లు నొక్కుతున్నాడుగా' అంటారా లేక 'వారి పరిభాషలో' శపిస్తారా? అదిగో ఆ శాప ఫలితమే ఇది.

చివరిగా... ఎప్పుడూ పరదాల మాటున తిరిగే ప్రజాప్రతినిధి ఎన్నికల ముందు చిన్నపిల్లలతో, అవ్వాతాతలతో ముద్దులు, ఆలింగనాలతో కనిపిస్తే, హార్ట్‌టచింగ్ దృశ్యాలను చూపిస్తే నమ్మడానికి జనం వెర్రిబాగులవారు కాదుకదా. ఇంత చిన్నలాజిక్ ఖరీదైన 'ప్యాక్' వారుగానీ, వాటిని జనంమీదకు సంధించిన అస్మదీయులు గానీ ఎలా విస్మరించారు.

■ సతీష్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్ రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

'ఐఏఎస్'లో సమూల మార్పులు అవసరమా?





■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'తొలి రోజుల్లో ఐఏఎస్‌లు నిజాయితీపరులుగా ఉండేవారు. ఇవాళ వివిధ రంగాల్లో దేశం వైఫల్యాలకు కారణం వారే' అని రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి దువ్వూరి సుబ్బారావు అన్నారు. 'సమర్థత, అంకితభావం, నిజాయితీకి ఐఏఎస్‌లు ఒకప్పుడు మారుపేరుగా నిలిచేవారు. కాని ఆ స్థానంలో ఇప్పుడు అసమర్థత, పరిపాలన పట్ల నిరాసక్తత, అవినీతి చోటుచేసుకున్నాయి' అని ఆయన వాపోయారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ఏం చేయాలన్న విషయంపై చర్చ జరగాల్సి ఉన్నది.

రైతు నాయకుడైన చరణ్ సింగ్ 1967లో ముఖ్యమంత్రి కాగానే తన చీఫ్ సెక్రటరీ బిబి సింగ్‌ను పిలిచి 'నాకు మెరికల్లాంటి నలుగురు యువ ఐఏఎస్ అధికారులు కావాలి. వారు మన రాష్ట్రానికి చెందిన వారై ఉండకూడదు. దక్షిణాది వారైనా, పంజాబీవారైనా సరే.' అన్నారు. మన దేశం ఆహార ధాన్యాల సంక్షోభంలో ఉన్న కాలమది. అమెరికా నుంచి ఓడ రాకపోతే భారత దేశ ప్రజలు ఆకలితో మాడిపోతారని అమెరికా అధ్యక్షుడు లిండన్ జాన్సన్ సైతం వ్యాఖ్యానించిన రోజులవి. ఉత్తర ప్రదేశ్‌లో ఆహార సంక్షోభాన్ని నివారించాలంటే నల్ల బజారులో ఆహార ధాన్యం విక్రయించకుండా చర్యలు తీసుకోకతప్పదని చరణ్ సింగ్ భావించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన నలుగురు అధికారులను తన వద్దకు పిలిపించుకుని వారికి నాలుగు కొత్త జీపులతో పాటు రూ. 150 ప్రత్యేక వేతనంగా ఇస్తానని తెలిపారు. 'మీరు రాష్ట్రమంతటా తిరగండి. ఎక్కడ అక్రమాలు జరిగినా నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోండి.. మీ వెనుక నేనున్నాను' అని చెప్పారు. ఆ నలుగురు ఐఏఎస్ అధికారులు నెల రోజులు రాష్ట్రమంతటా తిరిగారు. అక్రమ నిల్వలు చేసిన వ్యాపారుల పైన, తిండి గింజలను సరిగ్గా పంపిణీ చేయని వారి పైన పోలీసుల సహకారంతో దాడులు చేశారు. మార్కెట్‌పై అక్రమార్కుల పట్టును బద్దలుకొట్టారు. మరో వైపు పంపిణీ యంత్రాంగం కూడా అప్రమత్తమై పేదలకు ఆహార ధాన్యాలను సక్రమంగా పంపిణీ చేయడంలో నిమగ్నమైంది. ఉత్తర ప్రదేశ్ కరువు, ఆకలి చావుల పాలిట పడకుండా చరణ్ సింగ్ కాపాడారు. తర్వాత దేశంలో వచ్చిన హరిత విప్లవం ఆహార రంగ పరిస్థితులను మార్చింది. 'మీరు ఇతర రాష్ట్రాల అధికారులను ఎందుకు నియమించారు?' అని చరణ్ సింగ్‌ను అడిగితే 'ఇక్కడి అధికారులైతే వారికెవరో బంధువులు ఉంటారు. వారిపై ఒత్తిళ్లు వస్తాయి. పైగా మన రాష్ట్రంలో అంతా కుల రాజకీయాలే. అందువల్ల ఏ పంజాబీ అధికారో, దక్షిణాది అధికారో అయితే ఏ ఒత్తిళ్లు లేకుండా పనిచేస్తారు' అని చెప్పారు.

నాయకుడు నిజాయితీగా ఉంటే అధికారులను సమర్థంగా పనిచేయించగలరు అన్నదానికి చరణ్ సింగ్ ఉదంతం ఒక ఉదాహరణ. అప్పుడంటే ఇతర రాష్ట్రాలవారితో పనిచేయించుకుంటే ఫలితాలు వస్తాయన్న నమ్మకం ఉండేది. ఇప్పుడు రాజకీయ నాయకుల నీచత్వం వల్ల, అసమర్థత, అజ్ఞానం వల్ల అన్ని ప్రాంతాల అధికారులు ఎక్కడ పనిచేసినా ఆ నేతల మకిలిని తమకు కూడా అంటించుకుంటున్నారు. నిజానికి ఒక ప్రభుత్వం విఫలమైతే, అధికారులను నిందించి లాభం లేదు. రాజకీయ నాయకత్వం దౌర్భాగ్యం వల్ల ఐఏఎస్ అధికారులు కూడా దిగజారిపోతున్నారనడంలో సందేహం లేదు. 'ఐఏఎస్ అధికారుల ఎంపిక చాలా పకడ్బందీగా జరుగుతుంది. చాలా తెలివిగలవారిని సమర్థులను ఎంపిక చేస్తారు. అటువంటప్పుడు వారు ఎందుకు సమర్థంగా పనిచేయలేరు? రాజకీయ నాయకులు సక్రమంగా ఉంటే వారు కూడా సక్రమంగా పనిచేస్తారు' అని మాజీ ఐఏఎస్ అధికారి ఆల్ఫోన్స్ ఒక సందర్భంలో చెప్పారు.

కాని రాజకీయ నాయకులు అధికారులను తమ అవినీతి కూపంలోకి లాగడం, అక్రమార్జన ఎలా చేయవచ్చో అధికారులు కూడా నేతలకు నేర్పించడం ఒక విషవలయంగా మారింది. ఒక ఉత్తరాది ముఖ్యమంత్రికి ఆయన నమిలే పొగాకు (ఖైనీ)ను సీనియర్ అధికారులే అందించేవారు. ఆ ముఖ్యమంత్రి, తన స్వంత పనులను చేసి పెట్టని అధికారులను ఎడాపెడా బదిలీ చేసేవారు.

రాజకీయ నాయకులతో పాటు క్విడ్ ప్రో కేసుల్లో అనేక మంది ఐఏఎస్ అధికారులు కోర్టు చుట్టూ తిరిగిన ఉదంతాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో ఉన్నాయి. ఈ విషయం తెలిసినప్పటికీ విభజిత ఆంధ్రప్రదేశ్‌లో కూడా పలువురు అధికారులు గత అయిదేళ్లలో ముఖ్యమంత్రి అండతోనే విశృంఖలంగా వ్యవహరించారు. ముఖ్యమంత్రి స్వయంగా ఒక అవినీతి అధికారిని తన వద్ద చేర్చుకోవడం కోసం ఢిల్లీలో హోంమంత్రి చుట్టూ తిరిగిన సందర్భాలున్నాయి. ఏపీలో కొందరు ఉన్నతాధికారులు అసైన్డ్ భూములు, ప్రభుత్వ, ప్రైవేట్ భూముల ఆక్రమణ, అవినీతి కార్యకలాపాలకు పాల్పడడం, అధికార పార్టీ రాజకీయ ప్రత్యర్థులను తప్పుడు కేసుల్లో ఇరికించడం, పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగపరచడం, విచ్చలవిడిగా అప్పులను ప్రోత్సహించడం, తప్పుడు పనులు చేసేందుకు ఒప్పుకోని తోటి అధికారులనే తీవ్రంగా వేధించడం వంటి అనేక దురాగతాలకు పాల్పడ్డారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉన్న కొందరు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరించారు. వారు ఎందుకలా చేశారు? అధికారం తమకు శాశ్వతంగా ఉంటుందని భావించారా? లేక తమను బానిసలుగా చేసుకున్న రాజకీయ నేతలు శాశ్వతంగా రాజ్యమేలుతారని అనుకున్నారా? తర్వాత అధికారంలోకి వచ్చే నేతలు ఇలాంటి వారిని చీదరించుకోకుండా ఎలా ఉంటారు?

అధికారులతో సక్రమంగా పనిచేయించుకోవడం అనేది ఒక కళ. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడు రోజుల క్రితం తన ప్రిన్సిపల్ సెక్రటరీగా పికె మిశ్రాను, జాతీయ భద్రతా సలహాదారుగా అజిత్ దోవల్‌ను మళ్లీ నియమించారు. ఆయన ఒకసారి వ్యక్తుల సమర్థతను విశ్వసించారంటే వారిని వదిలే అవకాశం లేదు. 1968 బ్యాచ్‌కు చెందిన కేరళ అధికారి అయిన అజిత్ దోవల్ 2014 నుంచీ మోదీ సలహాదారుగానే కొనసాగుతున్నారు. ఇక పికె మిశ్రా గురించి చెప్పనక్కర్లేదు. 2001లో నరేంద్ర మోదీ తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విశాఖ పట్టణానికి చెందిన గుజరాత్ కేడర్ ఐఏఎస్ అధికారి జిసుబ్బారావు చీఫ్ సెక్రటరీగా ఉన్నారు. మోదీతో కలిసి పనిచేసేందుకు సుబ్బారావు నియమించిన ముగ్గురు అధికారుల్లో పికె మిశ్రా ఒకరు. అప్పటి నుంచీ ఇప్పటి వరకూ ఆయన మోదీతోనే ఉన్నారు. గుజరాత్ రోజుల నుంచి మోదీతో సన్నిహితంగా ఉన్న అధికారులు హిరేన్ జోషి, ప్రతీక్ దోషి (నిర్మలా సీతారామన్ అల్లుడు), సంజయ్ భవ్సర్, ఎకె శర్మ వంటి అనేక అధికారులు మోదీతో చాలా కాలంగా కొనసాగుతున్నారు. నిజానికి మోదీ ముఖ్యమంత్రి కాక ముందు కనీసం సర్పంచ్ బాధ్యతలను సైతం నిర్వహించలేదు కాని ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే పాలన గురించి నేర్చుకునేందుకు తన చుట్టూ ఉన్న అధికారులనే ఉపయోగించుకున్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకు ఐఏఎస్, జిల్లా అభివృద్ధి అధికారుల సదస్సును ప్రారంభించాలని సుబ్బారావు మోదీని ఆహ్వానించారు. 'మీరు దీపం వెలిగించి ఉపన్యసించి వెళ్లిపోతే చాలు..' అన్నారు. 'అక్కడేం జరుగుతుంది?' అని మోదీ అడిగారు. 'కలెక్టర్లు, డీడీఓల క్రింద ఉన్న అన్ని విభాగాలను సమీక్షిస్తాం' అని సుబ్బారావు చెప్పారు. నిజానికి ప్రతి ఏడాదీ ఈ సమావేశం ఒక తంతులా జరిగేది. మధ్యాహ్న భోజనం కాగానే అందరూ తమ తమ ప్రాంతాలకు వెళ్లిపోయేవారు. కాని ఈ సమావేశానికి హాజరైన మోదీ అక్కడ నుంచి కదల్లేదు. దీనితో వివిధ విభాగాల సెక్రటరీలు కూడా కదలకుండా అక్కడే కూర్చున్నారు. నోట్స్ తీసుకుంటూ ప్రశ్నలు అడుగుతూ మోదీ ప్రతి జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలను సమీక్షించారు. సమావేశం రాత్రి 11 గంటల వరకూ సాగింది. ఇలా అధికారుల నుంచి పాలనా వ్యవహారాల విషయమై పాఠాలు నేర్చుకున్న మోదీ తర్వాతి కాలంలో క్రమక్రమంగా అధికారులపైనే పట్టు సాధించగలిగారు. గుజరాత్‌లోనూ, ఢిల్లీలోను మోదీ పాలనలో అవినీతి గురించి చర్చలేకపోవడానికి వారే కారణం. మోదీ విజయ రహస్యం వెనుక కూడా అధికారుల హస్తం లేదని చెప్పలేం.

గత 24 సంవత్సరాలుగా ఒడిషాలో తిరుగులేని అధికారాన్ని చలాయించిన నవీన్ పట్నాయక్ ఈ సారి ఓటమిపాలు కావడానికి ఒక ఐఏఎస్ అధికారే కారణమని బిజూ జనతాదళ్ నేతలు ఆరోపిస్తున్నారు. నవీన్ పట్నాయక్ తన బాధ్యతల నిర్వహణలో ఐఏఎస్ అధికారులపై ఎక్కువగా ఆధారపడేవారు. తొలుత ఆయన తన తండ్రి హయాంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న మహాపాత్ర అనే అధికారికి అన్ని బాధ్యతలు అప్పగించారు. మహాపాత్ర రాజకీయ అధికారాలు కూడా చలాయించారు. ఆయన తర్వాత బాధ్యతలు నిర్వర్తించిన పాండ్యన్ మరో అడుగు ముదుకు వేసి బిజూ జనతాదళ్ పార్టీని కూడా తన చెప్పుచేతుల్లోకి తీసుకున్నారు. పంజాబ్ కేడర్‌కు చెందిన పాండ్యన్ తన భార్య ఒడిషా అధికారిణి కావడంతో ఆ రాష్ట్రానికి మారారు. నవీన్ పట్నాయక్ పాండ్యన్‌ను పూర్తిగా విశ్వసించడంతో ఎన్నికల టిక్కెట్లు కూడా అయనే పంపిణీ చేయడం మొదలు పెట్టారు. నవీన్ అనారోగ్యాన్ని పాండ్యన్ తనకు అనుకూలంగా మార్చుకున్నారు. ఏ రాజకీయనాయకుడినీ నవీన్ పట్నాయక్‌ను కలుసుకోనిచ్చేవారు కాదు. 2023లో పాండ్యన్ తన పదవికి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి పూర్తి స్థాయి బీజేడీ నాయకుడుగా మారారు. 2024 ఎన్నికలకు ముందు బీజేపీ నేతలు బీజేడీతో పొత్తు కోసం పాండ్యన్‌తోనే చర్చలు జరిపారు. ఈ చర్చలు విఫలమయ్యాయి. వేరే రాష్ట్రానికి చెందిన పాండ్యన్‌కు పార్టీని, ప్రభుత్వాన్ని అప్పగించడం ద్వారా ఒడిషా ఆత్మగౌరవాన్ని పట్నాయక్ తాకట్టు పెట్టారని నరేంద్రమోదీ ఎన్నికల్లో ఉధృతంగా ప్రచారం చేశారు. ఒక చరిత్రగల నేతను కూడా ఐఏఎస్ అధికారులు ఎంత భ్రష్టుపట్టించగలరో అన్నదానికి ఒడిషాలో జరిగిన మార్పు ఒక నిదర్శనం. రాజకీయ నాయకులకు ఇది ఒక గుణపాఠం కూడా!

'తొలి రోజుల్లో ఐఏఎస్‌లు నిజాయితీపరులుగా ఉండేవారు. కాని ఇవాళ వివిధ రంగాల్లో దేశం వైఫల్యాలకు కారణం ఐఏఎస్ అధికారులే' అని రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్, కేంద్ర ఆర్థికశాఖ మాజీ కార్యదర్శి దువ్వూరి సుబ్బారావు ప్రముఖ జర్నలిస్టు కరణ్ థాపర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. 'సమర్థత, అంకితభావం, నిజాయితీకి ఐఏఎస్‌లు ఒకప్పుడు మారుపేరుగా నిలిచేవారు. కాని ఆ స్థానంలో ఇప్పుడు అసమర్థత, పరిపాలన పట్ల నిరాసక్తత, అవినీతి చోటుచేసుకున్నాయి' అని ఆయన వాపోయారు. ఐఏఎస్ పూర్వవైభవాన్ని, ప్రామాణికతను పునరుద్ధరించగలమా లేక వర్తమాన అవసరాలకు తగ్గట్లుగా ఐఏఎస్ వ్యవస్థనే సమూలంగా మార్చవలసిన అవసరం ఉన్నదా అన్న విషయంపై చర్చ జరగాల్సి ఉన్నది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)


లౌకిక, ప్రజాస్వామ్య భారత్ భవిష్యత్తు భద్రమేనా?

తీర్పు 2024 – 6

18వ సార్వత్రిక ఎన్నికలు అధికార పక్షం సర్వోన్నత నాయకుడి పాలనపై ఒక రెఫరెండం. గత పది సంవత్సరాలుగా తాను సాగించిన పాలనకూ, రాబోయే ఐదేళ్లలో మన గణతంత్ర రాజ్యాన్ని కూల్చివేసేందుకూ ఎటువంటి మినహాయింపులు లేని ప్రజామోదాన్ని మోదీ ప్రగాఢంగా అభిలషించారు. కానీ, దేశ ప్రజలు ఆయన అభీష్టాన్ని, భావి పథకాన్ని తిరస్కరించారు.



■ యోగేంద్ర యాదవ్



పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికల ప్రజా తీర్పు లౌకిక, ప్రజాస్వామ్య భారత్‌ను కాపాడుతుందా? మన మహోజ్జ్వల జాతీయోద్యమ నిర్మాతలు వ్యవస్థాపించిన లౌకిక, ప్రజాస్వామిక భారత గణతంత్ర రాజ్యానికి భద్ర భవిష్యత్తును కల్పిస్తుందా? ఇటీవలి అసాధారణ సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై మా ఆరు భాగాల విశ్లేషణను పై ప్రశ్నల పై విస్తృత వివేచనతో ముగిస్తున్నాం. ఒక విధంగా ఆ ప్రశ్నలకు సమాధానం అవుననే చెప్పాలి. ఈ సార్వత్రిక ఎన్నికలు అధికార పక్షం సర్వోన్నత నాయకుడి పాలనపై ఒక రెఫరెండం (ప్రజాభిప్రాయ సేకరణ). గత పది సంవత్సరాలుగా తాను సాగించిన నిరంకుశ పాలనకు, రాబోయే ఐదేళ్లలో మన గణతంత్ర రాజ్యాన్ని కూల్చివేసేందుకు ఎటువంటి మినహాయింపులు లేని ప్రజామోదాన్ని మోదీ ప్రగాఢంగా అభిలషించారు. భారత ప్రజలు ఆయన భావి పథకాన్ని ఆమోదించేందుకు తిరస్కరించారు. హిందూ ఓటర్ల మద్దతును పొందేందుకు ప్రధాని మోదీ తెంపరితనంతో ముస్లిం వ్యతిరేక భావోద్వేగాలను తీవ్రంగా రెచ్చగొట్టారు. అయితే హిందూ మెజారిటేరియన్ రాజకీయాలు ప్రబలంగా ఉన్న హిందీ రాష్ట్రాలలో సైతం మోదీ మతతత్వ ప్రకటనలను ఓటర్లు ఉపేక్షించారు. తత్కారణంగానే ఈ సార్వత్రిక ఎన్నికలలో ప్రజా తీర్పు నరేంద్ర మోదీకి వ్యక్తిగత ఓటమి అని చెప్పితీరాలి. అజేయుడుగా మోదీ అందుకుంటున్న కీర్తి హారతులు దాదాపుగా ఆరిపోయాయి.

ఈ ప్రజా తీర్పు పర్యవసానాలు స్పష్టమే. నిర్ణయాత్మకమైన నిరంకుశ పాలన నుంచి ఎలాంటి పౌర స్వేచ్ఛలకు తావులేని సంపూర్ణ నియంతృత్వ రాజకీయ వ్యవస్థగా భారత ప్రజాస్వామ్య తిరోగమనం నిలిపివేయబడింది. అధికారపక్షం లోపలా, వెలుపలా; పార్లమెంటులోనూ, బయటా ప్రజాస్వామిక అవకాశాలు మెరుగుపడ్డాయి. హిందూ మెజారిటేరియన్ రాజ్య వ్యవస్థకు అనుకూలంగా లౌకికవాద సమాజ నిర్మాణంపై రాజ్యాంగ దార్శనికతను ధ్వంసం చేస్తోన్న సంకుచిత భావజాల కార్యక్రమానికి విఘాతమేర్పడింది. ఏమైనా ఈ పర్యవసానాలు కీలకమైనవే కానీ, లౌకిక, ప్రజాస్వామిక భారత్‌కు భద్ర భవిష్యత్తును సమకూర్చేదిగా ఈ ప్రజా తీర్పును పరిగణించలేము. అవి ఎన్నికల తీర్పు పర్యవసానాలే కానీ ప్రజల ఉద్దేశాలుగా పరిగణించలేము. మా విశ్లేషణ చాల వరకు ఎన్నికల తుది ఫలితాలపై ఆధారపడి చేసిందే. ఓటర్ల మనసులోని మాటలను తెలుసుకునే వరకు ఈ నిర్ధారణలు ఎంత వరకు సబబైనవో చెప్పలేము. అదృష్టవశాత్తు లోక్‌నీతి–సిఎస్‌డిఎస్ నిర్వహించిన పోస్ట్ పోల్ సర్వేలో వెల్లడయిన వివరాలు ఓటర్ల ఉద్దేశాలను తెలుసుకునేందుకు తోడ్పడేవిగా ఉన్నాయి. పోలింగ్ అనంతరం 20 వేల మందికి పైగా ఓటర్లను పలు అంశాలపై ప్రశ్నించి సేకరించిన వివరాలవి.


తొలుత మన ప్రజాస్వామ్యంపై ఓటర్ల అభిప్రాయాలను చూద్దాం. ఒక విషయం స్పష్టం: ఏడు దశాబ్దాల ప్రజాస్వామిక పాలన ప్రజలకు ప్రజాస్వామిక ఆలోచనా అలవాట్లను అలవర్చాయి, సందేహం లేదు. వాటిని మార్చడం అంత తేలిక కాదు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని మార్చేందుకు సమకూరే అవకాశాన్నే ప్రజాస్వామ్యంగా సగటు భారతీయుడు భావిస్తున్నాడని ఈ సర్వే వెల్లడించింది. సుదీర్ఘకాలం ఏకపార్టీ పాలన కంటే ప్రతి ఐదేళ్లకొకసారి ప్రభుత్వం మారిపోవడమే అభివృద్ధికి ఇతోధికంగా దోహదపడుతుందని ఈ సర్వేలో పాల్గొన్న ప్రతి ముగ్గురిలో ఇద్దరు అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా అధికారంలోకి వచ్చిన పాలకులపై నిరోధాలు ఉండి తీరాలనే భావనను అత్యధికులు సమర్థించారు. ఇటువంటి నిరోధాలను ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలనను ప్రభావితం చేసే హక్కు, నాయకులు విధాన నిర్ణయాలు తీసుకునే క్రమంలో జోక్యం చేసుకునే హక్కు ప్రజలకు ఉండి తీరాలనే భావనను 77 శాతం మంది సమర్థించారు. ప్రభుత్వ నిర్ణయాలు సబబుగా లేని పక్షంలో వాటిపై అభ్యంతరం తెలిపే హక్కు ప్రజలకు ఉండి తీరాలని కూడా 77 శాతం మంది గట్టిగా అభిప్రాయపడ్డారు. ఇది మోదీ ప్రభుత్వాన్ని తీవ్రంగా ఆక్షేపించడమే కాదూ? ఇంతకంటే ముఖ్యమైన భావన రాజ్యాంగ బద్ధమైన నిరోధాలు, సమతౌల్యతలు. ఎన్నికైన ప్రభుత్వ అధికారాలను న్యాయస్థానాలు, రాజ్యాంగబద్ధ సంస్థలు అదుపు చేయాలని 68 శాతం మంది విశ్వసిస్తున్నారు. సగటు భారతీయ ఓటరుకు ఉదారవాద ప్రజాస్వామ్యం గురించిన అవగాహన లేకపోవచ్చు గానీ పాలకులు జవాబుదారీ తనం లేకుండా వ్యవహరించడాన్ని, వారి నిర్హేతుక నిర్ణయాలను, అడ్డూ అదుపూ లేకుండా అధికారాల చెలాయింపును అంగీకరించడానికి అతడు సుముఖంగా లేడు.

'ఎన్నికల గురించి ఆలోచించనవసరం లేకుండా సమర్థ పాలన నందించగల ఒక శక్తిమంతుడైన నాయకుడి అవసరం మనకు ఉంది' అనే నియంతృత్వ పాలన అనుకూల అభిప్రాయంతో ప్రతి నలుగురిలో ఒక్కరు మాత్రమే ఏకీభవించడం గమనార్హం. ఆ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నవారు 2019లో కంటే 2024లో పది శాతం మంది తక్కువగా ఉన్నారు. అంతే కాదు, ఆ అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తున్నవారు 2019లో కంటే ప్రస్తుతం 2 శాతం అధికంగా ఉన్నారు. చెప్పవచ్చినదేమిటంటే మోదీ ప్రభుత్వం సంపూర్ణ నియంతృత్వ వ్యవస్థ వైపుగా ప్రయాణిస్తుండగా ప్రజలు అందుకు విరుద్ధ మార్గంలో ముందుకు సాగాలని గట్టిగా అభిలషిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియపై నమ్మకం కూడా దిగజారిపోయింది. ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై విశ్వాసం 57 శాతం నుంచి 47 శతానికి తగ్గిపోయింది. అలాగే ఈవీఎమ్‌ల విషయంలో కూడా ఓటర్ల నమ్మకం 57 శాతం నుంచి 34 శాతానికి తగ్గిపోయింది. ఈ ప్రాథమిక ప్రజాస్వామిక ప్రమాణాల ఉల్లంఘనకు మోదీ ప్రభుత్వమే కారణమని ప్రజలు విశ్వసిస్తున్నారా లేదా అన్నది చెప్పలేము. అయితే సరిగ్గా ఎన్నికల ముందు ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడాన్ని ప్రజలు ఆమోదించడం లేదు. నిజానికి అవినీతి ఆరోపణలపై కాకుండా రాజకీయ కారణాలతోనే అరెస్ట్ చేయడం జరిగిందని పలువురు స్పష్టంగా చెప్పారు. మోదీ ప్రభుత్వాన్ని మీరెందుకు అయిష్టపడుతున్నారన్న ప్రశ్నకు 0.8 శాతం మంది 'నియంతృత్వ పాలన' అని సమాధానమిచ్చారు. మోదీ ప్రభుత్వానికి మరొక అవకాశం ఇచ్చేందుకు ఎందుకు నిరాకరిస్తున్నారన్న ప్రశ్నకు 1.1 శాతం మంది 'అసహన వైఖరులు, పౌర స్వేచ్ఛలను పరిమితం చేయడం' అని సమాధానమిచ్చారు.

లౌకికవాదం విషయంలో ఓటర్ల వైఖర్లకు సాక్ష్యాధారాలు మిశ్రమంగా ఉన్నాయి. ఇదేమీ ఆశ్చర్యకరం కాదు. ప్రజాభిప్రాయాన్ని పూర్తిగా మెజారిటేరియన్ పాలనకు అనుకూలంగా బీజేపీ ఎలా మార్చివేసిందో ప్రొఫెసర్ సుహాస్ పల్షికర్ పదే పదే నిర్ధారించారు. మోదీ ప్రభుత్వాన్ని గురించి తాము ఇష్టపడే అంశం అయోధ్యలో రామాలయాన్ని ప్రారంభించడమేనని 22 శాతం మంది పేర్కొన్నారు. అయితే ఆ ఆలయం కారణంగా మోదీ సర్కార్‌కు మరొక అవకాశాన్ని ఇవ్వాలని అభిప్రాయపడినవారు కేవలం 5 శాతం మంది మాత్రమే ఉన్నారు. ఏమైనా బీజేపీ శ్రేణులలో అనేక మందిని, ఆ పార్టీపక్షాన్నే ఉండిపోవడానికి రామాలయం అంశం ఇతోధికంగా పురిగొల్పింది. బీజేపీ వైపు ఓటర్లు మొగ్గడానికి మందిర్ అంశం పెద్దగా తోడ్పడలేదని ఆ సర్వే స్పష్టం చేసింది. సమ్మిళిత భారత్ భావనపై దాదాపుగా ఏకీభావం ఉందని ఎన్నికలకు ముందు లోక్‌నీతి–సిఎస్‌డిఎస్ నిర్వహించిన సర్వేలో వెల్లడయింది. ఈ వైఖరి 'ఎన్నికల ప్రచారంలో మోదీ గొంతు చించుకున్న 'చొరబాటుదారులు' కథనానికి పూర్తిగా విరుద్ధమైనది. ఇండియా కేవలం హిందువులదే' అన్న ప్రకటనను అంగీకరించిన ప్రతి ఒక్క ఓటరుకు ప్రత్యామ్నాయంగా 'ఇండియా కేవలం హిందువులదే కాదు, అన్ని మతాల వారిది' అన్న భావనను సమర్థిస్తున్న ఓటర్లు ఏడుగురు ఉన్నారు. మెజారిటేరియనిజం నిర్దిష్ట వ్యక్తీకరణలను ప్రజలు తిరస్కరిస్తున్నట్టు పోస్ట్ పోల్ సర్వే వెల్లడించింది. 'ప్రజాస్వామ్య వ్యవస్థలో అధిక సంఖ్యాక వర్గాల వారి అభిప్రాయానికి ప్రథమ, అగ్ర ప్రాధాన్యమివ్వాలన్న' వాదనను వ్యతిరేకిస్తున్నవారు 2019లో కంటే 2024లో అధికంగా ఉన్నారని స్పష్టమయింది. ఈ వాదనలతో ఏకీభవిస్తున్న వారి సంఖ్య 2004, 2009లో కంటే ఎక్కువగా ఉన్నది. మోదీ జాతీయ రాజకీయాలలోకి వచ్చిన 2014లో ఈ వాదనను అంగీకరించిన వారు 40 శాతం మంది కాగా 2019లో వారు 29 శాతానికి, 2014లో 21 శాతానికి తగ్గిపోయారు. ఇదే సమయంలో మైనారిటీ వర్గాల వారి హక్కులకు మద్దతునిస్తున్న వారి సంఖ్య పెరగలేదు. ఈ అంశంపై ప్రధాని మోదీ ప్రచారం ఓటర్ల వైఖరిని ప్రభావితం చేసి ఉంటుంది. మైనారిటీల ప్రయోజనాలను పరిరక్షించడమనేది ప్రభుత్వ బాధ్యత అన్న అంశానికి మద్దతునిచ్చినవారు రెండు దశాబ్దాల క్రితం 67 శాతం మంది ఉన్నారు. వీరి సంఖ్య 2014 తరువాత క్రమంగా తగ్గిపోసాగింది. ఇప్పుడు అది 38 శాతంగా ఉన్నది. అదే విధంగా మైనారిటీ వర్గాల వారికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలన్న వాదనతో పూర్తిగా ఏకీభవిస్తున్నవారు 2019లో 34 శాతం నుంచి 2024లో 27 శాతానికి తగ్గిపోయారు. అయితే ఇదే సమయంలో ఆ అభిప్రాయంతో ఏకభవించని వారి సంఖ్య కూడా అదే నిష్పత్తిలో తగ్గిపోయింది. మెజారిటేరియన్ వాదంకు సంబంధించిన రాజకీయ దృక్కోణాలలో సంయమనం ఉన్నప్పటికీ మైనారిటీలను సాంస్కృతికంగా కలుపుకుపోవాలన్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. 'మైనారిటీ వర్గాల వారు అధిక సంఖ్యాక వర్గాల వారి ఆచారాలను అనుసరించాలన్న' వాదనతో ఏకీభవిస్తున్న ఓటర్లు 2019నాటి కంటే ఇప్పుడు 7 శాతం అధికంగా ఉన్నారు. మొత్తం మీద లౌకికవాద సమాజాన్ని నిర్మించుకోవాలన్న రాజ్యాంగ ఆదర్శానికి మద్దతు స్పష్టంగా, బలంగా లేదు అయితే మెజారిటేరియన్‌వాద తుఫానులో భారతీయ ఓటర్లు కొట్టుకుపోలేదు. వారు తమ లౌకికవాద విశ్వాసాలతో గట్టిగా నిలబడ్డారు. లౌకిక, ప్రజాస్వామిక భారత్ భద్ర భవిష్యత్తుకు భరోసానివ్వనప్పటికీ భారత రిపబ్లిక్ మహోన్నత స్ఫూర్తిని పునరుజ్జీవింపచేసేందుకు దోహదం చేసే రాజకీయాలకు అవసరమైన ఆధారాన్ని ఇటీవలి సంచలనాత్మక ప్రజా తీర్పు సమకూరుస్తోంది.

(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

(ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రముఖ విశ్లేషకుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్రయాదవ్ అందించిన ఆరు వ్యాసాల పరంపరలో ఇది చివరిది)



గత వైసీపీ ప్రభుత్వంలో రొయ్యూరు, కరకట్ట వెంబడి మరికొన్ని రీచ్‌లలో వందల కోట్ల ఇసుక దోపిడీ జరిగింది. ఈ దోపిడీలో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంట్రాక్టు తీసుకున్న ఏజెన్సీలు భాగస్వాములు. వీరి దోపిడీకి సంబంధిత మైనింగ్ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు సహకరించారు. ఆ అధికారులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ని సైతం పక్కదారి పట్టించిన సంగతి విదితమే. రొయ్యూరులో అడ్డూ అదుపు లేకుండా ఇసుక దోపిడీ జరిగితే అధికారుల బృందం ఏనాడో మూతపడిన నార్తువల్లూరు క్వారీని పరిశీలించి ఎన్జీటీకి దొంగ నివేదికలు ఇచ్చి అక్రమాలకు పూర్తిస్థాయిలో సహకరించారు. ఇపుడు వైసీపీ ప్రభుత్వం మారి టీడీపీ ప్రభుత్వం ఏర్పడటంతో ఇసుక దోపిడీపై విచారణ చేస్తుందా లేదా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.



మల్లవల్లిలోని పార్లే ఆగ్రో ప్లాంట్

పార్లే పరుగులు

మల్లవల్లిలో పనులకు సిద్ధమైన పార్లే ఆగ్రో సంస్థం

- టీడీపీ ప్రభుత్వ హయాంలో మల్లవల్లిలో డ్రింక్స్ యూనిట్‌కు శ్రీకారం
- యూనిట్ కోసం ఇండస్ట్రియల్ నిర్మాణం కూడా పూర్తి
- వైసీపీ ప్రభుత్వ హయాంలో సహకారం నాస్తి
- పూర్తిస్థాయిలో ప్లాంట్‌ను ఏర్పాటు చేయలేకపోయిన సంస్థ
- కూటమి అధికారంలోకి రావటంతో సీఎం చంద్రబాబును కలిసిన యాజమాన్యం
- పక్షం రోజుల్లో పనులు ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్న పార్లే ఆగ్రో

టీడీపీ నేతృత్వంలో కూటమి అధికారంలోకి రావడంతో పారిశ్రామిక ప్రగతికి జీవం పోసినట్టయింది. పారిశ్రామికాభివృద్ధి లేక తిరోగమనం పట్టిన మల్లవల్లికి పునర్వైభవం రానుంది. వైసీపీ హయాంలో సహాయ నిరాకరణ, వేధింపులకు గురైన 'పార్లే ఆగ్రో' మళ్లీ రంగంలోకి వచ్చింది. పార్లే ఆగ్రో యాజమాన్యం సీఎం చంద్రబాబును కలిసింది. మల్లవల్లిలో ప్లాంట్ పునరుద్ధరణ పనులు చేపట్టనున్నట్టు తెలిపింది. సీఎం చంద్రబాబు సానుకూల హామీ ఇవ్వటంతో మల్లవల్లిలోని మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో పక్షం రోజుల్లో ప్లాంట్ పనులను పునరుద్ధరించేందుకు సంస్థ రంగం సిద్ధం చేస్తోంది. స్థానికంగా లక్షణం 500 నుంచి 1000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/జంక్షన్ రూరల్): గత ఐదేళ్లుగా మల్లవల్లిలోని మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో కొత్త పరిశ్రమలు ఒక్కటీ రాలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పడిన పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు తప్పితే కొత్తగా ఒక్కటీ లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో భూములు దక్కించుకున్నాయని, పనులు మొదలు పెట్టాయని ఒకే ఒక్క కారణంగా ఆయా యూనిట్ల నిర్వాహకులపై వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపులకు పాల్పడింది. వైసీపీ ప్రభుత్వం వచ్చీ రాగానే.. విజిలెన్స్ విచారణల పేరుతో పారిశ్రామిక సంస్థలను భయభ్రాంతులకు గురి చేసింది. ఈ షాక్ నుంచి కోలుకునేలోపు కరోనా వచ్చింది. ఈ పరిస్థితుల్లో పారిశ్రామిక రంగం కకావికలమైంది. అనేక సంస్థలు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క అంగుళం కూడా ముందుకు కదలలేకపోయాయి. అలా ఇబ్బందులు పడ్డ సంస్థల్లో పార్లే ఆగ్రో కూడా ఒకటి.

పార్లే ఆగ్రో మల్లవల్లికి ఎలా వచ్చింది?

పార్లే ఆగ్రోస్ అనేది దేశంలోనే అతి పెద్ద బేవరేజెస్ కంపెనీ. 1985 నుంచి బేవరేజెస్ రంగంలోకి దిగింది. దేశంలోని బేవరేజెస్ కంపెనీలలోనే అగ్రస్థానం సాధించింది. దీని హెడ్ క్వార్టర్ ముంబయిలో ఉంది. ముంబయిలోని కంపెనీలో 5500 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. డ్రింక్స్ కేటగిరీలో పార్లే ఆగ్రో అనేక సొంత ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ క్రమంలో పార్లే ఆగ్రో సంస్థ దక్షిణ భారత దేశంలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లో మల్లవల్లిలోని ఇండస్ట్రియల్ పార్క్‌లో తమ బేవరేజెస్ యూనిట్‌ను ఏర్పాటు చేయటానికి గత టీడీపీ ప్రభుత్వంలో ముందుకు వచ్చింది. మల్లవల్లిలో భారీ పరిశ్రమల కేటగిరీలో పార్లే ఆగ్రోకు కూడా అప్పటి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్లాంట్ స్ట్రక్చర్‌ను కూడా పూర్తి చేసింది.

రూ.158 కోట్ల పెట్టుబడి.. వెయ్యి ఉద్యోగాలు

మల్లవల్లిలో అశోక్ లేల్యాండ్ కంపెనీకి కేటాయించిన భూముల పక్కనే పార్లే ఆగ్రో సంస్థకు 25 ఎకరాలను గత టీడీపీ ప్రభుత్వం పార్లే ఆగ్రోకు కేటాయించింది. ఈ భూముల్లో రూ.158 కోట్ల వ్యయంతో బేవరేజెస్ యూనిట్ ఏర్పాటు చేయటానికి గత టీడీపీ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఎంఓయూ ప్రకారం ముందుగా 500 మందికి ఉద్యోగాలు కల్పిస్తామని, భవిష్యత్తులో విస్తరిస్తే 1000 మంది వరకు ఉద్యోగాలలు కల్పిస్తామని పార్లే ఆగ్రో పేర్కొంది. ఎంఓయూ ప్రకారం కేటాయించిన భూములను అవుట్ రేట్ సేల్ (ఓఆర్ఎస్) విధానంలో కొనుగోలు చేసింది. ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన క్రమంలో కరోనా తదనంతర పరిస్థితుల కారణంగా ఈ సంస్థకు ఆర్థిక ఇబ్బందులు కూడా తలెత్తాయి. ఈ క్రమంలో కొత్త ప్లాంట్ల జోలికి వెళ్లకుండా ఉత్పాదకతపై దృష్టి సారించింది.

ఐదేళ్లుగా హృదయ విదారకం

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్లే ఆగ్రో ప్లాంట్ పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ప్లాంట్‌లో మొక్కలు మొలిచి ఉన్నాయి. ప్లాంట్ ఆవరణలోనే ఖరీదైన ఐరన్ సామగ్రి నిరుపయోగంగా పడి ఉంది. ప్లాంట్ ఏర్పడింది కానీ, అందులో మిషనరీ ఏర్పాటు జరగలేదు. ఆవరణ అంతా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ప్లాంట్ పనుల కోసం కంటెయినర్ క్యాబిన్లను తెప్పించారు. ఐదేళ్లూ ఎలాంటి పనులు జరగకపోవటంతో ఈ కంటెయినర్లు తుప్పుపట్టిపోయి ఉన్నాయి. సెక్యూరిటీ రూమ్ కూడా మొక్కల మధ్యన ఉండిపోయింది. చూడటానికి దయనీయ స్థితిలో ఉంది. భారీ ప్లాంట్ ఏర్పాటు చేసినప్పటికీ అలంకారంగా ఉంది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం రావటంతో పార్లే ఆగ్రో సంస్థ పక్షం రోజుల్లో ప్లాంట్ పునరుద్ధరణ పనులు చేపట్టబోతోంది.



ఐరన్ మెటీరియల్



రొయ్యూరు ప్రైవేటు భూముల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు (ఫైల్)

తోడేళ్లను పట్టేస్తారా?

వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఇసుక దోపిడీ

మొదట్లో ప్రభుత్వం, తరువాత జేపీ వెంచర్స్, కేసీవైసీ పేరుతో తవ్వకాలు

- రొయ్యూరు, లంకపల్లి, మద్దూరు, చోడవరం క్వారీల్లో దందా
- రొయ్యూరు రైతుల పట్టా భూముల్లో ఏకపక్షంగా తవ్వకాలు
- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను తప్పుదారి పట్టించిన అధికారులు
- రొయ్యూరుకు బదులు నార్తువల్లూరు క్వారీ పరిశీలన

తోట్లవల్లూరు మండలంలోనే రూ.వెయ్యి కోట్ల అవినీతి

తోట్లవల్లూరు : వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన కొన్ని రోజుల్లోనే ఉచిత ఇసుక పథకాన్ని రద్దు చేసింది. ఎక్కడా ఇసుక దొరకకుండా చేసి ఇసుక ముఠా కార్మికులు, తాపీ కార్మికులు రోడ్డున పడేసింది. ఆ తరువాత కొంతకాలం ప్రభుత్వమే ఇసుక తవ్వకాలు జరపటంతో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల దోపిడీ మూడుపువ్వులు ఆరుకాయలు అన్నట్టుగా సాగింది. తరువాత జయప్రకాష్ వెంచర్స్ (జేపీ)కు రాష్ట్రంలోని ఇసుక క్వారీలను అప్పగించేశారు. పేరుకి జేపీ వెంచర్స్ అయినా వెనుకున్నది మాత్రం వైసీపీ పెద్దలే. రొయ్యూరు, వల్లూరుపాలెంలో పర్వతాలను తలపించే విధంగా ఇసుకను నిల్వచేసి వైసీపీ నేతల సిఫార్సు ఉన్న వారికే విక్రయించేవారు. ఇసుక రవాణాను తనిఖీ చేసే అధికారం ఒక్క ఎస్ఈబీకి తప్పా మిగతా ఎవ్వరికీ లేకుండా ప్రభుత్వ పెద్దలు కట్టడి చేశారు. శ్రీకాకుళం, లంకపల్లి, మద్దూరు, చోడవరం క్వారీల్లో సైతం భారీ దోపిడీ సాగించారు.

ఇసుక అక్రమాలపై న్యాయ పోరాటం

జేపీ వెంచర్స్ తవ్వకాలు ముగిశాక జీసీకేసీ ప్రాజెక్ట్స్ అండ్ వర్క్స్ (ప్రై) లిమిటెడ్‌కు జిల్లాలోని ఇసుక క్వారీలను ప్రభుత్వం అప్పగించింది. నిబంధనల ప్రకారం క్వారీ ఉన్న మండలంలోని రెవెన్యూ అధికారులను, మైనింగ్, భూగర్భజల శాఖ అధికారులను సంప్రదించి వారు సూచించిన ప్రదేశంలో ఇసుక తీయాలి. కానీ జీసీకేసీ సంస్థ ఈ నిబంధనలను పాటించకుండా రొయ్యూరులో జనవరిలో ఇసుక తవ్వకాలు చేపట్టింది. అక్రమ ఇసుక తవ్వకాలను ఆపాలని రొయ్యూరు ప్రజలు ప్రత్యక్ష ఆందోళనలకు దిగిన మూడుసార్లు స్థానిక తహసీల్దార్ ఎం.కుసుమకుమారి ఇసుక తవ్వకాలను ఆపినా పెద్దల అండతో రోజుల వ్యవధిలోనే తిరిగి చేపట్టేవారు. ఇలా జిల్లా పెద్దల అండదండలు, వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో అంతులేని ఇసుక దోపిడీ జరిగింది. కృష్ణానది పాయల్లో పర్యావరణానికి ఇబ్బందికలిగే విధంగా అనుమతులు లేకుండా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై గుంటూరు జిల్లాకు చెందిన నాగేంద్ర అనే వ్యక్తి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో ఎక్కడెక్కడ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి? వాటికి పర్యావరణ అనుమతులున్నాయా? పర్యావరణానికి ఎంత నష్టం చేకూర్చారు?అనే అంశాలను పరిశీలించి నివేదికలను అందించాలని కలెక్టర్లకు ఫిబ్రవరిలో ఆదేశాలిచ్చింది. దాంతో వైసీపీ ప్రభుత్వ పెద్దలు అధికారులను తప్పుడు నివేదికలు ఇచ్చేలా అప్రమత్తం చేశారు.

ప్రభుత్వం మారింది.. విచారణ ఉంటుందా?

వైసీపీ ప్రభుత్వం మారి టీడీపీ ప్రభుత్వం ఏర్పడటంతో నాటి ఇసుక దందాపై దృష్టిసారించి విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాకు చెందిన మచిలీపట్నం ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర గనులశాఖా మంత్రి కావటంతో వైసీపీ పెద్దల ఇసుక దోపిడీపై చర్యలు తీసుకునే దిశగా అడుగులు వేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

అక్రమాల్లేవంటూ అధికారుల వత్తాసు

ఫిబ్రవరి 12వ తేదీన నాటి జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఆధ్వర్యంలో ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు, మైనింగ్ సర్వేయర్ రామలక్ష్మి పలువురు అధికారులు ఇసుక తవ్వకాల పరిశీలనకు వచ్చారు. 12వ తేదీన ఉదయం నుంచి రొయ్యూరులో జీసీకేసీ సంస్థ ఇసుక తవ్వకాలను ఆపివేశాక మధ్యాహ్న సమయంలో సదరు అధికారుల బృందం పాములలంక వద్ద పెద్దఏటిపాయలోని మూడున్నరేళ్ల క్రితం మూతపడిన నార్తువల్లూరు క్వారీకి వెళ్లి పరిశీలించి ఇక్కడ ఇసుక తవ్వకాలేమి జరగటం లేదని చెప్పి వెళ్లిపోయారు. ఈ అధికారులు మండలంలో నుంచి వెళ్లిన గంటలోనే రొయ్యూరు క్వారీలో ఇసుక తవ్వకాలు చేపట్టారు. అంటే అధికారులు ఇసుక క్వారీ నిర్వాహకులకు ఎంత ముందస్తు సమాచారం ఇచ్చి అన్ని విధాలుగా సహకరించారో తేటతెల్లమవుతుంది. అధికారుల నిర్వాకంపై ఫిబ్రవరి 13న ఆంధ్రజ్యోతి వార్తా కథనం సైతం ప్రచురించిన విషయం విదితమే. తరువాత ఎక్కడా ఇసుక తవ్వకాలు జరగటం లేదని, యంత్రాలను ఎక్కడా వినియోగించలేదని అధికారులు ఎన్జీటీకి నివేదికలు ఇచ్చిన విషయం కూడా బయటపడింది.



సీటు వదల!

ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్ల కొత్త రూటు

- ఇక్కడ నుంచి కదలటానికి ససేమిరా..
- వైసీపీ ప్రభుత్వంలో అవినీతిపరుల దూరాలోచన
- టీడీపీ ఎమ్మెల్యేల చుట్టూ తిరిగినా దక్కని హామీ
- ద్వితీయ శ్రేణి నాయకులు, ముఖ్యకార్యకర్తలతో మంతనాలు సాగించి ఎమ్మెల్యేలపై ఒత్తిళ్లు
- ఇతర జిల్లాలకు వెళ్లిన వారిలో కొందరు అక్కడే ఆసక్తి..
- పాత స్థానంలోకి వచ్చేందుకు మరికొందరు పైరవీలు

సీటు మీద మమకారమో? కాసులపై యావో తెలియదు కానీ కొందరు రెవెన్యూ తహసీల్దార్లు సీటు వదలమంటున్నారు. సార్వత్రిక ఎన్నికల వేళ బదిలీలపై వచ్చిన ఇతర జిల్లాల రెవెన్యూ తహసీల్దార్లు సీటు వదలటానికి ఏమాత్రం ఇష్టపడటం లేదు. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి వెళ్లిన తహసీల్దార్లు కొందరు కూడా ఆ జిల్లాల నుంచి రావటానికి ఇష్టపడటం లేదు. తమకిష్టమైన స్థానాల్లో కొనసాగేందుకు రెవెన్యూ తహసీల్దార్లు పైరవీలు మొదలెట్టారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్నికల సమయంలో బదిలీలపై పొరుగు జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు తిరిగి సొంత జిల్లాలకు రావాల్సి ఉంటుంది. దీనిపై త్వరలో ఆదేశాలు వెలువడే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలు మారిన తహసీల్దార్లంతా తిరిగి సొంత జిల్లాలకు రావాల్సి ఉంటుంది. పొరుగు జిల్లాల నుంచి వచ్చిన వారంతా కూడా తిరిగి వారి సొంత జిల్లాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను కాదని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగించుకున్నట్టుగా ఎమ్మెల్యేలను కలుసుకుని ప్రసన్నం చేసుకునే ఎత్తులు వేస్తున్నారు.

నేను మీ పార్టీనే అంటూ కలిపేసే యత్నం

నేను మీ పార్టీనే అంటూ సంకేతాలు పంపుతున్నారు. కిందటి వైసీపీ ప్రభుత్వ ఎమ్మెల్యేల మాదిరిగా ఏ ఒక్క టీడీపీ, జనసేన ఎమ్మెల్యే కూడా తహసీల్దార్ల నుంచి వస్తున్న ప్రతిపాదనలను తోసివేస్తున్నారు. ఎమ్మెల్యేలు మాట వినటం లేదని ద్వితీయ శ్రేణి నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ద్వితీయ శ్రేణి నాయకులు, ఎమ్మెల్యేలు బాగా ఇష్టపడే కార్యకర్తలను కూడా వదలకుండా ఫోన్లు చేస్తూ ఇక్కడే ఉండిపోవటానికి పావులు కదుపుతున్నారు. విజయవాడ గ్రేటర్ విలీన జాబితా పరిధిలో ఉన్న అన్ని గ్రామీణ మండలాల్లో దాదాపుగా ఇదే పరిస్థితి నెలకొంది.

భూముల కొనుగోలులో భారీ దోపిడీ

వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ గ్రేటర్ పరిధిలోని - మిగతా 6లో

దసరా లక్ష్యంగా..



చకచకా సాగుతున్న శివాలయం పనులు

దుర్గగుడి అభివృద్ధిపై కొత్త సర్కార్ దృష్టి

- అక్టోబరు మొదటి వారానికి పనుల పూర్తికి కసరత్తు
- ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా
- పనులు పరుగులు పెట్టించాలన్న మంత్రి ఆనం
- నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ
- ఎలివేటెడ్ క్యూకాంప్లెక్స్, అన్నదాన భవనం..
- ఇతర పనులు దసరా నాటికి పూర్తయ్యేలా ప్రణాళిక
- గతంలో రెండుసార్లు శంకుస్థాపనలు చేసిన జగన్
- నిధుల కొరతతో నత్తనడకన సాగుతున్న పనులు



దుర్గగుడికి కొత్తశోభ తీసుకొచ్చే దిశగా నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో అక్రమాలతో దేవస్థానం ప్రాభవం మసకబారుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం గుడిపై రాజకీయాలకు స్వస్తి పలికి పూర్వవైభవం తీసుకొచ్చే దిశగా కసరత్తు ప్రారంభించింది. దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఇటీవల దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గగుడిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, నిధుల కొరత లేకుండా చూసే బాధ్యత తమదని హామీ ఇచ్చినట్టు తెలిసింది. దసరా నాటికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో పలుమార్లు ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు చేసి హడావిడి చేశారే తప్ప పనులు శరవేగంగా సాగింది లేదు. 2021లో సీఎం హోదాలో జగన్ దుర్గగుడికి వచ్చి అభివృద్ధి పనులకు రూ.70 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. కానీ పైసా విదిల్చింది లేదు. 2023 డిసెంబరులో మరోసారి దుర్గగుడికి వచ్చిన జగన్ ఎన్నికల సమయం కావడంతో పలు పనులకు ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు చేశారు. అయితే నిధుల కొరతతో ఇవి నత్తనడక నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం దుర్గగుడి అభివృద్ధి పనులపై దృష్టి సారించింది. దాతలు సమకూర్చిన రూ.5 కోట్ల నిధులతో నిర్మాణం చేపట్టిన యాగశాల పనులు తుది దశలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్న పనుల్లో అన్నప్రసాద భవనం, ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, ప్రసాదం పోటు, పూజామండపాల పనులు ప్రారంభదశలో ఉన్నాయి.

ఒకేసారి 2వేల మందికి అన్నదానం

దసరా ఉత్సవాల సమయంలో దుర్గగుడికి భక్తులు పోటెత్తుతుంటారు. ప్రతిరోజూ లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటుంటారు. ఇటీవల కాలంలో దుర్గగుడికి భక్తుల సంఖ్య బాగా పెరిగింది. సగటున రోజుకి 40 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అన్నప్రసాద భవనాన్ని భారీ ఎత్తున నిర్మాణం చేస్తున్నారు. రూ.30 కోట్ల వ్యయంతో జీ ప్లస్1 భవనాన్ని నిర్మిస్తున్నారు. ఒకేసారి 2వేల మంది భోజనాలు చేసేలా ఈ భవన నిర్మాణం జరుగుతోంది. దీంతోపాటు రూ.27 కోట్లతో అమ్మవారి ప్రసాదం పోటును జీ ప్లస్ 4 భవనంగా నిర్మాణం చేస్తున్నారు. ప్రసాదం తయారీ, ప్యాకింగ్, విక్రయాలు అన్నీ ఈ భవనంలోనే జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



మహామండపం మార్గంలో వేగంగా జరుగుతున్న పనులు

పూజల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

ప్రస్తుతం లక్ష కుంకుమార్చన, శ్రీ చక్ర అర్చన వంటి పూజలు ఆలయ ప్రాంగణంలో జరుగుతున్నా వాటికి ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేయలేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పూజా మండపాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.7 కోట్ల వ్యయంతో వీటిని నిర్మాణం చేస్తున్నారు. దీంతో ప్రత్యేక పూజలు చేసుకునే భక్తులకు వెసులుబాటు కలుగుతుంది.

భక్తుల రద్దీ నియంత్రణకు..

పెరుగుతున్న భక్తుల రద్దీ నియంత్రణకు దుర్గగుడి అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా కనకదుర్గనగర్ ప్రవేశ మార్గం నుంచి ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.13 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లో దసరా నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతోపాటు రూ.75 లక్షలతో కనకదుర్గానగర్ నుంచి మహామండపం వరకు రాజమార్గం, కనకదుర్గానగర్ ప్రవేశం వద్ద రూ.70 లక్షలతో మహారాజద్వారం వంటి పనులు జరుగుతున్నాయి.

నూతన కేశఖండనశాల..

దుర్గగుడి చెంత ఉన్న వాటర్ ట్యాంకు స్థలంలో కొత్త కేశఖండనశాలను రూ.19 కోట్లతో నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. అయితే వాటర్ ట్యాంకు ఉన్న స్థలం 10 సెంట్లు వీఎంసీ ఆధీనంలో ఉంది. దుర్గగుడికి చెందిన స్థలం 13 సెంట్లతోపాటు ఈ 10 సెంట్ల స్థలాన్ని కలుపుకొని కేశనఖండనశాలను భక్తులకు సౌకర్యవంతంగా నిర్మాణం చేయాలన్న ఆలోచనలో అధికారులు - మిగతా 6లో

జగ్గయ్యపేటలో గాలివాన బీభత్సం

- ట్రాన్స్‌కోకు రూ.8లక్షలు నష్టం 6లో

భ్రమలు వీడకపోతే జగన్‌కు అధోగతే

- ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన దుర్మార్గుడు జగన్
- అతడిని శిక్షించేందుకు సీఎం చంద్రబాబు కఠిన చట్టాలు తేవాలి
- విలేకరుల సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



6లో


ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి అనితను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి అనితతో కృష్ణాజిల్లా ఎస్పీ నయీం అస్మీ భేటీ

మచిలీపట్నం టౌన్, జూన్ 18 : హోం మంత్రి వంగలపూడి అనిత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణపై ఎస్పీకి మంత్రులు సూచనలు చేశారు.

అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

● మున్సిపల్ కమిషనర్లకు కృష్ణా కలెక్టర్ ఆదేశం

మచిలీపట్నం, జూన్18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలోని అన్ని పురపాలక సంఘాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. కలెక్టర్ బంగ్లా నుంచి మంగళవారం మునిసిపల్ కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిన భవనాల్లో సచివాలయాలు ఉంటే వాటిని వేరొక ప్రాంతానికి మార్చాలని సూచించారు. మచిలీపట్నం మూడుస్తంభాల సెంటరులో అన్న క్యాంటీన్‌లోని సచివాలయాన్ని మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మచిలీపట్నం నగర కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు తెలిపారు. గుడివాడ పురపాలకసంఘంలో రెండు అన్న క్యాంటీన్లు గతంలో ఉండేవని, ఒక భవనంలో సచివాలయం ఏర్పాటు చేశారని, సచివాలయాన్ని వేరే భవనంలోకి మార్చేందుకు చర్యలు చేపట్టామని గుడివాడ మునిసిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. తాడిగడప మునిసిపాలిటీ నూతనంగా ఏర్పడిన నేపథ్యంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు.


రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డిని కలిసిన రవాణా శాఖ ఉద్యోగులు

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

● ఉద్యోగ సంఘం నాయకులతో రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

వన్‌టౌన్, జూన్ 18 : ప్రజలకు మరింత చేరువగా అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహించాలని రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రామవరప్పాడురింగ్ సెంటర్‌లోని కె.హోటల్‌లో మంగళవారం మంత్రిని రవాణా ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ఉన్నతాధికారులతో త్వరలోనే సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐ.రఘుబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయడంలో ముందుంటామని తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరి, సంఘం నాయకులు డి.శ్రీనివాస్, ఎం.ఆనంద్ కుమార్, జోనల్ అధ్యక్షులు ఎం.రాజ బాబు, ఎం.శ్రీనివాసరావు, పి.లక్ష్మికర్‌రెడ్డి, నాయకులు వి.రాకేష్, మధుకర్‌బాబు, రమాదేవి, బాలజ్యోతి, అనురాధ, కే.వివి నాగమురళీ, వీహెచ్ పైడిరాజు, ఏ.బాలరాజు, ఎన్.నాగశంకర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, పిడుగుపడి దెబ్బతిన్న ధ్వజస్తంభం

జగ్గయ్యపేటలో గాలివాన బీభత్సం

● ట్రాన్స్‌కోకు రూ.8 లక్షలు నష్టం

జగ్గయ్య పేట, జూన్ 18 : జగ్గయ్యపేట పరిసర ప్రాంతంలో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో బలుసుపాడు రోడ్డులో సబ్‌స్టేషన్ సమీపంలో అనేక చెట్లు నేలకూలాయి. 13 విద్యుత్ స్తంభాలు రోడ్డుకడ్డంగా పడిపోయాయి. రాకపోకలు నిలిచిపోవటం, విద్యుత్‌లైన్‌లు తెగిపోవటంతో విద్యుత్ సరఫరా నిలిచి జగ్గయ్యపేట మండలంలో గాఢాంధకారం నెలకొంది. ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది రేయింబవళ్లు శ్రమించి చెట్లను పక్కకు తొలగించి, విద్యుత్ వైర్లు కత్తిరించి రాకపోకలను పునరుద్ధరించారు. మంగళవారం తెల్లవారుఝామున పట్టణానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. గ్రామాల్లో తెల్లవారిన తర్వాత విద్యుత్ సరఫరా చేశారు. వర్ష బీభత్సానికి ట్రాన్స్‌కోకు రూ.8 లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు ఏఈ కృష్ణారెడ్డి చెప్పారు. విద్యుత్ స్తంభాలను ఒకటి రెండు రోజుల్లో తిరిగి ఏర్పాటు చేస్తామన్నారు. అనుమంచిపల్లి రామాలయంలో పిడుగుపడి ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభం దెబ్బతిన్నాయి. అదే సమయంలో అక్కడ ఉన్న యువకులు పిడుగుల శబ్ధానికి స్పృహతప్పి పడ్డారు. కాసేపటికి తేరుకుని ఇళ్లకు వెళ్లిపోయారు.


గ్రీవెన్స్ కార్యక్రమంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

● గ్రీవెన్స్ కార్యక్రమంలో కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, జూన్18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తామని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఉద్యోగుల సమస్యలు తెలుసుకునేందుకు స్పందన సమావేశపుహాలులో మంగళవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఆయా విభాగాల జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ రెవెన్యూ అధికారులకు కోటా ప్రకారం సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇవ్వాలని, గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. ప్రావిడెంట్ ఫండ్ సమస్యలను పరిష్కరించాలని అధికశాతం మంది ఉద్యోగులు అర్జీలు ఇచ్చారు. టీచర్ల పీఎఫ్ ఖాతాలను ఆన్‌లైన్‌లో నవీకరణ చేయాలని, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించిన టీచర్లకు డ్యూటీసర్టిఫికెట్లు మంజూరు చేయాలని టీచర్లు అర్జీ అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వీఆర్వోలకు పదోన్నతుల అంశంపై ఈనెల 20వతేదీన అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తానని హామీ ఇచ్చారు. ప్రావిడెంట్ ఫండ్ సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక శిబిరం నిర్వహించాలని అధికారులకు సూచించారు.

భ్రమలు వీడకపోతే జగన్‌కు అధోగతే

● ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన దుర్మార్గుడు జగన్
● అతడిని శిక్షించేందుకు సీఎం చంద్రబాబు కఠిన చట్టాలు తేవాలి
● విలేకరుల సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

విద్యాధరపురం, జూన్ 18 : మాజీ సీఎం జగన్ ఇంకా భ్రమలు వీడకపోతే మరో మూడు నెల్లో అధోగతి పాలవడం ఖాయమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి ట్విటర్‌లో ఇటీవల ఎన్నికలలో ఈవీఎంలు ట్యాంపరింగ్‌కు గురయ్యాయని చేసిన పోస్టింగ్‌పై శివనాథ్ స్పందించారు. గతంలో ఈవీఎంలు బాగా పనిచేశాయని జగన్ చెప్పిన వ్యాఖ్యల ఆడియోను ఆయన ప్రదర్శించారు. ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా మాట మార్చి ఈవీఎంలలోట్యాంపరింగ్ జరిగిందనడం, బ్యాలెట్ విధానంలో పోలింగ్ జరపాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. 2019లో జగన్‌కు ఓటు వేసిన ప్రజలే అంతకుమించిన ఉత్సాహంతో ఇప్పుడు కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబునాయుడుకు మద్దతు పలికారన్నారు. ప్రజా తీర్పును గౌరవించలేక, ఓటమిని అంగీకరించలేక జగన్ పిచ్చి భ్రమల్లో ఉన్నారన్నారు. జగన్ జీవితమే ఒక మోసమని, సొమ్మును దోచుకోవడం అతని నైజమన్నారు. వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ఈడీ, సీబీఐ కేసులలో కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా ఇప్పుడు న్యాయం,ధర్మం, ప్రజాస్వామ్యం అంటూ ప్రస్తావించడం హాస్యాస్పదమన్నారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించని జగన్ ఈడీ కేసుల్లో జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. జగన్ తన ఇంట్లో ఏర్పాటు చేసుకున్న ఫర్నీచర్‌ను ప్రభుత్వానికి అప్పగించకపోతే ఫర్నీచర్ దొంగగా మిగిలిపోతారంటూ ఆనాడు కోడెల శివప్రసాద్‌ను వేధించిన తీరును చిన్ని ప్రస్తావించారు. ఇప్పటికైనా జగన్ తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు వచ్చి తనను ప్రజలు ఎందుకు తిరస్కరించారో, ప్రజలకు ఏమి కావాలో, రాష్ట్రంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్నారు. లేకపోతే 11 మంది ఎమ్మెల్యేలు కూడా మిగలరని న్నారు. వైజాగ్ లో జగన్ ప్యాలెస్ బాగోతం ప్రజలకు ముందే తెలిసి ఉంటే ఆ 11 సీట్లు కూడా వచ్చేవి కావన్నారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన దుర్మార్గుడు జగన్ అన్నారు. జగన్ దుర్వినియోగం చేసిన సొమ్ము మొత్తం కక్కించే విధంగా సీఎం చంద్రబాబునాయుడు కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. మరోసారి ఏ నాయకుడు ఇలా చేయకుండా చర్య లు తీసుకోవాలన్నారు. దోపిడీ సొమ్మును ప్రజల చెంతకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటమి చెందిన నాయకులు ప్రజాసమస్యలపై పోరాడాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తే ప్రజాజీవితానికి దూరమవుతారని తెలిపారు


మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్‌లను అభినందిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

మంత్రులు పార్థసారథి, గొట్టిపాటికి శుభాకాంక్షలు

మంత్రి కొలుసు పార్థసారథిని తాడిగడపలోని ఆయన నివాసంలో మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్ మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి సత్కరించారు. ప్రజాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించుకున్నారు. టీఎస్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, సీనియర్ టీడీపీ నాయకుడు బొప్పన భవకుమార్, ఎంపీ పొలిటికల్ సెక్రటరీ నరసింహ చౌదరి తదితరులు పాల్గొన్నారు. విద్యుత్‌శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గొట్టిపాటి రవికుమార్‌ను నోవాటెల్‌లో కేశినేని శివనాథ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఉన్నారు.

మాజీ సీఎం జగన్‌ను ప్రజలు మనిషిగా కూడా గుర్తించలేదు

● ఎక్స్‌లో నెట్టెం ఘాటు విమర్శలు

జగ్గయ్యపేట, జూన్ 18 : వైఎస్ జగన్ ఓడిపోయాక ప్రజాస్వామ్యం, ప్రజా స్వామ్య విలువలు గుర్తొచ్చాయా అని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం ఎక్స్‌లో ఘాటుగా స్పందించారు. ప్రజలు కనీసం జగన్‌ను మనిషిగా కూడా లెక్కేయటం లేదని, ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని మనిషిగా మారతారని ఆశిస్తున్నానని తీవ్రంగా విమర్శించారు. వైఎస్ జగన్ ఇవీఎంల ట్యాంపరింగ్, ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య విలువలు వ్యాఖ్యానించటంపై నెట్టెం పైవిధంగా స్పందించారు.

మాజీ మంత్రి ఉమాతో రవీంద్ర భేటీ



గొల్లపూడి : గొల్లపూడి పార్టీ కార్యాలయంలో మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రవీంద్రను ఉమా ఘనంగా సత్కరించారు. నర్రా వాసు పాల్గొన్నారు.

కాకులపాడు చానల్‌లో స్వచ్ఛందంగా పూడికతీత

● కాకులపాడు, కానుమోలు, దంటగుంట్ల రైతుల చొరవ
● కాకులపాడు రైతు పూర్ణబ్రహ్మయ్య సహకారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 18 : గత ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెత్త, గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలతో పూడుకుపోయిన సాగునీటి కాలువలను రైతులే చందాలు వేసుకుని స్వచ్ఛందంగా పూడికతొలగించుకుంటున్నారు. కాకులపాడు, కానుమోలు, దంటగుంట్ల, తదితర గ్రామాలకు చెందిన రైతులతో పాటు చలసాని పూర్ణబ్రహ్మయ్య సహకారంతో కాకులపాడు చానల్‌లో పూడికతీత పనులు మంగళవారం మొదలు పెట్టారు. సర్పంచ్ కాజ ప్రసాద్, చలసాని శ్రీనివాస్, తదితరులు ఎక్స్‌కవేటర్‌కు పూజలు చేసి పూడికతీత, ముళ్లపొదల తొలగింపు చేపట్టారు. సాగుకు సమాయత్తమవుతున్న తరుణంలో ప్రధాన కాలువలన్నీ పూడుకుపోవడంతో రైతులే స్వచ్ఛందంగా కాలువ పూడికతీత పనులు చేపట్టారు. కాకులపాడు చానల్ ద్వారా తొమ్మిది గ్రామాలకు తాగునీరు, 4329 ఎకరాలకు పైగా సాగునీరు అందుతుందన్నారు. ఏప్రిల్‌లో అధికారుల దృష్టికి పూడిక సమస్యను తీసుకువెళ్లి తామే బాగుచేసుకుంటామని అడిగినా ఎన్నికల య్యేంతవరకూ కుదరదని అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చలసాని శ్రీనివాస్, లింగం నవీన్, నాగేశ్వరరావు, కామినేని హరిబాబు, ఎలీషా, తోట రంగారావు, తాడంకి దాసు, యజ్జవరపు శ్రీనివాసరావు, కురిమి శ్రీనివాసరావు, మున్నంగి శేషగిరిరావు, ముప్పాళ్ల శంకరావు, పడకల వెంకట్రామయ్య, తిపిర్నేని సత్యన్నారాయణ, వీరవపనేని రాజా, వెలగపూడి నాసరయ్య తదితరులతో పాటు గ్రామాల రైతులు పాల్గొన్నారు.


సాగునీటి కాల్వలోని గుర్రపు డెక్కను స్వచ్ఛందంగా తొలగిస్తున్న రైతులు

సాగునీటి కోసం యుద్ధాలు చేయాల్సి వచ్చింది.



కాకులపాడు చానల్ ద్వారా రంగయ్యప్పారావుపేట, కాకులపాడు తదితర తొమ్మిది గ్రామాలకు సాగు, తాగునీరందుతుంది. పూడిక వల్ల సాగునీరందక అధికారులతో యుద్ధాలు చేయవలసివచ్చింది. గతంలో రెండుసార్లు కాకులపాడు చానల్‌కు నీరు వదిలే విషయమై డీఈ కొడాలి బాబుతో గొడవకూడా పడ్డాం. పోలీసుల కేసులకు కూడా బెదరక పోరాడితేనే సాగునీరందింది. కాలువ బాగుచేతకు సహకరించిన చలసాని పూర్ణబ్రహ్మయ్య, ఇతర రైతులకు కృతజ్ఞతలు.

- కాజ ప్రసాద్, సర్పంచ్


సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

సీఎం చంద్రబాబును కలిసిన ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 18 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సచివాలయంలోని ఆయన చాంబర్‌లో మంగళవారం ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి మంత్రి కొల్లు రవీంద్ర మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలియజేసి, జిల్లాలోని రాజకీయ పరిస్థితులపై సమీక్షించారు.

ఏజీగా రెండోసారి దమ్మాలపాటి

● కంచికచర్లలో హర్షాతిరేకాలు



కంచికచర్ల, జూన్ 18: కంచికచర్ల పట్టణానికి చెందిన సీనియర్ అడ్వకేట్ దమ్మాలపాటి శ్రీనివాస్ ఏపీ రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌గా నియమితులయ్యారు. సీఎం నారా చంద్రబాబు నాయు డు ఆదేశాల మేరకు శ్రీనివాస్‌ను ఏజీగా నియమిస్తూ సీఎంవో మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రైతు కుటుంబానికి చెందిన ఆయన 1965 జూన్ రెండున జన్మించారు. తల్లిదండ్రులు దమ్మాలపాటి నాగేశ్వరరావు - విజయ. ప్రాథమిక విద్య కంచికచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభ్యసించారు. విజయవాడ సిద్ధార్థ కళాశాలలో డిగ్రీ చదివిన ఆయన సిద్ధార్థ లా కళాశాలలో ఎల్‌ఎల్‌బీ డిగ్రీ పట్టా పుచ్చుకున్నారు. 1991లో ఉమ్మడి హైకోర్టు బార్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్‌మెంట్ అయ్యారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో 2014 నుంచి 2016 వరకు అదనపు అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. 2016 నుంచి 2019 వరకు అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. దమ్మాలపాటి రెండోసారి అడ్వకేట్ జనరల్‌గా నియమించటం పట్ల కంచికచర్ల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎంపీ కేశినేని చిన్నికి గన్నవరం టీడీపీ నేతల సత్కారం

గన్నవరం, జూన్ 18 : విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ని గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల పరిశీలకులు వి.హరిబాబునాయుడు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, తుమ్మల జగదీష్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హరిబాబు నాయుడును కేశినేని చిన్ని సత్కరించారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రామును కూడా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

టమోటా ధరల అదుపునకు చర్యలు

కృష్ణలంక, జూన్ 18 : టమోటధర అదుపునకు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొరుగు రాష్ట్రాలలో టమోట సాగు లేకపోవడం, వర్షాల ప్రభావం వలన టమోట ధర పెరిగిందన్నారు. గత పదిరోజుల్లో చిత్తూరు, అన్నమయ్య జిల్లాలోని మార్కెట్‌ల నందు సుమారు 30 టన్నుల టమోట కొనుగోలు చేసి గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలోని రైతు బజార్లలో కొనుగోలు ధరలకే అమ్మటం జరిగిందన్నారు. టమోటా కొనుగోలుకు ప్రతిజిల్లాకు రూ.5 లక్షలతో రివాల్వింగ్ ఫండ్ అందుబాటులో ఉంచామన్నారు.

సీటు వదల!

(5వ పేజీ తరువాయి)

గ్రామీణ మండలాల తహసీల్దార్లు జగనన్న ఇళ్ల పేరుతో భూములు కొనుగోలులో భారీగా అవినీతికి పాల్పడ్డారు. సీసీఎల్ఏలో కూడా తమకు సన్నిహితంగా ఉన్న అధికారులతో కలిసి ప్రభుత్వ చెరువులను కూడా సాగు చేసుకుంటున్నట్టుగా అడ్డగోలుగా పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చేశారు. ఆయా గ్రామీణ మండలాల పరిధిలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారు.

గత తహసీల్దార్లు అడ్డగోలుగా సంపాదించిన ఉదంతాలను చూసిన ఇతర జిల్లాల తహసీల్దార్లు విజయవాడ గ్రేటర్ పరిధిలోని పలు గ్రామీణ మండలాల నుంచి కదలటానికి ఇష్టపడటం లేదు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సందర్భంలో కీలకమైన అంశాల జోలికి వెళ్లకూడదు. ఉండేది స్వల్ప కాలమే కాబట్టి.. ఆ తర్వాత సొంత జిల్లాకు చెందిన వారు వస్తారు కాబట్టి ఎన్నికల కోడ్‌ను అమలు చేసే బాధ్యతలను చూడాలి. కానీ.. విజయవాడ గ్రేటర్ పరిధిలోని గ్రామీణ మండలాలకు ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు అడ్డగోలుగా వైసీపీ నేతలకు మట్టి, గ్రావెల్, ఇసుక తవ్వేసుకోమని అభయ హస్తం అందించారు.

ఎన్నికల కోడ్‌లోనూ అక్రమ క్వారీయింగ్‌కు అనుమతి

ఎన్నికల కోడ్‌లో కూడా అక్రమ క్వారీయింగ్ ఆగలేదు. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయం, ఆందోళన ఉన్న వైసీపీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో, నాయకుల కనుసన్నల్లో అడ్డగోలుగా అక్రమ క్వారీయింగ్‌కు రెవెన్యూ తహసీల్దార్లు సహకరించారు. ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లకుండా ఉండటానికి అర్ధరాత్రుళ్లు తవ్వుకోమని రెవెన్యూ తహసీల్దార్లే వైసీపీ నేతలకు సహకరించారు. కృష్ణా తీరప్రాంతం కలిగిన మండలాల్లో అనధికారికంగా ఇసుక తవ్వుకోటానికి అనుమతులు ఇచ్చారు. తవ్మలేరు, కట్టలేరులను కలిగిన మండలాల తహసీల్దార్లు అయితే వైసీపీ నేతల ఇసుక దోపిడీకి సహకరించారు. పోలవరం కాలువ సాగే మండలాల పరిధిలో అయితే కాలువగట్టు మట్టిని తవ్వుకోవటానికి సహకరించారు. గ్రావెల్ నిక్షేపాలు కలిగిన మామిడితోటల్లో కూడా 50 మీటర్ల భూగర్భంలోకి తవ్వుకునేందుకు మరీ సహకరించారు.

ప్రతి ఫైల్‌కు రేటు కట్టి వసూలు

కొంతమంది తహసీల్దార్లు ఆర్ఐలతో లాలూచీ పడి మ్యుటేషన్ల ఫైల్స్ గుట్టుచప్పుడు కాకుండా పరిష్కరిస్తున్నారు. కొందరు తహసీల్దార్లు ఇతర జిల్లాల నుంచి వచ్చిన కొద్దిరోజుల వరకు ఆర్ఐలు తీసుకువచ్చే ఫైల్స్‌పై సంతకాలు పెట్టకుండా వారిని, ప్రజలను ఇబ్బందులు పెట్టారు. ఇలా కొద్దిరోజులు వ్యవహరించిన తర్వాత మనసులో మాట చెప్పి ప్రతి ఫైల్‌కూ రేటు కట్టారు. దీంతో ఆర్ఐలకు తప్పటం లేదు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లే కాదు.. ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన పలువురు తహసీల్దార్లు కూడా ఆయా జిల్లాల్లోని మండలాలను వదిలి రావటానికి ఇష్టపడటం లేదు.

ఆయా మండలాల్లో కూడా ఇదే విధంగా మనవాళ్లు కూడా పైరవీలు ప్రారంభించారు. సొంత జిల్లాకు రావాల్సిన తహసీల్దార్లను స్థానికంగా యథాస్థాన మండలాలకు పోస్టింగ్‌లు ఇవ్వరు. కచ్చితంగా అంతర్గత బదిలీలు ఉంటాయి. కానీ పొరుగు జిల్లాలకు వెళ్లిన మన తహసీల్దార్లు కొందరు.. ఎన్నికల ముందు తాము ఎక్కడైతే పనిచేశామో తిరిగి అదే స్థానంలో పనిచేసేందుకు పైరవీలు ప్రారంభించటం విశేషం.

ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని అవినీతిని అరికట్టడానికి, ప్రజలకు మెరుగైన సేవలందించటం కోసం తక్షణం ఎన్నికల బదిలీలపై వెళ్లిన వారిని తిరిగి సొంత జిల్లాలకు కేటాయిస్తూ వారికి స్థానభ్రంశాలను కల్పించే అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

విమానాశ్రయ భూ నిర్వాసితులకు పరిహారం

● రెవెన్యూ, విమానాశ్రయ విస్తరణ, ఆర్ అండ్ బీ అధికారులకు కలెక్టర్ ఆదేశం

మచిలీపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో మంగళవారం జేసీ గీతాంజలిశర్మతో కలసి రెవెన్యూ, విమానాశ్రయ విస్తరణ, ఆర్ అండ్ బీ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. విమానాశ్రయ అభివృద్ధిలో భాగంగా దావాజీగూడెం, బుద్దవరం రైతులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద చినఅవుటపల్లిలో ఐదుసెంట్ల స్థలంతోపాటు రూ.9 లక్షలను పరిహారంగా కొంతమంది రైతులకు ఇప్పటికే ఇవ్వడం జరిగిందన్నారు. మరికొంతమందికి పరిహారం ఇవ్వాల్సి ఉందని త్వరితగతిన అందించాలని అధికారులను ఆదేశించారు. విమానాశ్రయ అభివృద్ధికి ప్రైవేట్ వెంచర్‌ల యజమానులు భూమిని ఇచ్చారని, వారికి అజ్జంపూడిలో భూమికి బదులుగా భూమి ఇచ్చేందుకు, లే అవుట్ అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ఏపీ సీఆర్‌డీఏ అధికారులకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. విమానాశ్రయం సమీపంలోని ఏలూరుకాల్వపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. విమానాశ్రయంలోని పరిస్థితులను పరిశీలన చేసేందుకు తాను త్వరలో వస్తానని కలెక్టర్ తెలిపారు. విమానాశ్రయం డైరెక్టర్ ఎంఎల్‌కె రెడ్డి, గుడివాడ ఆర్డీవో పి పద్మావతి, గన్నవరం తహసీల్దార్ ఎస్ఎస్ పవన్ కుమార్, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృష్ణా డీకే బాలాజీ

దసరా లక్ష్యంగా..!

(5వ పేజీ తరువాయి)

ఉన్నారు. ఐదంతస్థుల్లో కేశఖండనశాల నిర్మాణం చేపట్టాలన్నది అధికారుల ప్రతిపాదన.

● **కొండచరియలు జారిపడకుండా..**

అమ్మవారు కొలువుదీరిన ఇంద్రకీలాద్రి కొండ నుంచి రాళ్లు జారి పడటం తరచూ జరుగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని భక్తుల భద్రత కోసం భద్రతాచర్యలను దుర్గగుడి అధికారులు చేపట్టారు. బెంగళూరు నుంచి రాక్ ఫాల్ మిటిగేషన్ బృందాన్ని తీసుకొచ్చి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధ్యయనం చేసి వారి సూచనల మేరకు ఇప్పటికే రూ.4.25 కోట్ల వ్యయంతో భద్రతా పనులు పూర్తి చేశారు.

● **పార్కింగ్ సమస్య పరిష్కరించేందుకు..**

దుర్గగుడి చెంత భక్తులు తమ వాహనాలను ముఖ్యంగా కార్లను పార్కింగ్ చేసుకోవడం పెద్ద సమస్యగా మారింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని కనకదుర్గనగర్ ప్రవేశం చెంత మల్టీలెవల్ కార్ పార్కింగ్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను అధికారులు సిద్ధం చేశారు. సుమారు రూ.33 కోట్లతో తయారు చేసిన ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే 400 కార్ల పార్కింగ్‌ను అతి తక్కువ స్థలంలో పార్కు చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. ప్రస్తుతం ఈ విధానం జనసమ్మర్ధంగా ఉండే నగరాల్లో అమల్లో ఉంది.

● **దసరా నాటికి పూర్తి చేయడమే లక్ష్యం**

దుర్గగుడిలో పలు అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి సూచనలతో వీటిని అక్టోబరు నాటికి పూర్తి చేయాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం. దసరాలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించే లక్ష్యంతో పని చేస్తున్నాం.

- కేఎస్ రామారావు, దుర్గగుడి ఈవో

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	152, 161, 172
చికెన్ విత్ స్కిన్	296
చికెన్ స్కిన్‌లెస్	306

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.85

సీఎం చంద్రబాబుకు 'గొట్టిపాటి' అభినందనలు



పటమట, జూన్ 18 : రాష్ట్రంలో కూటమి విజయం సాధించిన సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది గొట్టిపాటి వెంకట రామకృష్ణప్రసాద్ మంగళవారం ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుంద ని, రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లే విధంగా భగవంతుడు చంద్రబాబుకు మరింత శక్తిని ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు.



పొట్టి శ్రీరాములు స్కూల్‌లో విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సీవీఆర్ మున్సిపల్ పాఠశాలలో కార్పొరేటర్ బాలస్వామి, కొమ్ము సీతారామయ్య పాఠశాలలో కార్పొరేటర్ చెన్నుపాటి కాంతిశ్రీ గాంధీ

ఏటా ఉపాధ్యాయుల నియామకాలు చేస్తాం

కృష్ణలంక పొట్టి శ్రీరాములు స్కూల్‌లో విద్యాకిట్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె

కృష్ణలంక, జూన్ 18: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత రాకుండా ఏటా ఉపాధ్యాయుల నియామకాలు చేస్తామని, నిరుద్యోగ కొరత తగ్గించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఏటా 5 లక్షల చొప్పున ఐదేళ్లలో 25 లక్షల ఉద్యోగాలను తమ ప్రభుత్వం భర్తీ చేస్తుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. మంగళవారం 21వ డివిజన్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యా కిట్లు (పుస్తకాలు, బ్యాగులు) పంపిణీ కార్యక్రమం జరిగింది. గద్దె రామ్మోహన్ హాజరై విద్యార్థులకు విద్యాకిట్లు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలన్నదే టీడీపీ లక్ష్యమని అన్నారు. చంద్రబాబు చదువును ప్రోత్సహించడానికి మధ్యాహ్న భోజనంతో పాటుగా భవనాల నిర్మాణానికి సైతం అధిక ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయించారన్నారు. 2024లో ముఖ్యమంత్రి అయిన తర్వాత మొదటి సంతకం మెగా డీఎస్సీ భర్తీపైనే చంద్రబాబు చేశారని చెప్పారు. ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో భర్తీ చేస్తారన్నారు. విద్యార్థులు కూడా చక్కగా చదువుకొని వారు మంచి పేరు తెచ్చుకోవడమే కాకుండా తల్లిదండ్రులకు, పాఠశాలలకు మంచి పేరు తేవాలని అన్నారు. జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ చూపే విధంగా విద్యార్థులు చదువుకోవాలని ఆయన కోరారు. ఎంఈవో రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని నగరానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, మాజీ కార్పొరేటర్ చందన సురేష్, నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, వేములపల్లి రంగారావు, కొర్రా అప్పన్న, కేశనం భావన్నారాయణ, పెరుమాళ్ల గురునాథం, ఆర్.రమాదేవి, దమ్మాలపాటి రంగారావు, జనసేన నాయకులు కొవ్వూరి కిరణ్, రాజు, బుజ్జెమ్మ పాల్గొన్నారు.

గవర్నర్‌పేట: పాఠశాలలు ప్రారంభం సందర్భంగా మంగళవారం 23వ డివిజన్ పరిధిలోని సీవీఆర్ మున్సిపల్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఉచిత కిట్స్ పంపిణీ జరిగింది. డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్, స్కూల్ బ్యాగ్, షూ, యూనిఫాం పంపిణీ చేశారు. స్కూల్ హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పటమట: 9వ డివిజన్‌లోని కొమ్ము సీతారామయ్య జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 9, పదో తరగతి విద్యార్థినులకు స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి కాంతిశ్రీ గాంధీ పుస్తకాలు పంపిణీ చేపట్టారు. ఉపాధ్యాయులు, 9వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో భోజనం

వన్‌టౌన్, జూన్ 18: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో రాత్రిపూట బసచేసే భక్తులకు అందజేస్తున్న అన్నప్రసాద వితరణను ఈవో కేఎస్ రామారావు మంగళవారం రాత్రి పరిశీలించారు. ప్రతి భక్తుడి వద్దకు వెళ్లి అన్నవితరణలో ఏమైనా లోపాలున్నాయా? నాణ్యతతో ఉందా? లేదా? అని ప్రశ్నలు అడిగి జవాబు రాబట్టారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన భోజనాన్ని దేవస్థానం అందిస్తోందని భక్తులకు వివరించారు. ఈవో రామారావు పిల్లలు, పెద్దలను కూడా పలకరించారు. వారంతా సంతృప్తి వ్యక్తం చేశారు.



అన్నప్రసాద సౌకర్యాన్ని పరిశీలించిన ఈవో రామారావు



ధర్మపథం వేదికపై భక్తిరంజని కార్యక్రమం

అన్నవితరణకు విరాళం

దుర్గగుడిలో నిర్వహించే అన్నవితరణకు విశాఖపట్నం శివాజీపాలెంకు చెందిన సాధనాల హిమవర్షిణీ ఆమె కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం దేవస్థానానికి విచ్చేసి రూ.లక్ష విరాళంగా అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.



విరాళం అందజేస్తున్న హిమవర్షిణి కుటుంబసభ్యులు

ధర్మపథం వేదికపై

దుర్గగుడిలోని ధర్మపథం వేదికపై మంగళవారం నెల్లూరుకు చెందిన గానం అకాడమి మల్లాది అనూష బృందం గానకచేరి నిర్వహించింది. వయోలిన్‌పై రాయప్రోలు సుబ్రహ్మణ్యం, మృదంగంపై రామాలయం ఈశ్వర్ సాయ్, కీబోర్డుపై సురభి సంగీత సౌరభ్‌లు సహకరించారు. పలు కీర్తనలకు చక్కనైన గానంతో భక్తులను అలరించారు.

చంద్రబాబు వ్యవస్థలను గాడిలో పెడతారు

ఎంపీ కేశినేని శివనాథ్



ఎంపీ కేశినేని శివనాథ్‌ను సత్కరించిన జిల్లా టీడీపీ లీగల్‌సెల్ నాయకులు

విద్యాధరపురం, జూన్ 18: సీఎం చంద్రబాబు నాయకత్వంలో పనిచేసే ప్రభుత్వంలో ప్రజావ్యతిరేక విధానాలు ఉండవని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. చంద్రబాబు సీఎం పగ్గాలు చేపట్టిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ సంతకం చేసిన సందర్భంగా జిల్లా టీడీపీ లీగల్ సెల్ నాయకులు మంగళవారం గురునానక్ నగర్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయనను కలిశారు. ఎన్నికల్లో అఖండ విజయం పొందినందుకు లీగల్ సెల్ నాయకులు ఆయనకు దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందచేసి అభినందించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చిన్ని మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాల కాలంలో ప్రజావ్యతిరేక విధానాలను అవలంబించిన జగన్‌రెడ్డి వ్యవస్థలను సర్వనాశనం చేశాడని వ్యాఖ్యానించారు. గాడి తప్పిన వ్యవస్థలను సక్రమ విధానాలలోకి చంద్రబాబు తీసుకువస్తారని, అప్పుడు ఏ పార్టీ ముఖ్యమంత్రి అధికారంలో ఉన్నా వాటి పని అవి చేసుకుంటూ పోతాయన్నారు.లీగల్ సెల్ అధ్యక్షుడు మోటేపల్లి సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు కొత్తపల్లి స్వరూప్ ఆనందర్, యెర్నేని వేదవ్యాస్, శాఖమూరి పూర్ణచంద్రరావు, చంచు శ్రీధరరావు, పోతురాజు శ్రీనివాసరావు కేఎస్ పరశురామ్ సింగ్, ముష్టి శ్రీకాంత్, దోనేపూడి సాంబశివరావు, చెన్నుపాటి ఉషారాణి, కొనకళ్ల మహాలక్ష్మి, కె శాంతి, జి అనిత, చంద్రకుమారి, బొర్రా భాను తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులతో ఎంపీ 'చిన్ని' మాటామంతీ

పటమట : విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్(చిన్ని) టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీతో కలిసి పటమటలంక ప్రాంతంలో మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికంగా అక్కడ ఉంటున్న వృద్ధులు, పెద్దలతో మాట్లాడుతూ నగరాభివృద్ధికి తగిన సలహాలు ఇవ్వాలని ఎంపీ చిన్ని వారిని కోరారు.

లారీ ఢీకొని బీటెక్ విద్యార్థి మృతి

చిట్టినగర్, జూన్ 18: రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ప్రకాష్‌నగర్‌లో కాపు హర్షవర్ధన్(19) కుటుంబంతో కలిసి ఉంటాడు. నందిగామ మిక్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ప్రతి రోజు కళాశాలకు స్కూటీపై వెళ్లి వస్తుంటాడు. హర్షవర్ధన్ మంగళవారం మధ్యాహ్నం కళాశాల ముగిసిన తరువాత ప్రకాష్ నగర్ ఇంటికి స్కూటీపై బయలు దేరాడు. పాలఫ్యాక్టరీ చనమోలు వెంకట్రావ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి డౌన్‌లో గ్యాస్ బంకు వద్దకు రాగానే కబేళా వైపు నుంచి వస్తున్న లారీ స్కూటీని వెనుక నుంచి ఢీ కొట్టడంతో విద్యార్థి లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకొని మృతదేహన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.













మొక్కు తీర్చుకున్న రాణిగారితోట టీడీపీ నేతలు

మొక్కు తీర్చుకున్న రాణిగారితోట టీడీపీ నేతలు

రాణిగారితోట, జూన్ 18: టీడీపీ విజయం సాధించడంతో పాటు చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హ్యాట్రిక్ విజయం సాధించడం, కేశినేని శివనాథ్ విజయం సాధించడంతో రాణిగారితోట టీడీపీ నేతలు మొక్కులు తీర్చుకున్నారు. రాణిగారితోట 17,18 డివిజన్ నేతలు తమిళనాడు రాష్ట్రం నాగపట్నంలో వెలంగణి మేరీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వేముల దుర్గారావు, రాయి రంగమ్మ, మహేష్, కుమారి, సునాబి, గురవయ్య, లక్ష్మీ, గంగాధర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కాలిఫోర్నియాలో ప్రవాసాంధ్రుల సంబరాలు

విద్యాధరపురం, జూన్ 18: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన సందర్భంగా అమెరికాలోని కాలిఫోర్నియాలో ప్రవాసాంధ్రులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కార్ల ర్యాలీ నిర్వహించి కేక్‌కట్ చేశారు. టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న 14వ డివిజన్ టీడీపీ శ్రేణులు

పనితీరుతో ప్రజలకు దగ్గరవ్వండి

● 14వ డివిజన్ టీడీపీ శ్రేణులు

పటమట, జూన్ 18 : సచివాలయ సిబ్బంది మెరుగైన పనితీరుతో ప్రజలకు దగ్గరవ్వాలని 14వ డివిజన్ టీడీపీ నాయకులు సచివాలయ సిబ్బందిని కోరారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలోని ఐదు సచివాలయాలను సందర్శించి సూపర్ సిక్స్ పథకాలు, పెన్షన్లు, పారిశుధ్యం గురించి వారితో మాట్లాడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. 14వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు నర్రా కిషోర్, డివిజన్ ఇన్‌ఛార్జి గరికిపాటి బద్రి, డివిజన్ ప్రధాన కార్యదర్శి రాధారపు యల్లబాబులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు రాజీనామా చేయాలి

ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్

● తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన



వన్‌టౌన్, జూన్ 18: వైసీపీ ప్రభుత్వంలో నియామకమైన ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు రాజీనామా చేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్ డిమాండ్ చేశారు. తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్టీ కమిషన్ కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ఎస్టీ కమిషన్ చైర్మన్, కమిషన్ సభ్యులు గిరిజనులకు ఏమాత్రం మేలు చేయలేదన్నారు. వారంతావెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రవీంద్రనాయక్, విష్ణునాయక్, రఘునాథ్ నాయక్, మల్లేశ్, గంగరాజు,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

విద్యాధరపురం, జూన్ 18: భవానీపురం ఫ్లైఓవర్ సమీపంలో జాతీయ రహదారిపై బైక్ ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం రాత్రి జరిగింది. కొండపల్లికి చెందిన కే.రాంబాబు(63) భవానీపురంలోని ఓ టైల్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతను సోమవారం విధులు ముగించుకుని రాత్రి 8 గంటలకు ఇంటికి వెళ్లడానికి నడుచుకుంటూ భవానీపురం ఫ్లైఓవర్ సమీపంలో జాతీయ రహదారి దాటుతుండగా అతివేగంగా వచ్చిన ఓ బైక్ రాంబాబును ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాంబాబును స్థానికులు చికిత్స నిమిత్తం మొదట కస్తూరీబాయి పేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్ళగా అక్కడి వైద్యులు పరిశీలించి మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

వెలగని వీధిలైటు



ఎస్‌బీఐ కాలనీ రోడ్ నెంబర్ 5లో మూడు నెలల నుంచి వీధి లైటు వెలగడం లేదని ఆ ప్రాంతానికి చెందిన ఓ పాఠకుడు ఆంధ్రజ్యోతి దృష్టికి తెచ్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వన్‌టౌన్, జూన్ 18: 33/11 కేవీ ఓల్డ్ పవర్ హౌస్ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ కేసీ కెనాల్ ఫీడర్ లైన్‌ల మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విజయవాడ టౌన్ ఏపీసీపీడీసీఎల్ ఈఈ బి.వి సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెనాల్ రోడ్, బ్రాహ్మణ వీధి, కన్యకా పరమేశ్వరి సత్రం, అయ్యప్ప టవర్, జమ్మి దొడ్డి, శేషయ్య స్ట్రీట్, ఆకుల వారి వీధి, అవుల వారి వీధి, ఉప్పర వాగు, పూజారి వారి స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

గవర్నర్‌పేట: డోర్నకల్ రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలరెడ్డి రోడ్డు, ప్రకాశంరోడ్డు, నక్కల రోడ్డు, సూర్యారావుపేటలోని పలు వీధుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.



ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 19 జూన్ 2024
cinema@andhrajyothy.com

ఆ ప్రశ్నలకు సమాధానం కల్కి



ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న భారీ సైన్స్ ఫిక్షన్ ఎపిక్ 'కల్కి 2898 ఏడీ' ఈ నెల 27న విడుదల కానుంది. వైజయంతీ మూవీస్ సంస్థ అధినేత అశ్వనీదత్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ విజువల్ వండర్ రోజురోజుకీ అంచనాలు పెంచుతోంది. ప్రమోషన్స్‌లో భాగంగా 'ఎపిక్ జర్నీ వన్.. ది ప్రిల్యూడ్ ఆఫ్ కల్కి 2898 ఏడీ' ని మంగళవారం విడుదల చేశారు. ఈ వీడియోలో దర్శకుడు నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'కలియుగంలో ఏం జరుగుతుంది, ఏం జరగవచ్చు.. ఇలాంటి ప్రశ్నలకు 'కల్కి' క్లైమాక్స్ సమాధానం. కేవలం ఇండియాలోనే కాదు ప్రపంచంలో ఉన్న వారందరికీ సంబంధించిన కథ ఇది. నాకు చిన్నప్పటి నుంచి పౌరాణిక చిత్రాలు అంటే ఇష్టం. అలాగే హాలీవుడ్‌లో వచ్చిన 'స్టార్ వార్స్' వంటి సినిమాలు కూడా నన్ను ఆకట్టుకున్నాయి. అయితే ఇలాంటి సినిమాలను అక్కడే తీయాలా, మనం తీయలేమా అనిపించేది. మహాభారతంలో ఎన్నో గొప్ప పాత్రలు ఉన్నాయి. కృష్ణ నిర్యాణంతో కలియుగం ప్రారంభమైనప్పుడు ఏం జరుగుతుంది అనే సృజనాత్మక ఊహతో రాసుకున్న కథ ఇది. మనం చదివిన పురాణాలు, ఎపిక్స్.. అన్నింటికీ ఈ సినిమా క్లైమాక్స్‌లా ఉంటుంది. ఒక యుగంలో రావణుడు, మరో యుగంలో దుర్యోధనుడు.. ఇలా అన్నింటిలోంచి ఓ రూపం తీసుకుని దాంతో పోరాటం ఎలా ఉంటుందన్న ఐడియాతో 'కల్కి' కథ రాయడానికి ఐదేళ్లు పట్టింది. సరికొత్తగా రూపుదిద్దుకున్న ఈ సైన్స్ ఫిక్షన్ మైథాలజీని చూసి ప్రేక్షకులు ఎలా స్పందిస్తారా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నా' అన్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటాని, రాజేంద్రప్రసాద్ తదితరులు ఈ చిత్రంలో నటించారు.



గిలాసే ఎత్తేస్తే కులాసే

ప్రియదర్శి, నభా నటేష్ జంటగా నటిస్తున్న చిత్రం 'డార్లింగ్'. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా హిట్‌ను అందుకున్న కె. నిరంజన్‌రెడ్డి నిర్మిస్తున్నారు. అశ్విన్ రామ్ దర్శకుడు. ఇటీవలే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు చక్కటి ఆదరణ దక్కింది. ఇప్పుడు ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్‌ను యూనిట్ ప్రారంభించింది. 'డార్లింగ్' నుంచి తొలి గీతం 'ఖలాసే ఖలాసే మామా నా బతుకే ఖలాసే... గిలాసే ఎత్తేస్తే కులాసే'ను మంగళవారం విడుదల చేసింది. సామాన్యుడి బాధలను ఏకరువు పెడుతూ సాగే ఈ గీతానికి కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, వివేక్ సాగర్ స్వరాలు సమకూర్చారు. హనుమాన్ సీహెచ్, రామ్ మిరియాల ఆలపించారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణ తేజ్, అనన్య నాగళ్ల కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నరేశ్ రామదురై, ఎడిటర్: ప్రదీప్ ఇ రాఘవ్,

ప్రియురాలిని పెళ్లాడుతున్న సిద్ధార్థ్ మాల్యా



వ్యాపారవేత్త విజయ్ మాల్యా తనయుడు, నటుడు సిద్ధార్థ్ మాల్యా పెళ్లి పీటలు ఎక్కనున్నారు. తన ప్రియురాలు జాస్మిన్‌ను సిద్ధార్థ్ లండన్‌లో బంధుమిత్రుల సమక్షంలో పెళ్లాడనున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఖాతాలో వారిద్దరూ కలసి తెల్లకోటు, తెల్ల గౌను వేసుకుని పెళ్లి దుస్తుల్లో ముస్తాబైన ఓ ఫొటోను పోస్ట్ చేసి "పెళ్లికి సమయం ఆసన్నమైంది. వేడుకలు మొదలయ్యాయి" అని ఆయన పేర్కొన్నారు. జాస్మిన్‌కు గతేడాది నవంబరులో తన ప్రేమను వ్యక్తపరిచిన సందర్భాన్ని.. ఇద్దరూ కలసి నిశ్చితార్థపు ఉంగరాన్ని ధరించిన ఫొటోలను సిద్ధార్థ్ మాల్యా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. దీంతో వీరిద్దరి ప్రేమాయణం గురించి అందరికీ తెలిసింది.



థాయ్‌లాండ్ వెళుతున్న దేవర

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దేవర' మీదే ప్రస్తుతం అందరి దృష్టీ ఉంది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత వస్తున్న తారక్ సినిమా కావడంతో ప్రేక్షకులు, అభిమానులు ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అతిలోకసుందరి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ నటిస్తున్న తొలి తెలుగు చిత్రం ఇదే కావడం మరో ముఖ్య కారణం. దర్శకుడు కొరటాల శివ ఓ అద్భుత చిత్రంగా 'దేవర'ను తీర్చిదిద్దుతున్నారు. ఇటీవలే గోవాలో ఎన్టీఆర్, సైఫ్ అలీఖాన్ మీద ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించారు. గోవాలో భారీ వర్షం కురుస్తున్నా వెనుకడుగు వేయకుండా, రాజీ పడకుండా ఈ ఫైట్ చిత్రీకరించడం గమనార్హం. త్వరలో థాయ్‌లాండ్‌లో ఎన్టీఆర్, జాన్వీ కపూర్ మీద ఓ మెలోడియస్ సాంగ్‌ను చిత్రీకరించడానికి ప్లాన్ చేస్తున్నారు. యువసుధ ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న 'దేవర' చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది.

కొత్తదనంతో నిండిన చిత్రం



'హ్యాపీడేస్', 'కొత్త బంగారులోకం'తో లవర్ బాయ్, పక్కింటి కుర్రాడి ఇమేజ్ సొంతం చేసుకున్నారు వరుణ్ సందేశ్. తనకున్న ఆ ఇమేజ్‌కి భిన్నంగా ఆయన పూర్తి సీరియస్ రోల్‌లో నటించిన చిత్రం 'నింద'. 'కాండ్రకోట మిస్టరీ' అనేది ఉప శీర్షిక. రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

"నేనిప్పటివరకూ ఇటువంటి పాత్రను చేయలేదు. నిజజీవితంలో ఎంతో చలాకీగా, నవ్వుతూ కనిపించే నేను.. ఇందులో చాలా సీరియస్‌గా ఉంటాను. ఒక నటుడిగా నన్ను కొత్తగా ఆవిష్కరించిన చిత్రమిది. రొటీన్‌కు భిన్నంగా సినిమాలు చేద్దామనుకొంటున్న సమయంలో ఈ కథ విన్నా. చాలా నచ్చింది. కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా 'నింద' సినిమా కథను చాలా పకడ్బందీగా రాసుకున్నారు డైరెక్టర్ రాజేశ్ జగన్నాథం. సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్‌లలో చాలా కథలు వచ్చాయి. కానీ వాటన్నికంటే పూర్తి భిన్నంగా ఈ సినిమా ఉంటుంది. కొత్తదనంతో నిండిన ఈ చిత్రంలో స్ర్కీన్‌ప్లే చాలా గ్రిప్పింగ్‌గా ఉంటుంది. తరువాతి సన్నివేశంలో ఏం జరుగుతుందనేది ఎవరూ ఊహించలేరు" అని చెప్పారు.



మొదట్నుంచే అలా చేసి ఉండాల్సింది

కృతిశెట్టి

తొలి చిత్రంతోనే ఇండస్ట్రీ బ్లాక్‌బస్టర్‌లు అందుకున్న నటీనటులు ఆ తర్వాత కెరీర్ రేస్‌లో వెనుకబడడం తెలిసిందే. ఇప్పుడు హీరోయిన్ కృతిశెట్టి కూడా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు. తన తొలి చిత్రం 'ఉప్పెన'తోనే అటు ఇండస్ట్రీ, ఇటు తెలుగు ప్రేక్షకులను తన అందం, అభినయంతో ఆమె ఆకట్టుకున్నారు. తెలుగులో అగ్రకథానాయికగా కొనసాగగల సత్తా కృతి సొంతం అని అంతా అనుకున్నారు. కానీ ఆ తర్వాత ఆమెకు అవకాశాలు ధాటిగానే వచ్చినా, 'ఉప్పెన' స్థాయిలో మరో బ్రహ్మాండమైన విజయం మాత్రం అందుకోలేక పోయారు. ఇటీవలే శర్వానంద్‌కు జంటగా నటించిన 'మనమే' చిత్రం సైతం ఆమెకు మరోసారి నిరాశనే మిగిల్చింది. అయితే వరుస వైఫల్యాలతోనే తెలుగులో హీరోయిన్‌గా కృతి అవకాశాలు సన్నగిల్లుతున్నాయనే వాదనను ఆమె కొట్టిపారేశారు. తమిళ, మలయాళ చిత్రాలతో బిజీగా ఉండడం వల్లే ఎక్కువ సంఖ్యలో తెలుగు సినిమాలు చేయలేకపోతున్నానని కృతి చెప్పారు. దాంతో పాటు కథల ఎంపికలో ఆచితూచి వ్యవహరించడం కూడా ఓ కారణమన్నారు. తెలుగులో మంచి కథలు కుదిరినప్పుడే సినిమా చేయాలనుకుంటున్నాననీ, అసలు మొదట్నుంచే కథల ఎంపికలో జాగ్రత్తగా ఉండాల్సిందని వాపోయారు. 'ఇప్పుడిప్పుడే మన చుట్టూ ఉండే మనుషులు, ప్రపంచం గురించి తెలుసుకుంటున్నాను, గతంలో జరిగిన పొరపాట్లను గుణపాఠాలుగా భావిస్తాను. వైఫల్యాల నుంచి నేర్చుకొని ఇకపై మంచి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడానికి ప్రయత్నిస్తాను' అని కృతి అన్నారు.

కొత్త కలయిక కుదిరిందా?



'ఫైటర్' చిత్రంతో తనదైన యాక్షన్‌తో అభిమానులను ఎంటర్‌టైన్ చేశారు బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్. ప్రస్తుతం ఆయన 'వార్ 2' చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. సెప్టెంబర్ కల్లా 'వార్ 2'లో తన పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తి చేసి, కొత్త సినిమాపై దృష్టి సారించాలని ఆయన భావిస్తున్నారు. ఇప్పటికే పలువురు దర్శకులు హృతిక్‌ను కలసి కథలు వినిపిస్తున్నారు. అయితే ఆయన మాత్రం కబీర్ ఖాన్ చెప్పిన కథపై ఆసక్తి చూపినట్లు బాలీవుడ్ సర్కిల్లో వినిపిస్తోంది. విచిత్ర జీవుల నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుందట. 'చందు ఛాంపియన్' చిత్రం విడుదలవ్వడంతో కబీర్‌ఖాన్ కూడా హృతిక్‌తో సినిమాపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టనున్నారు. ప్రస్తుతానికి కథా చర్చలు జరుగుతున్నాయి. తనకు కొత్త తరహా కథాంశం కావడంతో హృతిక్ కూడా ఆసక్తి చూపడంతో ఈ కాంబినేషన్ సెట్టయ్యే అవకాశాలే ఎక్కువనేది బాలీవుడ్ టాక్. అన్ని అనుకూలిస్తే కొత్త ఏడాదిలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది.


త్వరలోనే మీ ముందుకొస్తా

అల్కా యాగ్నిక్



ప్రఖ్యాత గాయని, జాతీయ అవార్డు గ్రహీత అల్కా యాగ్నిక్ ఓ అరుదైన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారు. దీని గురించి ఆమె వివరణ ఇస్తూ "కొన్నాళ్లుగా నువ్వు కనిపించడం లేదు ఎందుకని మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు అడుగుతున్నారు. ఈ గ్యాప్‌కు కారణం.. నేను ఓ అరుదైన వినికిడి సమస్యతో బాధపడుతున్నాను. చెవికి సోకిన ఓ వైరస్ వల్ల ఏర్పడిన ఈ వినికిడి సమస్యను చికిత్సతో నయం చేయవచ్చనే భరోసాను డాక్టర్లు ఇచ్చారు. మీరు కూడా చింతించొద్దు.. ఆందోళన చెందవద్దు. త్వరలోనే నా వినికిడి శక్తిని తిరిగి పొంది.. మీ ముందుకు ఫుల్ జోష్‌తో వస్తాను. మీరు కూడా వీలైతే పెద్ద శబ్దాల నుంచి దూరంగా ఉండండి. హెడ్‌సెట్ ధరించి ఎక్కువ సౌండ్‌తో పాటలు వినడం తగ్గించండి" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు.

ఆకాశం అంచుల్లోకి విజేత ప్రయాణం



అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తున్న బాలీవుడ్ చిత్రం 'సర్ఫిరా'. తమిళ చిత్రం 'సూరారై పొట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా')కు ఇది రీమేక్. మాతృకకు దర్శకత్వం వహించిన సుధా కొంగర రీమేక్‌ను కూడా తెరకెక్కిస్తున్నారు. జూలై 12న ఈ చిత్రం విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం 'సర్ఫిరా' ట్రైలర్‌ను విడుదల చేసింది. వైమానికదళ పైలెట్‌గా, ప్రేమికుడిగా, పేద ప్రజల విమాన ప్రయాణం కల సాకారమవ్వాలని తపించే వ్యక్తిగా విభిన్న కోణాల్లో అక్షయ్ నటన అలరించింది. ఒరిజినల్‌లో హీరోగా నటించిన సూర్య ఈ రీమేక్‌లో అతిథి పాత్రను పోషించడం విశేషం. అక్షయ్‌కు జోడీగా రాధికా మదన్ నటించారు. పరేశ్ రావల్, సీమా బిశ్వాస్ కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. టు డీ ఎంటర్టైన్‌మెంట్, కేప్ ఆఫ్ గుడ్ ఫిలిమ్స్, అబండెన్షియా ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.



టైటిల్ లోగో ఆవిష్కరించిన తేజ

దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రం టైటిల్ లోగోని దర్శకుడు తేజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమాకైనా ప్రేక్షకుల్ని ఆకర్షించేది, వారిని థియేటర్ దగ్గరకు నడిచేలా చేసేది టైటిల్ మాత్రమే. 'పోలీస్ వారి హెచ్చరిక' శక్తిమంతమైన మాస్ టైటిల్. నిర్మాతకు విజయం చేకూరాలి' అన్నారు. 'రెండు తెలుగు రాష్ట్రాల్లో షూటింగ్ పూర్తి చేశామనీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందనీ నిర్మాత బెల్లి జనార్ధన్, దర్శకుడు బాబ్జీ చెప్పారు. సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, శుభలేఖ సుధాకర్, షియాజీ షిండే, హిమజ, జయవాహినీ, తులసి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: గజ్వేల్ వేణు, ఫొటోగ్రఫీ: నళినీకాంత్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.పి. సుబ్బారాయుడు.

ఆందోళన తగ్గాలంటే..

చాలా మందికి ఆందోళన ఒక పెద్ద సమస్య. దీనికి కారణాలు అనేకం. అందుకే కారణాలు వెతకకుండా ఆందోళనను తగ్గించుకొనే మార్గాలను అన్వేషించమని మానసిక నిపుణులు సలహా ఇస్తూ ఉంటారు. అలాంటి కొన్ని మార్గాలేమిటో చూద్దాం..

మైండ్‌ఫుల్‌నెస్

ధ్యానం, శ్వాసను నియంత్రించే వ్యాయామాలు, అంతర్ముఖులు కావటానికి చేసే ప్రయత్నాల వల్ల ఆందోళన కొంత తగ్గుతుంది. గతంలో జరిగిన విషయాలు మళ్లీ జరుగుతాయేమోననే ఆందోళన లేదా భవిష్యత్తులో ఏదైనా జరుగుతుందేమోననే భయం తగ్గాలంటే- వర్తమానంపై దృష్టిని కేంద్రీకరించాలి. వర్తమాన సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో ఆలోచించాలి. అప్పుడే ఆందోళన తగ్గుతుంది.

వ్యాయామం..

శారీరక వ్యాయామం వల్ల శరీరానికి మాత్రమే కాదు. మెదడుకు కూడా ఎంతో ఉపయోగం ఉంటుంది. వ్యాయామం చేసినప్పుడు శరీరంలో ఎండోమార్ఫిన్స్ విడుదల అవుతాయి. ఇవి శరీరంలో సహజంగా ఉండే ఒత్తిడిని తగ్గిస్తాయి. ప్రతి రోజు కనీసం అరగంట పాటు వ్యాయామం చేయటం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది.

రొటీన్ అవసరం



ఒక రొటీన్‌ను ఏర్పాటు చేసుకోవటం వల్ల అనవసరపు ఆందోళనను తగ్గుతాయి. సక్రమంగా పని చేయగలమనే విశ్వాసం పెరుగుతుంది.

సామాజిక సంబంధాలు

స్నేహితులు, బంధువులతో ఎక్కువ సమయం పెరగటం వల్ల మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ఆందోళనలు తగ్గిపోతాయి. ఇతరులతో మన ఆందోళనలను పంచుకోవటం వల్ల - మనసు తేలికపడుతుంది. కొన్ని సార్లు సమస్యలకు సమాధానాలు కూడా లభించే అవకాశముంది.

ఆరోగ్యకరమైన జీవనం

తగినంత నిద్ర, పౌష్టికాహారం, విశ్రాంతి కోసం తగినంత సమయాన్ని కేటాయించటం ఇవన్నీ చాలా ముఖ్యమైన విషయాలు. వీటి వల్ల ఆరోగ్యకరమైన జీవనం అలవాటు అవుతుంది. దీని వల్ల ఆందోళన తగ్గుతుంది.

విన్నర్



సినీ తారగా ప్రపంచానికి పరిచయమైనా... ఆమె పేరు ఎంటర్‌టైన్‌మెంట్ వార్తలకే పరిమితమవ్వలేదు. తరచూ వివాదాలు... బెదిరింపులు... కోర్టు కేసులు... అయినా మనసులో ఉన్నది ఉన్నట్టు మాట్లాడటానికి ఎన్నడూ జంకలేదు. వెండితెరపై వెలిగిన కథానాయిక కంగనా రనౌత్... నేడు ఎన్నికల్లో నెగ్గి జననాయిక అయ్యారు. ఎంపీగా సరికొత్త అధ్యాయానికి నాంది పలుకుతున్న 37 ఏళ్ల ఈ బాలీవుడ్ స్టార్ విజయం వెనుక ఎన్నో పోరాటాలు ఉన్నాయి.

కంగన... వివాదాలకు.. విజయాలకు కేరాఫ్

నలభైకి పైగా చిత్రాలు... వేటికవే ప్రత్యేకమైన పాత్రలు... బాలీవుడ్‌లో బంధు ప్రీతిని ప్రశ్నించి... అదే పరిశ్రమలో నిలదొక్కుకోగలిగిన తార కంగనా రనౌత్. పదిహేడేళ్లకు పైబడిన కెరీర్‌లో ఆమె ఎదుర్కొన్న ఎత్తుపల్లాలు, ఒడుదొడుకులు ఎన్నో. హిమాచల్‌ప్రదేశ్ మండి జిల్లాలోని భంబ్లా అనే చిన్న పట్టణంలో పుట్టిన ఆమెది భిన్నమైన నేపథ్యం. ఒకరిపై ఆధారపడకూడదన్న తత్వం. అందుకే పదహారేళ్లకే ఇల్లు వదిలి ఢిల్లీ వెళ్లారు. అది మొదలు ఎన్నో కష్టాలు పడ్డారు. తమ మాట కాదన్నందుకు తల్లితండ్రులు ఆమెకు ఎలాంటి సాయం చేయకూడదని నిర్ణయించుకున్నారు. అయినా కంగన ఆత్మవిశ్వాసంతో ఒంటరిగానే పోరాడారు. మోడలింగ్‌తో ప్రారంభించి... అటు నుంచి ముంబయికి మారి... పదిహేడేళ్లకే 'గ్యాంగ్‌స్టర్'తో నటిగా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు. అద్భుతమైన నటనతో జాతీయ చలనచిత్ర అవార్డులతో పాటు ఫిలిమ్‌ఫేర్ పురస్కారాలు కూడా అందుకున్నారు. ఆమెలోని కళాకారిణిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' ఇచ్చి సత్కరించింది. ఏ రంగంలో ఉన్నా... వేదిక ఏదైనా కుండ బద్దలు కొట్టినట్టు మాట్లాడడం ఆమె నైజం. అదే ఆమెను ఎన్నో వివాదాలు, కోర్టు కేసుల్లోకి లాగింది.

పీఓకేతో పోల్చి...

హీరో హృతిక్ రోషన్‌పై కంగనా బహిరంగ వ్యాఖ్యల గురించి మాట్లాడేందుకు ప్రముఖ గీత రచయిత జావేద్ అక్తర్ ఆమెను తన ఇంటికి పిలిచారు. కొన్నేళ్ల తరువాత ఓ ఇంటర్వ్యూలో కంగన ఆ విషయంపై మాట్లాడుతూ... నాడు జావేద్ తనను బెదిరించారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ కంగనపై జావేద్ పరువు నష్టం దావా వేశారు. కోర్టులో ఆ కేసు ఇప్పటికీ నడుస్తోంది. తన ముంబయి కార్యాలయాన్ని కూలగొట్టిన ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని నాటి 'మహా వికాస్ అఘాడీ' ప్రభుత్వాన్ని... పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పోల్చి పెద్ద దుమారమే రేపారు కంగన. ఇది కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వాల మధ్య మాట యుద్ధానికి దారి తీసింది. ఫలితంగా కంగనాకు వై-ప్లస్ గ్రేడ్ భద్రతను కేంద్ర హోంశాఖ సమకూర్చాల్సి వచ్చింది.

> ' కెరీర్ ఆరంభంలో నా పట్ల కొందరు చాలా దారుణంగా వ్యవహరించారు. హీరోయిన్ ఎప్పుడూ నిర్మాత మీదో లేక హీరో మీదో ఆధారపడాల్సిందే. ఆడపిల్ల కనుక ఏమీ చేయలేదనేది వాళ్ల ధీమా' అంటూ హిందీ చిత్ర పరిశ్రమలోని లోపాలను ఎత్తి చూపారు.

మాధ్యమం మార్చి...

ఆ మరుసటి ఏడాది (2021) పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల అనంతరం జరిగిన హింసపై ట్విటర్ (ఎక్స్)లో కంగన ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆమె ట్విటర్ ఖాతా నిషేధానికి గురైంది. అంతటితో ఆగని ఆమె... ఇన్‌స్టాలో తన అభిప్రాయాల్ని పంచుకోవడం మొదలుపెట్టారు. నటనలో నాలుగుసార్లు జాతీయ అవార్డులు దక్కించుకున్న ఈ బాలీవుడ్ తార... సగటు బాలీవుడ్ హీరోయిన్లకు పూర్తి భిన్నం. నచ్చింది చేయడం, నచ్చనిదాని గురించి నిర్మొహమాటంగా చెప్పడం ఆమెకు చిన్నప్పటి నుంచీ అలవాటు. సెలబ్రిటీ చాట్ షో 'కాఫీ విత్ కరణ్'లో 'బాలీవుడ్‌లో బంధుప్రీతికి నువ్వు పతాకధారివి' అంటూ కరణ్ జోహార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు కంగన. ఆ వ్యాఖ్యలు కరణ్‌తో పాటు హిందీ చిత్ర పరిశ్రమను కూడా దిగ్భ్రాంతికి గురి చేశాయి. స్టార్ కిడ్స్‌వల్ల బయటివారు అవకాశాలు పొందలేకపోతున్నారనేది కంగన వాదన. తరువాత కరణ్, కంగన మధ్య వివాదం పతాక స్థాయికి వెళ్లింది. 2020లో హీరో సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ మరణంపై కూడా రనౌత్ స్పందించారు. అదీ పలు వివాదాలకు కారణమైంది. అప్పటికే 'క్రిష్3, కైట్స్' సహనటుడు హృతిక్ రోషన్‌తో గొడవ ఒక పక్క నడుస్తోంది. తనతో ఉన్న అనుబంధాన్ని హృతిక్ ఒప్పుకోవడంలేదంటూ నాడు ఆమె రచ్చకెక్కారు. అయితే మా ఇద్దరి మధ్య ఎలాంటి వ్యక్తిగత సంబంధాలూ లేవని కంగన వ్యాఖ్యలను నాడు హృతిక్ తిప్పికొట్టారు.



'ఈ గడ్డ బిడ్డ'...

కంగనతో పాటు ఈసారి ఎన్నికల్లో 'రామాయణ్' స్టార్ అరుణ్ గోవిల్, హేమమాలిని, శత్రుఘన్ సిన్హా తదితర సినీ తారలు కూడా పోటీపడ్డారు. బీజేపీ తరుఫున పోటీ చేసిన అరుణ్ గోవిల్ (మీరట్), హేమమాలిని (మధుర) నుంచి, టీఎంసీ అభ్యర్థిగా శత్రుఘన్ సిన్హా (అసాన్‌సోల్) నుంచి గెలుపొందారు. అయితే వీరందరిలో కంగన పేరే దేశ వ్యాప్తంగా వినిపించింది. 'మండీ' నియోజకవర్గం పేరును, కంగన సినీ నేపథ్యాన్ని ఉద్దేశించి ప్రత్యర్థులను చేసిన అనుచిత వ్యాఖ్యలు ఆమెకు సానుభూతిని తెచ్చి పెట్టాయి. 'ఈ గడ్డ బిడ్డను' అంటూ ఆమె చేసిన ప్రచారం ప్రజలకు బాగా చేరింది. ఎంపీగా తొలిసారి పార్లమెంట్‌లోకి అడుగు పెడుతున్న కంగన... 'నా మీద ప్రేమానురాగాలు కురిపించి, నాపై నమ్మకం ఉంచిన మండీ ప్రజలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఇది మీ అందరి విజయం. మండీకి దక్కిన గౌరవం' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఎంపీ అయిన తరువాత కూడా మరో వివాదానికి కేంద్రం అయ్యారు కంగన. చండీగఢ్ విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్ ఆమెను చెంప దెబ్బ కొట్టారు. గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాలను నిరసిస్తూ, ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేపట్టిన రైతులను అగౌరవపరిచేలా కంగన వ్యాఖ్యలు చేసినందుకే తానీ పని చేసినట్టు కౌర్ తెలిపారు. కుల్విందర్ కౌర్ చర్యలను కొందరు సమర్థించారు. దీనిపై కంగన 'ఎక్స్' వేదికగా... 'అనుమతి లేకుండా ఒక వ్యక్తి శరీరాన్ని తాకడం, వారిపై దాడి చేయడం వంటి ఘటనలు మీరు సమర్థిస్తే... హత్యలు, అత్యాచారాలు జరిగినా మీకేం పర్వాలేదనే అర్థం. మీలాంటివారు మీ మానసిక స్థితిపై మరింత దృష్టి పెట్టాలి. యోగా, ధ్యానం చేయండి' అంటూ స్పందించారు.

సొంత చిత్రానికీ...

స్త్రీవాదాన్ని బలంగా వినిపించే కంగన... తనకు తానుగా పరిశ్రమలో ఎలా ఎదిగిందీ ఓ సందర్భంలో చెప్పుకొచ్చారు. 'కెరీర్ ఆరంభంలో నా పట్ల కొందరు చాలా దారుణంగా వ్యవహరించారు. హీరోయిన్ ఎప్పుడూ నిర్మాత మీదో లేక హీరో మీదో ఆధారపడాల్సిందే. ఆడపిల్ల కనుక ఏమీ చేయలేదనేది వాళ్ల ధీమా' అంటూ పరిశ్రమలోని లోపాలను ఎత్తి చూపారు. 'కంగన ఎక్కడుంటే అక్కడ వివాదం ఉంటుంది' అనేది హిందీ పరిశ్రమలో టాక్. దానికి తగ్గట్టుగానే తను సొంతంగా నిర్మించిన 'మణికర్ణిక' చిత్రం నిర్మాణ సమయంలో దర్శకుడు క్రిష్ జాగర్లమూడితో వివాదం రేగింది. అదే తరహాలో 'సిమ్రాన్' సినిమా విషయంలోనూ రచయిత అపూర్వ అస్రానీతో పొసగలేదు. దాంతో ఆయన మధ్యలోనే సినిమా వదిలి వెళ్లిపోయారు. దక్షిణాదిలో కూడా పలు చిత్రాల్లో నటించిన కంగన చివరగా 'తేజస్'లో కనిపించారు. ఆ తరువాత రాజకీయాల్లో బిజీ అయిపోయారు.

ప్రజా క్షేత్రంలోకి...

మీడియా, సామాజిక మాధ్యమాల్లో నిత్యం తన అభిప్రాయాలు, ఆలోచనలను పంచుకొనే కంగన... రాజకీయంగా మొదటి నుంచీ బీజేపీని అభిమానిస్తూ వస్తున్నారు. దానికి కారణం ప్రధాని మోదీ నాయకత్వం అంటారామె. అందులో భాగంగానే ఆయన ప్రభుత్వం తెచ్చిన పౌరసత్వం సవరణ చట్టానికి మద్దతుగా అనేక సందర్భాల్లో మాట్లాడారు. అలాగే ఢిల్లీలో రైతుల ఆందోళనల సమయంలో అధికార పార్టీకి అండగా నిలిచారు. కొన్నేళ్లుగా బీజేపీ అనుకూల వ్యాఖ్యలతో రాజకీయ ప్రత్యర్థులను కూడా పెంచుకున్న కంగన... మొన్న జరిగిన సాధారణ ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలోకి దిగారు. సొంత జిల్లా మండి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి పోటీపడిన ఆమె... కాంగ్రెస్ అభ్యర్థి విక్రమాదిత్య సింగ్‌పై భారీ మెజారిటీతో గెలుపొందారు. ఏదిఏమైనా ఇకపై తన సమయాన్ని పూర్తిగా రాజకీయాలు, మండీ ప్రజల అభ్యున్నతికే కేటాయిస్తానంటూ ప్రకటించారు కంగన.

అవకాడోతో ప్రయోజనాలెన్నో

ఈ మధ్యకాలంలో అవకాడోలు చిన్న చిన్న పట్టణాలలోకి కూడా ప్రవేశించాయి. ఈ అవకాడోల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని పౌష్టికాహార నిపుణులు పేర్కొంటున్నారు.

- ఒక అవకాడో ద్వారా 320 కేలరీలు లభిస్తాయి. 28 గ్రాముల కొవ్వు, 17 గ్రాముల కార్బోహైడ్రేట్స్, 14 గ్రాముల ఫైబర్, రెండు గ్రాముల సుగర్ లభిస్తాయి. అందువల్లే అవకాడోల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పౌష్టికాహార నిపుణులు పేర్కొంటున్నారు.
- అవకాడోలలో సీ,ఈ,కె, బీ6 విటమిన్లు ఎక్కువగా లభిస్తాయి. ఇవి మన శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయి. వీటితో పాటుగా రిబోఫ్లేవిన్, నయాసిన్, ఫోలేట్, పేంటోథెనిక్ యాసిడ్, మాగ్నిషియం, పోటాసియం, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా లభిస్తాయి.
- అవకాడోలలో విటమిన్ కె ఉంటుంది. ఇది కాల్షియం శరీరంలోకి ప్రవేశించేలా చేస్తుంది. మూత్రం ద్వారా కాల్షియం బయటకు వెళ్లకుండా చూస్తుంది.
- కొలస్ట్రాల్ విలువలు పెరగకుండా అవకాడో ఉపకరిస్తుంది. దీని వల్ల హృద్రోగ సమస్యలు తొలగిపోతాయి.
- శరీరంలో చక్కెర విలువలు పెరగకుండా అవకాడో నియంత్రిస్తుంది.
- అవకాడోలో ఫోలేట్ చాలా ఎక్కువగా ఉంటుంది. మెదడు చురుకుగా పనిచేయటంలో ఇది ఉపకరిస్తుంది.
- దీనిలో ఫైబర్ చాలా ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల అజీర్తి సమస్యలు తొలగిపోతాయి.



రోజూ టీ తాగితే..!

చాలా మందికి ఉదయాన్నే లేచిన వెంటనే టీ తాగకపోతే రోజు ప్రారంభమయినట్లు అనిపించదు. అయితే టీని ప్రతి రోజు క్రమం తప్పకుండా తాగితే శరీరంలో ఎలాంటి మార్పులు వస్తాయో చాలా మందికి తెలియదు. ఆ మార్పులు ఏమిటో చూద్దాం...

- రోజు పాలతో చేసిన టీని తాగితే- పాలలో ఉండే కాల్షియం శరీరానికి అందుతుంది. వయస్సు పైబడుతున్న సమయంలో ఎముకలకు సంబంధించిన వ్యాధులు రాకుండా ఈ కాల్షియం కాపాడుతుంది.
- టీపొడిలో కొన్ని రకాల యాంటీఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి మన మెదడు చురుకుగా పనిచేయటానికి ఉపకరిస్తాయి.
- టీలో కెఫైన్ కూడా ఉంటుంది. కెఫైన్ వల్ల ఏకాగ్రత పెరగటం వంటి కొన్ని మంచి లక్షణాలు ఉన్నా.. ఎక్కువ కెఫైన్‌ను తాగటం మంచిది కాదు. దీని వల్ల ఆందోళన పెరుగుతుంది.



- టీలో ఉండే టేనిన్స్ అనే రసాయనాలు - మన శరీరం ఐరన్‌ను పొందే ప్రక్రియలో అడ్డం పడతాయి. దీని వల్ల ఎక్కువగా టీ తాగే వారిలో ఐరన్ తక్కువగా ఉంటుంది.
- పాలు, పంచదార కలిపిన టీలో చక్కెర ఎక్కువగా ఉంటుంది. ప్రతి రోజు క్రమం తప్పకుండా అవసరాన్ని మించిన చక్కెరను తీసుకుంటే- స్థూలకాయం, మధుమేహం వంటి సమస్యలు రావచ్చు.

ఇవి పాటించండి...

- రోజుకు రెండు కప్పుల టీ కన్నా ఎక్కువ తాగవద్దు
- వీలైనంత తక్కువ చక్కెర వాడండి
- టీను ఎక్కువగా తాగే వారు నీళ్లను కూడా ఎక్కువగా తాగాలి
- అజీర్తి వంటి సమస్యలు తలెత్తినప్పుడు - పాలతో చేసిన టీని తాగకండి

ఫ్యాషన్




తేలికగా ఉండే ఫ్యాబ్రిక్ చందేరి. దీంతో చీరలే కాదు, షల్వార్ కమీజ్‌లూ, సూట్లు కూడా తయారుచేస్తూ ఉంటారు. ఫ్లవర్ డిజైన్లలో ఆహ్లాదకరంగా కనిపించే చందేరి సూట్స్ మీద ఓ లుక్కేద్దామా?

చందేరి చమక్కులు

అదనపు హంగులు ఇలా...

సెక్విన్లు, డోరీలు, భారీ చున్నీలు చందేరీ డ్రస్సుల ప్రత్యేకత. సాధారణంగా అనార్కలి స్టైల్‌లో రూపొందే చందేరీ సూట్లు నాజూకుగా ఉండే అమ్మాయిలకు చాలా బాగా నప్పుతాయి. అడుగున అదే రంగు లెగ్గింగ్ వేసుకుని, పాదాలకు ఫ్లాట్స్ ధరించే చందేరీ లుక్ పూర్తవుతుంది. ఈ దుస్తులకు సింపుల్, మెటల్ జ్యువెలరీ సూటవుతుంది. లేయర్డ్ స్టైల్ చందేరీ దుస్తులైతే హీల్స్ వేసుకోవచ్చు.



దుపట్టా ఇలా...

చందేరీ సూట్‌కు దుపట్టా ఉన్నా, లేకపోయినా ఫర్వాలేదు. రౌండ్ లేదా వి నెక్ డ్రస్‌లు అమ్మాయిలందరికీ నప్పుతాయి. టాప్ పొడవు మోకాళ్ల కింద వరకూ ఉంటే, ప్యాంట్ స్టైల్‌లో ఉండే బాటమ్ ధరించాలి. ఫెస్టివ్ లుక్ రప్పించాలనుకుంటే, మెరుసే సెక్విన్లతో కూడిన డ్రస్ ఎంచుకోవాలి.

స్టైల్‌గా... హుందాగా...

సిల్క్, గోల్డెన్ జరీల కలనేతతో రూపొందే చందేరీ సూట్లు హుందాగా ఉంటాయి. ఈవినింగ్ పార్టీలు, పెళ్లిళ్లలో టీనేజీ అమ్మాయిలు ధరించడానికి అనువుగా ఉండే ఈ దుస్తులు లేటెస్ట్ ఫ్యాషన్‌గా చలామణీ అవుతున్నాయి. హాఫ్ వైట్ మీద ఆకర్షణీయమైన రంగుల్లోని పువ్వులు, లతల డిజైన్లు చందేరీ ప్రత్యేకతలు. చూడడానికి భారీగా కనిపించినా, ధరించడానికి తేలికగా ఉంటాయి కాబట్టి చందేరీ దుస్తులు మహిళలను ఆకర్షిస్తూ ఉంటాయి.




నీరజ్‌దే స్వర్ణం



తుర్కు (ఫిన్లాండ్): ఒలింపిక్ చాంపియన్, స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా స్వల్ప విరామం తర్వాత బరిలోకి దిగిన అంతర్జాతీయ టోర్నీలో అదరగొట్టాడు. పావో నుర్మీ క్రీడల్లో తొలి సారి విజేతగా నిలిచి సత్తా చాటాడు. మంగళవారం ఇక్కడ జరిగిన జావెలిన్ త్రో ఫైనల్స్‌లో నీరజ్ తన మూడో ప్రయత్నంలో ఈటెను 85.97 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ టోర్నీలో స్వర్ణం సాధించడం నీరజ్‌కిదే మొదటిసారి. 2022లో ఇక్కడ అత్యుత్తమంగా రజత పతకం గెలిచాడు. ఇక, నీరజ్‌కు గట్టి పోటీ ఇస్తాడనుకున్న జర్మనీకి చెందిన 19 ఏళ్ల టీనేజర్ మ్యాక్స్ డెహ్‌నింగ్ 79.84 మీటర్ల ప్రదర్శనతో ఏడో స్థానంలో నిలిచాడు. గతంలో 90 మీటర్ల మార్క్ అందుకున్న ఈ యువ సంచలనం.. ఇక్కడ కనీసం 80 మీటర్ల దూరాన్ని నమోదుచేయలేకపోవడం గమనార్హం. స్థానిక ఫేవరెట్ టోనీ కెరానెన్ (84.19 మీ.) రజతం దక్కించుకోగా.. ఫిన్లాండ్‌కే చెందిన మాజీ చాంపియన్ ఒలివర్ హెలాండర్ (83.96 మీ.) కాంస్య పతకానికి పరిమితమయ్యాడు. నీరజ్ తన తదుపరి పోటీల్లో భాగంగా వచ్చే నెల 7న జరిగే పారిస్ డైమండ్ లీగ్‌లో పోటీపడనున్నాడు.

స్టెపాన్ చెస్ విజేత అర్జున్



జెర్ముక్ (అర్మేనియా): అద్భుత ఆట తీరుతో స్టెపాన్ అవగ్యాన్ చెస్ టైటిల్‌ను తెలుగు గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ సొంతం చేసుకున్నాడు. మంగళవారం ముగిసిన ఈ తొమ్మిది రౌండ్ల టోర్నీలో అర్జున్ 6.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఆఖరి రౌండ్‌లో స్థానిక జీఎం మాన్యువల్ పెట్రోస్యన్‌తో తలపడిన అర్జున్ 43వ ఎత్తు అనంతరం డ్రాకు అంగీకరించాడు. అర్జున్ విజేతగా నిలవగా, అమెరికా జీఎం శామ్యూల్ సెవియన్ రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకున్నాడు. ఈ టోర్నీ అనంతరం ఫిడే వరల్డ్ క్లాసిక్ ర్యాంకింగ్స్‌లో అర్జున్ నాలుగోస్థానంలో కొనసాగుతున్నాడు.

భారత్ X దక్షిణాఫ్రికా మహిళల రెండో వన్డే	మ.1.30 నుంచి జియో సినిమా, టీవీ 18లో

గంభీరే కాదు.. రామన్ కూడా

- చీఫ్ కోచ్ ఇంటర్వ్యూకు హాజరైన మాజీలు



న్యూఢిల్లీ: భారత జట్టు చీఫ్ కోచ్ పోస్టు కోసం మాజీ ఆటగాళ్లు గౌతమ్ గంభీర్, డబ్ల్యూవీ రామన్‌లను క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) మంగళవారం ఇంటర్వ్యూ చేసింది. ఆన్‌లైన్‌లో జరిగిన కార్యక్రమంలో గంభీర్, రామన్, సీఏసీ ఛైర్మన్ అశోక్ మల్హోత్రాలు వర్చువల్‌గా హాజరయ్యారు. 'గంభీర్ ఇంటర్వ్యూ తొలి రౌండ్ ముగిసింది. బుధవారం మరోసారి అతడితో మాట్లాడే చాన్సులున్నాయ'ని బోర్డు అధికారి ఒకరు తెలిపారు. ఆ తర్వాత రామన్ ఇంటర్వ్యూ కూడా 40 నిమిషాలపాటు జరిగిందని చెప్పారు. కోచ్ రేసులో గంభీర్ ప్రధానంగా ఉండడంతో.. అతడి ఎంపిక లాంఛనమే కానుంది. మరో 48 గంటల్లో అధికారికంగా గౌతీని టీమిండియా కోచ్‌గా ప్రకటించే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు కూడా భావిస్తున్నాయి. కాగా, అశోక్‌తో పాటు సీఏసీ సభ్యులు జతిన్ పరాంజపే, సులక్షణ నాయక్‌లు ఏఏ ప్రశ్నలు అడిగారనే సమాచారం ఇంకా బయటకు రాలేదు. రానున్న మూడేళ్లలో జరిగే మెగా టోర్నీలను దృష్టిలో ఉంచుకొని గంభీర్ ఆలోచనలు ఎలా ఉన్నాయనే వాటిపై ప్రధానంగా చర్చ జరిగిందని సమాచారం.

మ్యాక్సీ సెల్ఫ్‌గోల్.. ఫ్రాన్స్ విన్



- 0-1తో ఆస్ట్రియా ఓటమి
- యూరో చాంపియన్‌షిప్

డుస్సెల్‌డోర్ఫ్ (జర్మనీ): యూరోపియన్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఫ్రాన్స్ బోణీ చేసింది. మ్యాక్సీమిలన్ వోబర్ సెల్ఫ్ గోల్‌తో.. గ్రూప్-డిలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్ 1-0తో ఆస్ట్రియాపై గెలిచింది. 38వ నిమిషంలో ఫ్రాన్స్ స్టార్ కిలియన్ ఎంబప్పే కొట్టిన కిక్‌ను మ్యాక్సీ హెడర్‌తో క్లియర్ చేసేందుకు యత్నించగా.. దురదృష్టవశాత్తూ బంతి గోల్‌పోస్టులోకి వెళ్లింది. ఆ తర్వాత ఫ్రాన్స్ మరిన్ని దాడులు చేసినా ఆస్ట్రియా సమర్థంగా ఎదుర్కొంది. అయితే, చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకొన్న ఫ్రాన్స్ విజయాన్ని సొంతం చేసుకొంది.

ఎంబప్పే ముక్కు పగిలింది



మ్యాచ్‌లో ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు ఎంబప్పే ముక్కుకు తీవ్ర గాయమైంది. ముక్కు ఎముక చిట్లినట్టు ఫ్రాన్స్ ఫుట్‌బాల్ సమాఖ్య ప్రకటించింది. అయితే, తక్షణం శస్త్రచికిత్స చేయించాల్సిన అవసరం లేదని తెలిపింది. బంతిని అందుకోవడం కోసం గాలిలోకి ఎగిరిన సమయంలో ప్రత్యర్థి ఆటగాడు డాన్సో భుజం బలంగా తగలడంతో ఎంబప్పే ముక్కుకు గాయమైంది. రక్తస్రావం కావడంతో ప్రాథమిక చికిత్స అనంతరం ఆసుపత్రికి తరలించారు. ఇలాంటి దెబ్బలు నయం కావడానికి ఆరు వారాల సమయం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. అయితే, అతడు మాస్క్ ధరించి ఆడే చాన్సులున్నాయి. 'మాస్క్‌కు ఏదైనా ఐడియా ఉందా?' అని ఎంబప్పే ఎక్స్‌లో పోస్టు చేయడం విశేషం.

సఫారీలకు సవాల్



టీ20 వరల్డ్‌కప్

నేడు అమెరికాతో సూపర్-8 మ్యాచ్

తుది జట్లు (అంచనా)

దక్షిణాఫ్రికా: డికాక్, హెన్‌డ్రిక్స్, మార్‌క్రమ్ (కెప్టెన్), స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, జాన్సెన్, కేశవ్/షంసీ, రబాడ, నోకియా, బార్ట్‌మన్.

యూఎస్ఏ: స్టీవెన్ టేలర్, మోనంక్ (కెప్టెన్), గౌస్, జోన్స్, నితీశ్ కుమార్, ఆండర్సన్, హర్మీత్, జస్దీప్, కెంజిగె, అలీ ఖాన్, సౌరభ్ నేత్రావల్కర్.

పిచ్, వాతావరణం

ఆకాశం మేఘావృతంగా ఉండనుంది. వర్షం కురిసే అవకాశం 20 శాతమే ఉండడంతో పెద్దగా ఆటంకం ఉండకపోవచ్చు. టోర్నీలో ఇప్పటిదాకా ఈ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించింది. అలాగే చక్కటి బౌన్స్, పేస్ లభించడంతో పేసర్లు కూడా రాణించారు.

నార్త్ సౌండ్: అంచనాలకు భిన్నంగా సాగిన టీ20 వరల్డ్‌కప్ గ్రూప్ దశ ముగిసింది. పాకిస్థాన్, న్యూజిలాండ్, శ్రీలంకలాంటి పటిష్ఠ జట్లు లేకుండానే నేటి నుంచి సూపర్-8 మ్యాచ్‌లు సాగనున్నాయి. ఇందులో గ్రూప్-1, గ్రూప్-2లో నాలుగేసి జట్లు పోటీపడనున్నాయి. ప్రతీ జట్టు తమ గ్రూప్‌లోని మిగతా మూడు జట్లతో ఆడాల్సి ఉంటుంది. తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్ చేరతాయి. దీనిలోభాగంగా సూపర్-8లో మొదటి మ్యాచ్ గ్రూప్-2లోని దక్షిణాఫ్రికా-యూఎస్ఏ మధ్య జరుగబోతోంది. ఎవరూ ఊహించని విధంగా ఆతిథ్య యూఎస్ జట్టు గ్రూప్ దశను దాటగలిగింది. ఎక్కువగా ప్రవాస భారతీయులతో కూడిన ఈ జట్టు కరీబియన్ గడ్డపైనా తమ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. కెప్టెన్ మోనంక్ పటేల్ ఫిట్‌నెస్‌పై స్పష్టత రావాల్సి ఉండగా, ఎప్పటిలాగే పేసర్ నేత్రావల్కర్‌పై భారం పడనుంది.

బౌలింగే బలంగా..: సఫారీలు తమ గ్రూప్ 'డి' దశను అజేయంగా ముగించినా ఆశించిన మేర రాణించలేకపోయారు. కేవలం తమ బౌలర్ల ప్రదర్శనతోనే అతికష్టమ్మీద గట్టెక్కారు. బ్యాటర్లు మాత్రం పసికూన జట్లపైనా బెంబేలెత్తిపోయారు. ఒక్కసారి కూడా 120 పరుగుల మార్క్‌ను దాటలేకపోవడం గమనార్హం. నేపాల్‌పై ఆఖరి బంతికి దారుణ పరాభవం నుంచి బతికిపోయారు. ఇక నుంచి పోరు అత్యంత కీలక దశకు చేరిన నేపథ్యంలో తమ ప్రపంచస్థాయి బ్యాటర్ల నుంచి మెరుగైన ప్రదర్శనను జట్టు ఆశిస్తోంది. డికాక్, హెన్‌డ్రిక్స్, క్లాసెన్, మిల్లర్, స్టబ్స్ మార్‌క్రమ్‌లతో లైనప్ పటిష్ఠంగా కనిపిస్తున్నా.. క్రీజులో నిలువలేకపోతోంది. తమ గ్రూప్‌లోనే ఇంగ్లండ్, విండీస్ కూడా ఉండడంతో సఫారీ బ్యాటర్లు తీవ్ర ఒత్తిడిలోనే బరిలోకి దిగనున్నారు. కానీ బౌలర్లు మాత్రం అద్భుత ఫామ్‌లో ఉండడం సానుకూలాంశం. టోర్నీ ఆరంభానికి ముందు పేసర్ నోకియా ఫామ్‌పై ఆందోళన నెలకొన్నా.. గ్రూప్ దశలో అదరగొట్టాడు. తొమ్మిది వికెట్లతో టోర్నీ సెకండ్ టాపర్‌గా ఉన్నాడు. అటు బార్ట్‌మన్ కూడా జోరు మీదున్నాడు. ఇతర పేసర్లు జాన్సెన్, రబాడ యూఎస్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టేందుకు ఎదురుచూస్తున్నారు.

ఒలింపిక్స్‌కు ఐదుగురు షాట్‌గన్ షూటర్లు

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత షాట్‌గన్ బృందాన్ని జాతీయ షూటింగ్ సమాఖ్య ప్రకటించింది. మంగళవారం విడుదల చేసిన ఈ జాబితాలో ఐదుగురు షూటర్లకు స్థానం దక్కింది. పృథ్వీరాజ్ తొండైమన్, రాజేశ్వరీ కుమారి, అనంత్‌జీత్ సింగ్, రైజా ఢిల్లాన్, మహేశ్వరి చౌహాన్‌కు పారిస్ బెర్త్‌లు లభించాయి. సీనియర్ షూటర్ పృథ్వీరాజ్ ఈ షాట్‌గన్ బృందాన్ని నడిపించనున్నాడు. ఈ ఐదుగురికి ఒలింపిక్స్‌లో ఆడడం ఇదే తొలిసారి.

ఐదు రోజుల్లోనే మ్యాచ్‌లన్నీ..



భారత్ షెడ్యూల్ బిజీ

బ్రిడ్జ్‌టౌన్: టీ20 వరల్డ్‌కప్‌లో గ్రూప్ 'ఎ' దశను అజేయంగా ముగించిన టీమిండియా ఇప్పుడు సూపర్-8పై దృష్టి సారించింది. అయితే ఇందులో భాగంగా విండీస్ గడ్డపై ఐదు రోజుల వ్యవధిలోనే భారత్ మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈనెల 20న అఫ్ఘాన్‌తో తొలి మ్యాచ్ ఆడనుండగా, ఆ తర్వాత 22న బంగ్లా, 24న ఆసీస్‌తో తలపడుతుంది. మరోవైపు ఇలాంటి కఠిన సవాల్‌ను ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగానే ఉన్నామని కెప్టెన్ రోహిత్ చెబుతున్నాడు. 'సూపర్-8లో మ్యాచ్‌ల మధ్య మాకు ఎక్కువ సమయం లేదు. ఐదు రోజుల వ్యవధిలోనే మూడు మ్యాచ్‌లను ఆడాల్సి ఉంటుంది. అలాగే ప్రయాణాలు కూడా తప్పవు. ఇది హడావిడిగా కనిపించినా.. మేం దీన్ని ఓ సాకుగా చెప్పాలనుకోవడం లేదు' అని రోహిత్ తెలిపాడు.

వరల్డ్‌కప్‌లో ఫిక్సింగ్ కలకలం

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): క్రికెట్‌లో మరోసారి ఫిక్సింగ్ కలకలం రేగింది. తాజాగా టీ20 వరల్డ్‌కప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ కోసం కెన్యా మాజీ ఆటగాడు ఒకరు.. ఉగాండా ప్లేయర్‌ను పలువిధాలుగా సంప్రదించడానికి ప్రయత్నించాడట. అయితే, సదరు ఉగాండా ఆటగాడు ఈ విషయాన్ని ఐసీసీ అవినీతి నిరోధక యూనిట్‌కు ఫిర్యాదు చేశాడట. గయానాలో జరిగిన లీగ్ మ్యాచ్‌ల సందర్భంగా కెన్యా మాజీ ఆటగాడు పలు ఫోన్ నెంబర్లతో ఉగాండా ఆటగాడిని సంప్రదించడానికి ప్రయత్నించాడని తెలిసింది. సమాచారం అందుకొన్న అవినీతి నిరోధక యూనిట్.. అతడి గురించి మిగతా జట్లను అప్రమత్తం చేసింది.

పూరన్ ధనాధన్




అఫ్ఘాన్‌పై విండీస్ విజయం

గ్రాస్ ఐలెట్ (సెయింట్ లూసియా): నికోలస్ పూరన్ (53 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్సర్లతో 98) దూకుడైన ఆటతీరుతో చెలరేగాడు. దీంతో మంగళవారం అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన గ్రూప్ 'సి' ఆఖరి మ్యాచ్‌లో వెస్టిండీస్ 104 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే ఓటమనేదే లేకుండా 8 పాయింట్లతో ఆతిథ్య జట్టు టాప్‌లో నిలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 218 పరుగుల భారీ స్కోరు సాధించింది. చార్లెస్ (43), పావెల్ (26), హోప్ (25) రాణించారు. ఆఖరి ఓవర్‌లో పూరన్ రనౌట్ కావడంతో త్రుటిలో శతకం కోల్పోయాడు. గుల్బదిన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో అఫ్ఘాన్ 16.2 ఓవర్లలో 114 పరుగులకు కుప్పకూలింది. ఇబ్రహీం జద్రాన్ (38), ఒమర్జాయ్ (23) మాత్రమే ఆకట్టుకున్నారు. మెకాయ్‌కు మూడు.. హోసేన్, మోటీలకు రెండేసి వికెట్లు దక్కాయి.

బిజినెస్

వడ్డీ రేట్ల తగ్గింపుపై తొందరపడం




- సాహసాలు చేసే ఆలోచనా లేదు
- పసిడి నిల్వలు ఇంకా పెంచుకుంటాం
- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

ముంబై: వడ్డీ రేట్ల తగ్గింపునకు తొందర లేదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. ప్రస్తుత ద్రవ్య, పరపతి విధానం కొనసాగుతుందన్నారు. ఈటీ నౌ బిజినెస్ న్యూస్ చానల్ నిర్వహించిన ఒక సదస్సులో ఆయన ఈ విషయం తెలిపారు. రిటైల్ ద్రవ్యోల్బణం ఇంకా నాలుగు శాతంపైనే ఉన్న నేపథ్యంలో కీలక రెపో రేటు తగ్గించే సాహసం చేయదలచుకోలేదన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం కొంత తగ్గినా, ఆహార ద్రవ్యోల్బణం ఇంకా అధిక స్థాయిలోనే ఉన్న విషయాన్ని దాస్ గుర్తు చేశారు. అయితే రిటైల్ ద్రవ్యోల్బణం నిదానంగా తగ్గుముఖం పడుతోందన్న తమ అంచనాల్లో మార్పు లేదన్నారు.

ఫారెక్స్ నిల్వలు పెంచుకుంటాం: ఎలాంటి ఆటుపోట్లనైనా తట్టుకునేందుకు వీలుగా విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలు పెంచుకునే తమ విధానం కొనసాగుతుందని దాస్ స్పష్టం చేశారు. ఫారెక్స్ నిల్వల వివిధీకరణలో భాగంగా బంగారం నిల్వలు పెంచుకునే వ్యూహం కూడా కొనసాగుతుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధి రేటు ఆర్‌బీఐ అంచనా వేసిన 7.2 శాతం కంటే ఎక్కువే ఉండే అవకాశం ఉందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం మూలధన ఖాతా (సీఏడీ) లోటూ జీడీపీలో 1.2 శాతాని కంటే తక్కువే ఉంటుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. స్టాక్ మార్కెట్ ఎఫ్ అండ్ ఓలో వ్యాపార లావాదేవీలు భారీగా పెరగడాన్నీ నిశితంగా గమనిస్తున్నట్టు దాస్ తెలిపారు. అయితే ఈ విషయంలో పరిస్థితులు అదుపు తప్పితే సెబీనే చర్యలు తీసుకుంటుందని అన్నారు.

77,000 ఎగువకి సెన్సెక్స్



23,500 స్థాయిని దాటిన నిఫ్టీ

- సరికొత్త గరిష్ఠాలకు సూచీలు
- రూ.437 లక్షల కోట్లకు మార్కెట్ క్యాప్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరుకున్నాయి. సెన్సెక్స్ తొలిసారిగా 77,000 ఎగువన ముగియగా.. నిఫ్టీ 23,500 మార్క్‌ను దాటింది. ఇన్ఫోసిస్, విప్రోతో పాటు ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడులు, గ్లోబల్ మార్కెట్ల సానుకూల సంకేతాలూ సూచీల ర్యాలీకి కలిసివచ్చాయి. ఒక దశలో సెన్సెక్స్ 374 పాయింట్లు ఎగబాకి 77,366.77 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును తాకి చివరికి 308.37 పాయింట్ల లాభంతో 77,301.14 సరికొత్త గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. నిఫ్టీ సైతం ఒకదశలో 113.45 పాయింట్ల వృద్ధితో 23,579.05 వద్ద సరికొత్త ఇంట్రాడే గరిష్ఠాన్ని, చివరికి 92.30 పాయింట్ల లాభంతో 23,557.90 వద్ద ఆల్‌టైం రికార్డు ముగింపును నమోదు చేసింది. అలాగే, ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.437.24 లక్షల కోట్లకు చేరుకుంది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో మార్కెట్ సంపద రూ.10.29 లక్షల కోట్లు పెరిగింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 22 లాభపడ్డాయి.

ఇక్సిగో షేర్ల బంపర్ లిస్టింగ్

తొలిరోజే 78 శాతం వృద్ధి

ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ ఇక్సిగో మాతృ సంస్థ లే ట్రావెన్యూస్ టెక్నాలజీ లిమిటెడ్ మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.93తో పోలిస్తే, ఎన్ఎస్ఈలో కంపెనీ షేరు 48.49 శాతం ప్రీమియంతో రూ.138.10 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో మరింత పుంజుకున్న షేరు.. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 78.19 శాతం లాభంతో రూ.165.72 వద్దకు చేరుకుంది. గత బుధవారంతో ముగిసిన లే ట్రావెన్యూస్ ఐపీఓకు ఇష్యూ సైజుతో పోలిస్తే 98.10 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

ఇండస్ టవర్స్‌లో 10% వాటా విక్రయించనున్న వొడాఫోన్

మొబైల్ టవర్ల నిర్వహణ సంస్థ ఇండస్ టవర్స్‌లో దాదాపు 10 శాతం వాటాకు సమానమైన 26.8 కోట్ల ఈక్విటీ షేర్లను వొడాఫోన్ గ్రూప్ ఓపెన్ మార్కెట్లో బ్లాక్ డీల్ ద్వారా బుధవారం విక్రయించనుంది. తద్వారా వొడాఫోన్‌కు 110 కోట్ల డాలర్ల (రూ.9,185 కోట్లు) వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఇండస్ టవర్స్‌లో వొడాఫోన్ గ్రూప్ 21.5 శాతం వాటా కలిగి ఉంది.

పన్ను వసూళ్ల జోరు

న్యూఢిల్లీ: దేశంలో ప్రత్యక్ష పన్ను వసూళ్లు అమిత వేగంగా పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్ 17 నాటికి నికరంగా రూ.4,62,664 కోట్లు పన్ను వసూలైనట్టు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో రూ.1,80,949 కోట్లు కార్పొరేట్ ఆదాయపు పన్నుగాను, రూ.2,81,013 కోట్లు వ్యక్తిగత ఆదాయపు పన్నుగాను వసూలయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో వచ్చిన పన్ను వసూళ్ల కన్నా ఇది 21 శాతం అధికం. ఇదే తేదీ నాటికి రిఫండ్ల కింద రూ.53,322 కోట్లు బట్వాడా చేశారు. అడ్వాన్స్ టాక్స్ వసూళ్లు పెరగడమే ఇందుకు కారణం. జూన్ 15వ తేదీ నాటికి అందవలసిన అడ్వాన్స్ టాక్స్ తొలి వాయిదా కింద రూ.1.48 లక్షల కోట్లు వసూలైంది.

హైదరాబాద్‌లో ఎన్ఎండీసీ ఆర్ అండ్ డీ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీ హైదరాబాద్ శివార్లలోని పటాన్‌చెరులో అత్యాధునిక ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ప్రారంభించింది. మినరల్ ప్రాసెసింగ్‌లో ఇన్నోవేషన్‌ను, సుస్థిర స్టీల్ టెక్నాలజీని ఇది ప్రోత్సహిస్తుంది. గత ఐదేళ్ల కాలంలో పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై రూ.150 కోట్లు ఇన్వెస్ట్ చేశామని, కొత్త ఆర్ అండ్ డీ కేంద్రం స్థాపనకు రూ.50 కోట్లు ఖర్చు చేశామని కంపెనీ తెలిపింది. పటాన్‌చెరులో ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఎన్ఎండీసీ సీఎండీ (అదనపు చార్జి) అమితవ ముఖర్జీ ఇతర డైరెక్టర్లు, సీనియర్ అధికారుల సమక్షంలో ప్రారంభించారు. ఇందులో నిపుణుల పర్యవేక్షణలో ఆధునిక లేబరేటరీలు ఉంటాయి.

50వ వసంతంలోకి సంగీత మొబైల్స్



సంగీత మొబైల్స్ ఎండీ సుభాష్ చంద్ర

వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్లు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద మొబైల్ రిటైల్ వ్యాపార సంస్థ సంగీత మొబైల్స్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. సంగీత గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా మొబైల్స్ కొనుగోలుపై వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుభాష్ చంద్ర తెలిపారు. 50 ఏళ్ల క్రితం బెంగళూరు జేసీ రోడ్‌లో గ్రామ్‌ఫోన్ రికార్డులతో వ్యాపార ప్రస్థానాన్ని ప్రారంభించిన సంగీత.. కాలానుగుణంగా రేడియోలు, క్యాసెట్స్, హోం అప్లయెన్సెస్, టెలివిజన్స్, రిఫ్రిజిరేటర్లు, ఆడియో సీడీలు, వీడియో డీవీడీల వరకు తన కార్యకలాపాలను విస్తరించుకుంటూ వచ్చిందని వెల్లడించారు. టెలికాం విప్లవంతో గడిచిన రెండున్నర దశాబ్దాలుగా మొబైల్స్ రంగంలో తిరుగులేని సంస్థగా సంగీత మొబైల్స్ అవతరించిందని ఆయన తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలే కాకుండా ఉత్తరాది మార్కెట్లోకి సంగీత అడుగుపెట్టిందని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 800లకు పైగా షోరూమ్‌లను నిర్వహిస్తునట్టు సుభాష్ చంద్ర పేర్కొన్నారు. గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా మొబైల్స్ కొనుగోలుపై ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఇప్పటికే సంగీతలో ప్రైస్‌డ్రాప్, డ్యామేజ్ ప్రొటెక్షన్ కల్పిస్తుండగా తాజాగా లక్కీడిప్ ద్వారా 50 కార్లను బహుమతిగా అందించనున్నట్లు ఆయన చెప్పారు. అలాగే రూ.10 లక్షల వ్యక్తిగత బీమాను ఆఫర్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. అంతే కాకుండా ఆఫర్లలో భాగంగా స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై వినియోగదారుడికి 50 శాతం క్యాష్‌బ్యాక్‌ను అందించనున్నట్లు చెప్పారు. మొబైల్స్‌తో పాటు అన్ని రకాలైన ఎలక్ట్రిక్ ఉత్పత్తులను సంగీతలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే బెంగళూరులో త్వరలోనే సంగీత మల్టీ స్టోర్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆ తర్వాత వీటిని మరింతగా విస్తరించనున్నట్లు సుభాష్ చంద్ర తెలిపారు.

గ్లాండ్ ఫార్మాకు ఫోసన్ ఫార్మా గుడ్‌బై!

ముంబై: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే గ్లాండ్ ఫార్మా కంపెనీ నుంచి చైనా కంపెనీ ఫోసన్ ఫార్మా తప్పుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా వచ్చే వారం ఈ కంపెనీ ఈక్విటీలో తనకు ఉన్న 58 శాతం వాటాలో కొంత భాగాన్ని బ్లాక్ డీల్స్ ద్వారా విక్రయించబోతున్నట్టు సమాచారం. 2011లో గ్లాండ్ ఫార్మా ఈక్విటీలో 74 శాతం వాటాను కేకేఆర్ అండ్ కంపెనీ వంటి ప్రైవేట్ ఈక్విటీ సంస్థల నుంచి ఫోసన్ ఫార్మా 110 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసింది. అందులో ఇప్పటికే 16 శాతం వాటాను వివిధ సంస్థలకు విక్రయించింది. మంచి ధర వస్తే మిగిలిన వాటాను కూడా బ్లాక్ డీల్స్ ద్వారా విక్రయించాలని నిర్ణయించినట్టు సమాచారం.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,220 ▼	66,200 ▼	96,000 ▲
ముంబై	71,285 ▼	65,295 ▼	87,553 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	485
వరంగల్	502	గోదావరి	480
చిత్తూరు	553	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	139	విజయవాడ	145
వరంగల్	139	గుంటూరు	145
కరీంనగర్	139	ఒంగోలు	145
మహబూబ్‌నగర్	139	చిత్తూరు	140
కర్నూలు	139	నెల్లూరు	140
విశాఖపట్నం	136	అనంతపురం	145
గోదావరి	145		

రియల్టీ హాట్‌స్పాట్స్‌గా తిరుపతి, విశాఖపట్నం

కోలియర్స్ ఇండియా వెల్లడి

న్యూఢిల్లీ: వచ్చే కొద్ది సంవత్సరాల్లో దేశంలోని 17 ద్వితీయ శ్రేణి నగరాల్లో స్థిరాస్తి (రియల్టీ) రంగం వేగంగా అభివృద్ధి చెందనుంది. ఈ జాబితాల్లో వారణాసి, అయోధ్య, పూరి, ద్వారక, షిర్డీ, అమృత్‌సర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, విశాఖపట్నం నగరాలు కూడా ఉన్నాయి. ఆధ్యాత్మిక పర్యాటకం, మౌలిక సదుపాయాలు, డిజిటైజేషన్, రైలు, రోడ్డు, విమాన రవాణా వంటి సదుపాయాలు ఇందుకు కలిసి వస్తాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ కోలియర్స్ ఇండియా తెలిపింది. వందకుపైగా ద్వితీయ శ్రేణి నగరాలను పరిశీలించి కోలియర్స్ ఇండియా మొత్తం 30 నగరాలను ఎంపిక చేసింది. మళ్లీ ఇందులో తిరుపతి, వైజాగ్‌తో సహా 17 నగరాల్లో స్థిరాస్తి రంగం మధ్య, దీర్ఘ కాలంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని అంచనా వేసింది. దీంతో భారత రియల్ ఎస్టేట్ రంగం 2030 నాటికి లక్ష కోట్ల డాలర్లకు, 2050 నాటికి ఐదు లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని పేర్కొంది. డేటా కేంద్రాలు, సీనియర్ సిటిజన్ల నివాసాలు, రెండో ఇల్లు కావాలనే కోరికలు కూడా ఈ నగరాల్లో స్థిరాస్తి రంగ అభివృద్ధికి కలిసి రానున్నాయి.

7 నగరాల్లో పెరిగిన అద్దెలు

హైదరాబాద్‌తో సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో నివాస గృహాల అద్దెలు పెరిగాయి. ఈ ఏడాది జనవరి-ఫిబ్రవరితో పోలిస్తే, ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఈ పెరుగుదల సగటున 2 నుంచి 4 శాతం వరకు ఉందని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ తెలిపింది. అయితే ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో పెరిగిన 4-9 శాతంతో పోలిస్తే.. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అద్దెల పెరుగుదల స్వల్పంగానే ఉంది. నివాస గృహాల అందుబాటు పెరగడం ఇందుకు ప్రధాన కారణం. 2024 జనవరి-మార్చి త్రైమాసికంతో పోలిస్తే ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతంలో నివాస గృహాల నెలవారీ అద్దెలు 3 శాతం పెరిగాయని తెలిపింది.

భారత్‌లో ఎయిర్‌బస్ హెలికాప్టర్ల తయారీ

పరిశీలనలో హైదరాబాద్!

ముంబై: ఎయిర్‌బస్ మరో 'భారత్‌లో తయారీ'కి సిద్ధమవుతోంది. తన హెచ్ 145, హెచ్ 125 హెలికాప్టర్లను భారత్‌లో తయారు చేయాలని భావిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే టాటా గ్రూప్‌తో జట్టు కట్టింది. దీంతో ఈ రెండు సంస్థలు.. ఈ హెలికాప్టర్ల తయారీ ప్రాంతాన్ని ఎంపిక చేసే ప్రయత్నంలో ఉన్నాయి. ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ (ఇండియా, దక్షిణాసియా) చీఫ్ సన్నీ గుగ్లానీ ఈ విషయం వెల్లడించారు. స్థల ఎంపిక పూర్తయితే, వెంటనే ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టి 2026లో మూడు హెలికాప్టర్ల అసెంబ్లింగ్ పూర్తి చేస్తామని గుగ్లానీ చెప్పారు. ఆ తర్వాత ఈ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతామన్నారు. టాటా గ్రూప్ ఇప్పటికే హైదరాబాద్‌లో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) పేరుతో బోయింగ్, సికోర్స్కీ కంపెనీల హెలికాప్టర్ విడిభాగాలను తయారు చేసి అసెంబ్లింగ్ చేస్తోంది. దీంతో ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ కూడా తన హెలికాప్టర్ల అసెంబ్లింగ్ కోసం హైదరాబాద్‌నే ఎంచుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.



అనంతపురం ఎస్పీ గౌతమి శాలికి ఫిర్యాదును అందజేస్తున్న తెలుగు మహిళ నాయకురాలు సంగా తేజస్విని తదితరులు

జగన్‌పై ఫర్నిచర్ చోరీ కేసు నమోదు చేయండి

» అనంతపురం ఎస్పీకి తెలుగు మహిళల ఫిర్యాదు

అనంతపురం అర్బన్, జూన్ 18: శాసనసభ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ ఆత్మహత్యకు కారణమైన మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని అనంతపురం జిల్లా ఎస్పీ గౌతమి శాలికి విజ్ఞప్తి చేశారు. పలువురు తెలుగు మహిళలతో కలిసి ఆమె మంగళవారం జగన్‌పై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన కోట్లాది రూపాయల విలువైన ఫర్నిచర్‌ను తాడేపల్లి ప్యాలెస్‌కు దొంగతనంగా తీసుకువెళ్లిన జగన్‌పై గతంలో కోడెల శివప్రసాద్‌పై పెట్టిన తరహాలోనే కేసులు నమోదు చేయాలని కోరారు.

పల్నాడు ఎస్పీకి కూడా..

జగన్ రూ.6.67 కోట్ల ప్రజాధనాన్ని సొంత అవసరాలకు వాడుకున్నారని పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి రాజశేఖరరెడ్డి మంగళవారం పల్నాడు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన వస్తువులను, సామగ్రిని సొంతానికి వినియోగించుకున్నారని, ఆ సొమ్మును రికవరీ చేసి జగన్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదును ఈ నెల 25వ తేదీ లోపల పరిష్కరిస్తామని, కేసు స్టేటస్‌ను పోలీసు వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చని ఫిర్యాదుదారుడికి ఎస్పీ కార్యాలయం సమాధానం ఇచ్చింది.

వాసుదేవరెడ్డి బెయిల్ పిటిషన్ వాయిదా

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఏపీ బెవరేజెస్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ వాయిదా పడింది. వైసీపీ హయాంలో వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొన్న వాసుదేవరెడ్డి ఆ ప్రభుత్వం దిగిపోగానే హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఈ క్రమంలో బేవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి కీలక ఫైళ్లు, కంప్యూటర్ హార్డ్ డిస్కులు చోరీ చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. అయితే.. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వాసుదేవరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. న్యాయస్థానం ఈ పిటిషన్‌పై విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది. మంగళవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా సీఐడీ తరపు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు.

'ఆడుదాం' పేరుతో 500 కోట్ల దోపిడీ: మూర్తియాదవ్

విశాఖపట్నం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో రూ.500 కోట్ల దోపిడీ జరిగిందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. "జగన్మోహన్‌రెడ్డి, రోజా, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కలసి 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో భారీ కుంభకోణానికి పాల్పడ్డారు. ప్రభుత్వం కేటాయించిన నిధులు రూ.120 కోట్లు కాగా, స్పాన్సర్ల నుంచి రూ.500 కోట్ల వరకు వసూలు చేశారు. పులివెందులలో రూ.6 కోట్లతో పూర్తయ్యే మైదానానికి రూ.20 కోట్లు ఖర్చు చేసినట్టు చూపించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిధులు కాజేసేందుకు కుట్ర చేస్తున్నారు' అని మూర్తి యాదవ్ ఆరోపించారు.

సెబ్‌ను రద్దు చేయాలి.. సంఘాల వినతి

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విభజనతో అన్యాయానికి గురైన తమ శాఖను తిరిగి ఒక్కటిగా చేసి న్యాయం చేయాలని ఎక్సైజ్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ సంఘం నాయకులు బి.నర్సింహులు, వీవీవీఎస్ఎన్ వర్మ, మార్పు కోటయ్య తదితరులు మంగళవారం విజయవాడలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

'ప్రైవేటు స్కూళ్లకు పదేళ్ల రెన్యువల్ విధానం తేవాలి'

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు పదేళ్లకు ఒకసారి గుర్తింపు రెన్యువల్ చేసే విధానం తీసుకురావాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఏపీ ప్రైవేటు పాఠశాలల సంఘం విజ్ఞప్తి చేసింది. ఆ సంఘం నాయకులు మోహనరావు, ఎం.శ్రీనివాసరావు, వీరవల్లి రవి తదితరులు మంగళవారం ఉండవల్లిలో లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

ఆదాయ పన్ను మినహాయింపు 5లక్షలకు పెంపు!

» నూతన పన్ను విధానంలో ఉన్నవారికే.. బడ్జెట్‌పై కొనసాగుతున్న కసరత్తు

న్యూఢిల్లీ, జూన్ 18: కేంద్ర ప్రభుత్వం వచ్చే నెలలో ప్రవేశపెట్టనున్న 2024-25 బడ్జెట్‌లోనూ వేతన జీవులకు ఊరట లభించే అవకాశం లేదా? పాత పన్ను విధానంలో ఉన్నవారిని పక్కనపెట్టి నూతన పన్ను విధానం(న్యూ ట్యాక్స్ రెజీమ్)లో ఉన్న వారికే ప్రభుత్వం రాయితీలు ఇవ్వనుందా? అంటే సంబంధిత వర్గాలు అవుననే అంటున్నాయి. ఐటీ మినహాయింపు పరిమితిని ప్రభుత్వం రూ.3లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచే అవకాశం ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. అయితే, ఈ పెంపు కేవలం నూతన ఆదాయపు పన్ను విధానం(న్యూ ట్యాక్స్ రెజీమ్)లో ఉన్నవారికి మాత్రమే వర్తింపు చేయనున్నారని పేర్కొన్నారు. మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తిని పెంచి జీడీపీ వృద్ధికి తోడ్పడేందుకు, నూతన ఆదాయపు పన్ను విధానం వైపు ప్రజలను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఈ ఆలోచన చేస్తోందని వివరించారు. బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి కొద్ది రోజుల ముందు ప్రభుత్వం ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కాగా, నూతన పన్ను విధానంలో రూ.15 లక్షలకు పైబడి వార్షిక ఆదాయం కలిగిన వారి నుంచి అత్యధికంగా 30% ఆదాయపు పన్ను వసూలు చేస్తున్నారు. దీన్ని 25 శాతానికి తగ్గించాలనే విజ్ఞప్తులను ప్రభుత్వం బడ్జెట్ రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోవడం లేదని మరో అధికారి వెల్లడించారు. అలాగే, పాత విధానంలో రూ.10 లక్షలకు పైబడి వార్షిక ఆదాయం కలిగిన వారి నుంచి ప్రస్తుతం 30% ఆదాయపు పన్ను వసూలు చేస్తున్నారు. ఈ పరిమితిని రూ.20 లక్షలకు పెంచాలనే వినతులను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదని తెలిపారు.

భూ వాతావరణంలోకి ఎల్‌వీఎం-3 ఎగువ దశ

» సురక్షితంగా హిందూ మహాసముద్రంలో పడేసిన ఇస్రో

సూళ్లూరుపేట, జూన్ 18: గతేడాది 36 ఉపగ్రహాలను మోసుకుని అంతరిక్షంలోకి వెళ్లిన ఎల్‌వీఎం-3 రాకెట్ ఎగువ దశను తిరిగి భూ వాతావరణంలోకి ప్రవేశపెట్టడంలో ఇస్రో విజయం సాధించింది. గతేడాది మార్చి 26న షార్ నుంచి ఎల్‌వీఎం-3 రాకెట్ ద్వారా వన్ వెబ్‌కు చెందిన 36 ఉపగ్రహాలను ఇస్రో శాస్త్రవేత్తలు 450 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఇవన్నీ ఇప్పుడు అంతరిక్షంలో తిరుగుతున్నాయి. అయితే.. ఈ ఉపగ్రహాలను మోసుకువెళ్లిన ఎల్‌వీఎం ఎగువ క్రయోజనిక్ దశ పరికరం కూడా వీటితో పాటే పరిభ్రమిస్తోంది. అంతరిక్షంలో వ్యర్థాల ముప్పు పెరుగుతుండడంతో కాలపరిమితి ముగిసిన ఉపగ్రహాలు, ఇతర ప్రయోగ పరికరాలను తక్కువ కక్ష్యలోకి చేర్చాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఎల్‌వీఎం-3 ఎగువ దశను బెంగళూరులోని ఉపగ్రహ నియంత్రణ కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు పర్యవేక్షిస్తూ, ఇందులోని ఇంధనాన్ని పూర్తిగా తొలగించి భూకక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఆ వ్యర్థాలను సురక్షితంగా హిందూ మహా సముద్రంలో పడేలా చేశారు. ఈ ప్రక్రియను శ్రీహరికోటలోని మల్టీ-ఆబ్జెక్ట్ ట్రాకింగ్ రాడార్ (ఎంవోటీఆర్) ట్రాక్ చేసినట్లు ఇస్రో అధికారికంగా ప్రకటించింది.

ఇంటర్ విద్యార్థులకు సర్కారు కానుక

(మొదటి పేజీ తరువాయి)

జారీ అయ్యాయి. గత ప్రభుత్వంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివినా పాఠ్య పుస్తకాలు ఉచితంగా ఇవ్వలేదు. ప్రభుత్వ కాలేజీల్లో సుమారు 2లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి పాఠ్య పుస్తకాలు ఇచ్చేందుకు రూ.15 కోట్లు అవుతుందని అప్పట్లో అంచనా వేశారు. ఆ నిధులను జగన్ ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి మంగళం పాడేశారు. కాగా ఈ ప్రభుత్వం పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు, బ్యాగులు కూడా ఉచితంగా ఇవ్వనుంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, హైస్కూల్ ప్లస్‌లలో ఫస్టియర్ విద్యార్థులు 108619 మంది, సెకండియర్ విద్యార్థులు 92134 మంది ఉన్నారు. వీరికి జూలై 15లోగా పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేయాలని ప్రభుత్వం తాజా ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. పాఠ్య పుస్తకాలను తెలుగు అకాడమీ, ప్రభుత్వ పాఠ్య పుస్తకాల డైరెక్టర్ ద్వారా సమకూర్చాలని, నోట్ పుస్తకాలు, బ్యాగులు అదనంగా కొనుగోలు చేయాలని ఆదేశించింది.

ఎల్లుండి నుంచి అసెంబ్లీ సమావేశాలు

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నూతన అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 21వ తేదీ నుంచి జరుగనున్నాయి. వీటిని రెండ్రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఖరారైన షెడ్యూల్ ప్రకారం.. శుక్రవారం (21వ తేదీ) తొలి రోజు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుంది. కొత్త ఎమ్మెల్యేలతో ప్రొటెమ్ స్పీకర్‌గా గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణ స్వీకారాలు చేయిస్తారు. ఆయన ఏడోసారి ఎమ్మెల్యేగా గెలిచి సభలోకి వచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తర్వాత ఈసారి సభలో ఆయనే సీనియర్ ఎమ్మెల్యే. సభ ప్రారంభానికి ముందు రోజు ఈ నెల 20వ తేదీన ప్రొటెమ్ స్పీకర్‌గా బుచ్చయ్యచౌదరితో గవర్నర్ అబ్దుల్ నజీర్ రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయిస్తారు. 22వ తేదీన స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. ఈ పదవికి టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడి పేరును చంద్రబాబు ఇప్పటికే ఖరారు చేశారు. ఉప సభాపతి పదవికి పేరును ఇంకా ఖరారు చేయాల్సి ఉంది. స్పీకర్ ఎన్నిక తర్వాత శాసనసభ నిరవధికంగా వాయిదా పడుతుంది. కొత్త శాసనసభను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించాల్సి ఉన్నప్పటికీ సమావేశాల ఎజెండాలో దానిని పెట్టలేదు. తిరిగి జూలైలో రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతాయి. అప్పుడు గవర్నర్ ప్రసంగం.. దానిపై చర్చ ఉంటాయని శాసనసభ వర్గాలు తెలిపాయి. ఈ నెల 24వ తేదీ సోమవారం నూతన మంత్రివర్గం తొలి భేటీ జరుగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశం జరుగుతుంది. ఈ మేరకు మంత్రులందరికీ సమాచారం పంపారు.

రాష్ట్రంలో 2 ఎమ్మెల్సీ స్థానాలకు ఉప ఎన్నిక

షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ

అమరావతి/న్యూఢిల్లీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసన మండలిలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల ఉప ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 25వ తేదీన ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుంది. అదే రోజు నామినేషన్ల దాఖలు ప్రక్రియ మొదలవుతుంది. వాటి దాఖలుకు జూలై 2ను తుది గడువుగా పేర్కొన్నారు. మర్నాడు నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు జూలై 5గా ఈసీ పేర్కొంది. అనివార్యమైతే జూలై 12వ తేదీన పోలింగ్ జరుగుతుంది. అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. వైసీపీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ రాజీనామా, మరో ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్యపై అనర్హత వేటుపడడంతో ఈ 2 ఎమ్మెల్సీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. కాగా.. కర్ణాటక, యూపీ, బిహార్‌లలో మూడు స్థానాలకు జూలై12న ఎన్నికలు జరుగనున్నాయి.

హైసెక్యూరిటీ పేపర్లనే వాడాలి

» గ్రామ, వార్డు సచివాలయశాఖ ఉత్తర్వులు

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ సమయంలో సచివాలయాలకు ఇచ్చిన హైసెక్యూరిటీ పేపర్లను మాత్రమే వాడాలని గ్రామ, వార్డు సచివాలయ శాఖ స్పష్టం చేసింది. హై సెక్యూరిటీ పేపర్లపై ఏపీ రాజముద్ర ఉన్న సర్టిఫికెట్లను మాత్రమే గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు అందజేయాలంటూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

తొలిసారి సచివాలయానికి పవన్

» సీఎం చాంబర్లో చంద్రబాబుతో భేటీ

» నేటి ఉదయం బాధ్యతల స్వీకారం



అమరావతిలో పవన్‌కు అపూర్వ స్వాగతం

దారిపొడవునా పూలవానతో నీరాజనం

సచివాలయానికి వస్తున్న పవన్‌కు స్వాగతం పలుకుతున్న అమరావతి రైతులు



డిప్యూటీ సీఎం పవన్ రాక సందర్భంగా సీడ్ యాక్సెస్ రోడ్డుపై పూలు పరిచిన అమరావతి రైతులు

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి హోదాలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మంగళవారం మధ్యాహ్నం మొదటిసారి అమరావతి సచివాలయంలో అడుగుపెట్టారు. తన చాంబర్ ఉన్న రెండో బ్లాకు ప్రభుత్వ ఉద్యోగులతో నిండిపోవడంతో దానిని పరిశీలించకుండానే.. ఆయన మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్‌తో కలిసి నేరుగా సీఎం చంద్రబాబు చాంబరుకు వెళ్లారు. రాష్ట్ర సచివాలయానికి.. అందునా తన చాంబరుకు తొలిసారి వచ్చిన తన డిప్యూటీ పవన్ కల్యాణ్‌ను.. చంద్రబాబు తన సీటులో నుంచి లేచి ఆలింగనం చేసుకుని ఆహ్వానించారు. పవన్ ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. తర్వాత వారిద్దరూ సుమారు గంటపాటు విడిగా అదే చాంబర్లో చర్చించుకున్నారు. చంద్రబాబు కార్యాలయ గది బాగుందని పవన్ ప్రశంసించారు. ఆ గదిలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చిహ్నం చూపించి.. దానికి మీరు హుందాతనం తెచ్చారని చంద్రబాబుతో అన్నారు. తర్వాత వారిద్దరూ ప్రభుత్వం.. పాలన, రాజకీయపరమైన అంశాలపై మాట్లాడుకున్నారు. ఆ తర్వాత అందుబాటులో ఉన్న మంత్రులను చాంబర్లోకి ఆహ్వానించారు. టీడీపీకి చెందిన మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, పొంగూరు నారాయణ, గొట్టిపాటి రవికుమార్.. జనసేన మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్ వచ్చారు. పవన్ చేపట్టనున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన అంశాలు, జగన్ పాలనలో పంచాయతీల పాలన కుంటుపడడం.. గ్రామాల్లో విపరీతంగా పేరుకుపోతున్న చెత్త గుట్టల సమస్యను పరిష్కరించే మార్గాలు.. గ్రామాల్లో సమస్యలు వంటివి ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. సుమారు రెండు గంటలపాటు చంద్రబాబు చాంబర్లో పవన్ గడిపారు. అంతకు ముందు ఉప ముఖ్యమంత్రిగా తొలిసారి అమరావతిలో అడుగుపెట్టిన పవన్‌కు.. రాజధాని రైతులు అపూర్వ స్వాగతం పలికారు. జనసేన కార్యాలయం నుంచి బయల్దేరిన ఆయన్ను తాడేపల్లి నుంచి మందడం వరకూ పూల వర్షంలో ముంచెత్తారు.

సచివాలయంలో సందడే సందడి

ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ సచివాలయంలోకి రావడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. మందడం నుంచి ఆయన సచివాలయంలోకి ప్రవేశించగానే ఉద్యోగులంతా ఆయన్ను చూసేందుకు నాలుగు బ్లాకుల నుంచీ బయటకు వచ్చారు. ఘనంగా స్వాగతం పలికారు. జై పవన్, జై జనసేన అంటూ వారు నినాదాలు చేశారు. ఆయన వాస్తవానికి రెండో బ్లాకులో తనకు కేటాయించిన చాంబరును పరిశీలించడానికి వచ్చారు. కానీ ఆయన రెండో బ్లాకు వద్దకు వచ్చేసరికి ఆ ప్రాంతమంతా ఉద్యోగులతో నిండిపోయింది. దీంతో తన చాంబరును పరిశీలించకుండానే మొదటి బ్లాకుకు వెళ్లి సీఎంను కలిశారు. కాగా.. ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ బుధవారం ఉదయం 11 గంటల తర్వాత బాధ్యతలు తీసుకుంటారని మంత్రి కందుల దుర్గేశ్ విలేకరులకు తెలిపారు.

ప్రభుత్వ సొమ్ముతో కొన్నవన్నీ అప్పగించండి

» మాజీ సీఎం జగన్‌కు జీఏడీ లేఖ

» సమాధానం ఇవ్వని జగన్‌రెడ్డి కార్యాలయం

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సొమ్ముతో కొనుగోలు చేసిన ఫర్నిచర్, ఎలక్ట్రికల్ వస్తువులు వెంటనే తమకు అప్పజెప్పాలని మాజీ సీఎం జగన్‌ను సాధారణ పరిపాలన శాఖ కోరింది. జగన్ సీఎంగా ఉన్నప్పుడు రూ.కోట్లు విలువైన ఫర్నిచర్, ఎలక్ట్రికల్ వస్తువులను తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి కొనుగోలు చేయించారు. నిబంధనల ప్రకారం పదవి నుంచి దిగిపోయిన 15 రోజుల వ్యవధిలో ప్రభుత్వ వ్యయంతో కొనుగోలు చేసిన వస్తువులు మొత్తం ఆయన తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నివాసంలో ఉంటే ఆ వస్తువులు మొత్తం అక్కడే ఉంచేసి ఆ నివాసాన్ని ఖాళీ చేయాల్సి ఉంటుంది. కానీ జగన్ ఇప్పటి వరకూ ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. పైగా తన పార్టీ నాయకులతో డబ్బులు చెల్లిస్తామని చెప్పిస్తున్నారు. దీంతో సాధారణ పరిపాలన శాఖ రంగంలోకి దిగి వెంటనే ఆ ఫర్నిచర్, టీవీలు, ఎలక్ట్రికల్ వస్తువులు మొత్తం ప్రభుత్వానికి అప్పగించాలని ఆదేశించింది.

మంత్రులకు చాంబర్ల కేటాయింపు

» 2వ బ్లాకులో పవన్, జనసేన మంత్రులు

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహా మంత్రులందరికీ సాధారణ పరిపాలన శాఖ సచివాలయంలో చాంబర్లు కేటాయించింది. పవన్‌కు రెండో బ్లాకులోని తొలి అంతస్తులో చాంబరు కేటాయించారు. ఏ బ్లాకులో ఎవరంటే..

రెండో బ్లాకు-గ్రౌండ్ ఫ్లోర్: పి.నారాయణ (పురపాలక), వంగలపూడి అనిత (హోం), ఆనం రామనారాయణరెడ్డి (దేవదాయ).

రెండో బ్లాకు-మొదటి అంతస్తు: పవన్ కల్యాణ్ (ఉపముఖ్యమంత్రి), పయ్యావుల కేశవ్ (ఆర్థిక), నాదెండ్ల మనోహర్ (పౌర సరఫరాలు), కందుల దుర్గేశ్ (పర్యాటక).

మూడో బ్లాకు-మొదటి అంతస్తు: గొట్టిపాటి రవికుమార్ (విద్యుత్), కొల్లు రవీంద్ర (ఎక్సైజ్,గనులు), డోలా బాలవీరాంజనేయస్వామి (సాంఘిక సంక్షేమం), గుమ్మిడి సంధ్యారాణి (మహిళా, గిరిజన సంక్షేమం), ఎన్ఎండీ ఫరూక్ (న్యాయ, మైనారిటీ).

నాలుగో బ్లాకు-గ్రౌండ్ ఫ్లోర్: అనగాని సత్యప్రసాద్ (రెవెన్యూ), అచ్చెన్నాయుడు (వ్యవసాయ), ఎస్.సవిత (బీసీ సంక్షేమం), టీజీ భరత్ (పరిశ్రమలు), లోకేశ్ (విద్య,ఐటీ), ఎం.రాంప్రసాద్‌రెడ్డి (రవాణా), కొలుసు పార్థసారథి (గృహనిర్మాణం-సమాచార పౌరసంబంధాలు), నిమ్మల రామానాయుడు (జలవనరులు)

ఐదో బ్లాకు-గ్రౌండ్ ఫ్లోర్: బీసీ జనార్దన్‌రెడ్డి (రోడ్లు-భవనాలు), కొండపల్లి శ్రీనివాస్ (ఎంఎస్ఎంఈ, సెర్ప్), వాసంశెట్టి సుభాష్ (కార్మిక), సత్యకుమార్ యాదవ్ (వైద్య ఆరోగ్యం).

జగన్ నిర్వాకంపై జనంలోకి!

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే చర్చ ఇప్పుడు జల వనరుల శాఖలో సాగుతోంది.

అంతా ఆయనే చేశారు...

పోలవరం ప్రాజెక్టుపై జగన్ నిర్వాకాలను జలవనరుల శాఖ అధికారులు బట్టబయలు చేశారు. 2019 మే నుంచి 2024 మే దాకా గడచిన ఐదేళ్లలో పెట్టిన ఖర్చు కేవలం 4,996.53 కోట్లు మాత్రమేనని సోమవారం పోలవరం ప్రాజెక్టు వద్ద సీఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్షలో వెల్లడించారు. ఇందులో రూ.2,697 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారని చెప్పారు. 'కుడి కాలువ, ఎడమ కాలువ, హెడ్‌వర్క్స్‌లో గడచిన ఐదేళ్లలో పురోగతే లేదు. 2019 తర్వాత పనుల పురోగతి నాలుగు శాతానికి మించి కూడా లేదు' అని పేర్కొన్నారు. పనుల పురోగతి లేకపోగా తిరోగమనంలో ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రాజెక్టులో వివిధ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లకు ఈ ఏడాది డిసెంబరు దాకా అంతర్జాతీయ నిపుణుల కమిటీ ఆమోద ముద్ర వేసే అవకాశాల్లేవని కూడా వెల్లడించారు. ఇక పోలవరం హెడ్‌వర్క్స్ నిర్మాణ పనులను చేపట్టిన సంస్థను మార్చేయాలన్న నిర్ణయం పూర్తిగా జగన్‌దేనని సీఎం చంద్రబాబుకు అధికారులు తెలియజేశారు. రివర్స్ టెండర్ నిర్ణయానికి బాధ్యులెవరని ఆయన అడిగినప్పుడు.. తాము కాదని జల వనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, 2019 మే నెలలో ఇంజనీర్-ఇన్-చీఫ్(ఈఎన్‌సీ)గా విధులు నిర్వహిస్తున్న ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. 2019 మే నెలలో తాను జల వనరుల శాఖ బాధ్యతల్లో లేనని శశిభూషణ్ చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు అప్పటికి జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ రివర్స్ టెండర్ విధానాన్ని అమలు చేశారని వెల్లడించారు. ఆ సమయంలో మీరు ఈఎన్‌సీగా ఉన్నారు కదా అని వెంకటేశ్వరరావును చంద్రబాబు ప్రశ్నించగా.. తాను ఈఎన్‌సీగా ఉన్నప్పటికీ, పోలవరం బాధ్యతల నుంచి తనను తప్పించారని.. పోలవరం చీఫ్ ఇంజనీర్ సుధాకరబాబుకే బాధ్యతలన్నీ కట్టబెట్టారని ఆయన వివరించారు. రివర్స్ టెండర్ విధానం అమలును ఆదిత్యనాథ్ దాస్, సుధాకరబాబు చూశారని చెప్పారు. ఇప్పుడు జగన్ ముఖ్యమంత్రి పదవి కోల్పోగా.. ఆదిత్యనాథ్, సుధాకరబాబు రిటైరయ్యారని చెప్పారు. రివర్స్ టెండర్ విధానంలో మేఘా ఇంజనీరింగ్ సంస్థకు పోలవరం ప్రాజెక్టు పనులతో పాటు జల విద్యుత్కేంద్రం నిర్మాణ బాధ్యతలు కూడా అప్పగించారని తెలిపారు. 2019, 2020ల్లో గోదావరికి వచ్చిన భారీ వరదకు డయాఫ్రం వాల్ దెబ్బతిందని అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. గైడ్‌బండ్ కూడా కుంగిపోయిందని.. ఇందుకు కారణాలు తెలుసుకోవడానికి కేంద్రం నిజనిర్ధారణ కమిటీ వేసిందని తెలిపారు.

గడచిన ఐదేళ్లలో జగన్ సర్కారు చేపట్టిన పనులు..

వివరాలు	మే 2019 నాటి ప్రగతి	మే 2024 నాటికి ఐదేళ్లలో పరిస్థితి
సివిల్‌వర్క్స్	71.93%	3.84%
హెడ్‌వర్క్స్	65.67%	6.96%
కుడి ప్రధాన కాలువ	91.14%	1.61%
ఎడమ ప్రధాన కాలువ	70.99%	2.08%
భూసేకరణ, పునరావాసం	18.66%	3.89%
మొత్తంగా ప్రగతి	38.21%	11.59%

పోలవరం ప్రాజెక్టు ప్రస్తుత స్థితి..

వివరాలు	31.05.24 నాటి ప్రగతి
హెడ్ వర్క్స్	72.63%
ఎడమ ప్రధాన కాలువ	73.07%
కుడి ప్రధాన కాలువ	92.75%
మొత్తం నిర్మాణాలు	75.77%
భూసేకరణ, సహాయ పునరావాసం	22.55
మొత్తం ప్రాజెక్టు	49.79%

జగన్ సర్కారు పెండింగ్‌లో ఉంచిన బిల్లులు (రూ.కోట్లలో)

పనులు	1633
భూసేకరణ	255
సహాయ పునరావాసం	603
హెచ్‌టీసీసీ	206
మొత్తం	2697

తాను గెలవలేక ఈవీఎంలు 'ఓడు!'

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్యాన్ని, ప్రజల తీర్పునూ అపహాస్యం చేశారని విమర్శించారు. అదే 2024లో ప్రజలు వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ఓడించడంతో తట్టుకోలేక.. వారి ఆప్యాయత, అభిమానం ఏమయ్యాయోనని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఈవీఎంలపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మాట తప్పను.. మడమ తిప్పనని పదే పదే చెప్పుకొనే జగన్ తీరు చూసి ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతోందని రాజకీయ వర్గాలు విమర్శిస్తున్నాయి. ఓటమిని జీర్ణించుకోలేక ప్రజాతీర్పును కించపరుస్తూ.. తప్పంతా ఈవీఎంలపై నెట్టేయడంపై సొంత పార్టీ నేతలే మండిపడుతున్నారు. ఓటమికి కారణాలను విశ్లేషించుకుని వాటిని సరిదిద్దుకోకపోగా.. కుంటిసాకులు చెబితే జనం నమ్మరని వారు అంటున్నారు. ఎన్నికల్లో ఓటమి రుచి చూసిన ఆ పార్టీ నేతలంతా ఇందుకు జగనే కారణమని.. ఆయన తప్పుడు విధానాల వల్లే ఓడిపోయామని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును అమలు చేయవద్దని ఎంత చెప్పినా జగన్ వినలేదని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి బాహాటంగానే అన్నారు. గడప గడపకూ పర్యటించినప్పుడు ఈ చట్టంపై ప్రజాగ్రహం పెద్దఎత్తున వ్యక్తమైందని.. ఈ యాక్టు అమలు నిర్ణయమే తమ కొంప ముంచిందని మెజారిటీ అభ్యర్థులు నెత్తీనోరూ బాదుకుంటున్నారు. మహిళలు వైసీపీపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని.. కూటమికి సానుకూలంగా ఓట్లు వేశారంటూ పోలింగ్ తర్వాత జగన్‌ను తాడేపల్లిలో కలసినప్పుడు ఉత్తరాంధ్ర జిల్లాకు చెందిన ఒక మంత్రి చెప్పారు. కానీ ఆయన పట్టించుకోలేదు. గతంలో గెలిచిన 151 సీట్ల కంటే ఎక్కువే వస్తాయని దబాయించారు. నాసిరకం మద్యం, ఇసుక విధానం కొంప ముంచుతున్నాయని ఎప్పటి నుంచో చెబుతున్నా ఆయన వినలేదు, పట్టించుకోలేదు. ఇప్పుడు తమకు 11 సీట్లే ఇవ్వడంతో తట్టుకోలేక తప్పంతా ఈవీఎంలదే అన్నట్లు మాట్లాడుతున్నారు. ఇదే నిజమైతే 2019లో ఆయన గెలుపు ఈవీఎంలను తారుమారు చేయడం వల్లే వచ్చిందా అని రాజకీయ వర్గాలు నిలదీస్తున్నాయి. జగన్ రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నాయి.

పోలవరం ప్రాజెక్టు ఎవరికీ అర్థం కాదు

» ఎందుకంటే నాకే అర్థం కాలేదు

» మాజీ మంత్రి అంబటి రాంబాబు వింత వ్యాఖ్యలు

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తనకు అర్థం కాలేదు కాబట్టి.. పోలవరం సబ్జెక్ట్ ఇంకెవరికీ అర్థం కాదని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. అంతేకాదు.. ఈ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేమని తొలిసారిగా చెప్పిన గొప్పతనం కూడా తనదేనని గొప్పగా చెప్పుకొన్నారు. సీఎం చంద్రబాబు తాజాగా పోలవరంలో పర్యటించి.. వైసీపీ ప్రభుత్వం వల్లే ప్రాజెక్టు ఆలస్యమైందని విమర్శించారు. ఈ నేపథ్యంలో అంబటి రాంబాబు మంగళవారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'పోలవరం ప్రాజెక్టు వెరీ వెరీ కాంప్లికేటెడ్ సబ్జెక్ట్. అది ఎవరికీ అర్థం కాదు. ఎందుకంటే నాకే అర్థం కాలేదు. పోలవరం ప్రాజెక్టుకు ఎన్నోసార్లు వెళ్లాను. ఎంతో మంది నిపుణులను అడిగాను. అయినా నాకు అర్థం కాలేదు' అన్నారు. కాఫర్ డ్యామ్‌లు నిర్మించకుండా డయాఫ్రమ్‌వాల్ కట్టినందునే దెబ్బతిన్నదని అంబటి సూత్రీకరించారు. అంబటి వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2019లో వైసీపీ అధికారపగ్గాలు చేపట్టాక.. 2020 డిసెంబరు నాటికి, 2021 ఆగస్టు నాటికి.. 2022 డిసెంబరు నాటికల్లా పోలవరం ప్రాజెక్టుని పూర్తిచేస్తామంటూ డెడ్‌లైన్లు విధిస్తూ వచ్చింది తప్ప.. చేసిందేమీ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ప్రకటనలు చేసిన రోజున కాఫర్‌డ్యామ్ నిర్మించలేదని తెలియదా అని నిపుణులు నిలదీస్తున్నారు. పోలవరానికి జగన్ హయాంలో ఎంత వ్యయం చేశారో వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. అంతా అయిపోయాక.. పోలవరం ప్రాజెక్టు కాంప్లికేటెడ్ అంటూ అంబటి గొంతు చించుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.



దివ్యాంగుల సమస్యలు వింటున్న లోకేశ్

కష్టాలు తీరుస్తా.. అండగా ఉంటా..

» ప్రజాదర్బార్‌కు వచ్చిన వారికి లోకేశ్ భరోసా

తాడేపల్లి టౌన్, జూన్ 18: ప్రజాదర్బార్‌తో కష్టాల్లో ఉన్న ప్రజలకు స్వాంతన లభిస్తోంది. వివిధ సమస్యలపై తనని కలవడానికి ఉండవల్లిలోని సీఎం నివాసం వద్దకు వస్తున్న ప్రజలకు యువనేత, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ 'మీ కష్టాలు తీరుస్తా.. అండగా ఉంటా..' అంటూ భరోసా ఇస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సమస్యలు చెప్పుకొనేందుకు సీఎం జగన్ నివాసం వద్దకు వెళ్లిన ప్రజలకు నిరాశే ఎదురయ్యేది. కానీ, ఇప్పుడు ఎటువంటి ఆంక్షలు లేకుండానే నేరుగా సీఎం చంద్రబాబు నివాసానికి చేరుకుని లోకేశ్‌కు తమ సమస్యలు విన్నవించుకుంటున్నారు. ఆంక్షలు విధించకుండా లోపలికి పంపించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను సావధానంగా వింటున్న యువనేత వారందరికీ మనోధైర్యాన్నిస్తూ అండగా ఉంటానని భరోసా ఇస్తున్నారు.

పింఛన్లు, ఇళ్లస్థలాలు ఇప్పించండి..

మంగళగిరికి చెందిన 70 ఏళ్ల గుంటూరు వెంకటసుబ్బమ్మ తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయించి ఆదుకోవాలని మంగళవారం లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. తాడేపల్లి సుందరయ్యనగర్‌కు చెందిన బి దుర్గాప్రసాద్ తమకు ఇంటిపట్టా ఇప్పించాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. మంగళగిరికి చెందిన చిల్లపల్లి వీరమ్మ తల్లిలేని తన మనవడి చదువుకు ఆర్థిక సాయం చేయాలని కోరారు. టి జయమణి అనే మహిళ తనకు ఆపేసిన ఒంటరి మహిళ పెన్షన్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికురాలైన తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని మంగళగిరి కొప్పురావూరు కాలనీకి చెందిన గంజి లత విజ్ఞప్తి చేశారు. మీ-సేవ వ్యవస్థపై ఆధారపడిన వారికి తగిన న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ మీ-సేవ సంస్థ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ ఉద్యోగులపై నమోదు చేసిన 1,600 కేసులను రద్దు చేయాలని అసోసియేషన్ ప్రతినిధులు లోకేశ్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయుష్మాన్ హెల్త్ క్లినిక్‌లలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయడంతోపాటు 23 శాతం వేతన సవరణ, 9 నెలల జీతాలు పెండింగ్ వంటి సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎంసీపీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. బీటెక్ చదివిన తన కుమారుడికి ఉద్యోగం కల్పించాలని మంగళగిరికి చెందిన వి దుర్గామల్లేశ్వరి కోరారు.

ఇక అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి!

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నాడు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అంతకుముందున్న ప్రభుత్వ పథకాల పేర్లను తీసేసింది. చివరకు షెడ్యూలు కులాల విద్యార్థుల విదేశీ విద్యను దృష్టిలో ఉంచుకుని తెలుగుదేశం ప్రభుత్వం తెచ్చిన 'అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి' పథకంలోని అంబేడ్కర్ పేరును సైతం తొలగించింది. దానిని 'జగనన్న విదేశీ విద్యా దీవెన'గా మార్చివేసింది. తిరిగి అధికారంలోకి రాగానే టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు పేరు ప్రక్షాళనకు పూనుకుంది. ఆ పథకానికి గతంలో ఉన్న పేరునే కొనసాగిస్తూ ఆదేశాలు జారీచేసింది. నాడు జగన్ పలు సంక్షేమ పథకాలకు తండ్రి వైఎస్ఆర్ పేరు, తన పేరును జోడించేవారు. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రజలు సులభంగా తెలుసుకునేలా ఆయా పథకాల పేర్లను మార్చాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి.


అమ్మో...అంత ఖర్చా!

రుషికొండపై నిర్మాణాలకు భారీ వ్యయం

- చదరపు అడుగుకు ఏకంగా రూ.30 వేలు
- స్టార్ హోటల్ పేరుతో నిర్మాణం ప్రారంభం
- పర్యాటకులకు ఒక్క రూమ్ లేకుండా భవనాల పూర్తి
- స్టార్ హోటళ్లలో కోటికి అన్ని హంగులతో రూమ్
- రూ.450 కోట్లకు రావలసిన రూమ్‌లు 450
- కానీ నిర్మించినవి కేవలం 12 బెడ్ రూమ్‌లే

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రుషికొండపై పర్యాటక భవనం పేరుతో చేపట్టిన నిర్మాణం, దానికి వెచ్చించిన వ్యయం చూసి విశాఖపట్నంలో బిల్డర్లు ఆశ్చర్యపోతున్నారు. కేవలం ఏడు భవనాలలో 1,48,413 చదరపు అడుగుల బిల్టప్ ఏరియాకు రూ.450 కోట్లు ఎలా ఖర్చు చేశారని తెల్ల ముఖాలు వేస్తున్నారు. విశాఖలో ఇటీవల కాలంలో నిర్మించిన స్టార్ హోటళ్లు చాలా ఉన్నాయి. రుషికొండలో జగన్ ప్యాలెస్‌కు కేవలం కిలో మీటరు ముందు రాడీసన్ బ్లూ హోటల్ ఉంది. అక్కడ ఒక్కో సూట్ రూమ్ నిర్మాణానికి ఫర్నిషింగ్‌తో సహా రూ.కోటి వ్యయం అయింది. పదేళ్ల క్రితం ఆర్కే బీచ్ రోడ్డులో నిర్మించిన నోవాటెల్‌కు అప్పట్లో రూమ్‌కి రూ.60 లక్షల వ్యయం అయింది. స్టార్ హోటళ్లలో సగటున ఒక్కో రూమ్ వేయి చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. అంటే కామన్ ఏరియా, రెస్టారెంట్, బాంకెట్ హాళ్లు, జిమ్‌లు, స్విమ్మింగ్‌పూల్స్ అన్నీ కలుపుకొని రూమ్‌కు వేయి చదరపు అడుగుల విస్తీర్ణం వస్తుంది. అలా ఒక్కో రూమ్‌కు బెడ్, బాత్‌రూమ్ టబ్, సోఫాలు, టీవీ, ఫర్నీచర్ అన్నీ కలిపి రూ.కోటి వ్యయం అవుతుందని విశాఖలో పేరొందిన బిల్డర్లు చెబుతున్నారు. ఆ లెక్కన చూసుకుంటే చదనపు అడుగు రూ.10 వేలు ఖర్చు అవుతుంది. ఇలా చూస్తే, రుషికొండపై వెచ్చించిన రూ.450 కోట్లకు 450 రూమ్‌లు అన్ని హంగులతో రావాలి. కానీ అక్కడ జగన్ కుటుంబం కోసం నిర్మించుకున్న 12 బెడ్‌రూమ్‌లు తప్ప ఇంకేమీ లేవు. మిగిలినవన్నీ సమావేశ మందిరాలు. అలాంటి వాటికి చదరపు అడుగు ఒక్కింటికి రూ.30 వేలు ఖర్చు చేశారు. ఆ వ్యయానికి తగిన ఆనవాళ్లు మాత్రం రూమ్‌ల రూపంలో అక్కడ లేవు. చదరపు అడుగుకు రూ.10 వేలు అవ్వాల్సినచోట 2 రెట్లు అధికంగా అంటే రూ.30 వేలు ఎక్కువ ఖర్చు చేశారు. ఇదంతా ప్రజాధనం. బిల్డర్ల లెక్కల ప్రకారం 1,48,315 చదనపు అడుగుల బిల్డప్ ఏరియాకు రూ.150 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుంది. కానీ లెక్కలు చూపిస్తున్నది రూ.450 కోట్లకు. అంటే, బయటకు చెప్పింది ఒకటి.. లోపల చేసింది మరొకటి.



రుషికొండపై నిర్మించిన భవంతిలో బెడ్ రూమ్

'ప్యాలెస్'పై ప్రజాభీష్టమే!

- రుషికొండ భవనాల వినియోగంపై అన్నికోణాల్లో ఆలోచించి అడుగులు
- వైసీపీ నేతలకు పార్టీలోకి 'నో ఎంట్రీ'
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా



విశాఖపట్నం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తాజా మాజీ సీఎం జగన్.. రుషికొండపై నిర్మించిన ప్యాలెస్‌ను ఎలా విని యోగించుకోవాలనే విషయంపై అన్ని కోణాల్లోనూ ఆలోచన చేస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ప్యాలెస్ విషయంలో ప్రజాభీష్టం మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. మంగళవారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రుషికొండపై నిర్మించిన ప్యాలెస్ కోసం గత ప్రభుత్వం రూ.700 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిందన్నారు. ఈ నిర్మాణాలపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారని తెలిపారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన వెంటనే అమరావతిపై దృష్టి పెట్టారని, పనుల్లో కదలిక వచ్చిందన్నారు. ఏడాదిలోపే అమరావతికి ఒక రూపు తీసుకువస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును జగన్ సర్వనాశనం చేశారని విమర్శించారు. వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలపై అన్యాయంగా కేసులు పెట్టారని, వీటిపై సమీక్షించి 100 రోజుల్లో ఎత్తివేతకు చర్యలు తీసుకుంటామని పల్లా తెలిపారు. క్రిమినల్ కేసులు, ప్రధానంగా కోర్టులో ఉన్న కేసులు తప్ప రాజకీయ పరమైన కేసులు ఎత్తివేసి కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు.

టోల్ ఎత్తివేత

విశాఖ నగర శివారులో ఉన్న అగనంపూడి టోల్‌గేటును నెల రోజుల్లో ఎత్తివేసేలా చర్యలు చేపట్టామని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు త్వరలో కేంద్రం నుంచి ప్రకటన వస్తుందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తాము చేసిన పోరాటానికి ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని స్పష్టంచేశారు. వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు విశాఖలో దోచుకున్న, బెదిరించి లాక్కున్న భూములను వెనక్కి తీసుకుంటామని పల్లా తెలిపారు. దసపల్లా భూములు, సీబీసీఎన్‌సీ భూములు, హయగ్రీవ, ఎన్‌సీసీ భూములను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తామన్నారు. అక్రమాలకు పాల్పడిన మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జి. వెంకటేశ్వరరావు తదితరులను టీడీపీలో చేర్చుకునే ప్రసక్తే లేదన్నారు.

వైసీపీ వనిత.. కోట్లలో మేత!?

- పనిని బట్టి రేటు కట్టిన వైనం
- ఎవరు ఎక్కువ ఇస్తే వారికే 'పని'
- భారీగా దండుకున్న మాజీ 'హోం'
- 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్ చేసి బాధితుల ఆవేదన

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



వైసీపీ హయాంలో మహిళా మంత్రులు సైతం అవినీతి బాట పట్టారు. ఇప్పటికే మాజీ మంత్రి రోజా రూ.100 కోట్ల వరకు అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ కోవలోనే మాజీ హోం మంత్రి తానేటి వనిత అధికారాన్ని అడ్డుపెట్టుకొని మేసిన 'మేత' బయటకు వస్తోంది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో తానేటి వనిత ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జగన్ ప్రభుత్వంలో మహిళా శిశు సంక్షేమ శాఖ తర్వాత హోం మంత్రిగా రెండున్నరేళ్ల చొప్పున ఐదేళ్లు మంత్రి పదవిలో ఉన్నారు. ఈ రెండు శాఖల్లో భారీగా అవినీతి జరిగినట్టు ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తోంది. ఆమె చక్కబెట్టిన సొంత శాఖ(హోం)లోని పోలీసులే... "బాబోయ్.. ఆ అవినీతి అంతా ఇంతా కాదు. చేతికి మట్టి అంటకుండా సింగిల్ విండో విధానంలో వసూళ్లను కొత్తపుంతలు తొక్కించారు" అని వాపోతున్నారు. వివిధ పనుల కోసం ఆమె నిర్ణయించిన ధరలు ఆకాశాన్నంటేవని తలుచుకుని హడలిపోతున్నారు. ఈ క్రమంలో తాము సొమ్ములు ఇచ్చినా సదరు పని జరగలేదని.. కాబట్టి వాటి నిమిత్తం తీసుకున్న సొమ్మును తిరిగి ఇవ్వాలని కోరుతున్నారు. పోలీసు శాఖలో తప్పు చేసిన వారికి చార్జి మెమోలు ఇవ్వడం సాధారణం. అయితే.. వీటివల్ల సదరు అధికారులు, సిబ్బంది ప్రమోషన్లు, ఇతర శాఖాపరమైన ప్రయోజనాల విషయంలో ఇబ్బందులు తలెత్తుతాయి. దీంతో చార్జిమెమోలను డ్రాప్ చేయించుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా పదుల సంఖ్యలో అధికారులు నాటి హోం మంత్రి తానేటి వనితను ఆశ్రయించారు. దీంతో ఆమె రేటు కట్టి.. బయానా కింద రూ.కోట్లలో వసూలు చేసినట్టు సమాచారం. అయితే.. సదరు అధికారులకు ఎలాంటి ఊరటా లభించలేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు వారు లబోదిబోమంటున్నారు.

గుడ్డును కూడా గోకేశారు!

జగన్ హయాంలో తొలి రెండున్నరేళ్లు తానేటి వనిత స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ సమయంలో కోడి గుడ్ల నుంచీ ప్రతి దానిపై ఓ రేటు పెట్టి వసూలు చేసేవారని విమర్శలు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలకు సరఫరా చేసే గుడ్డుపై 2 పైసలు తీసుకునే దందా నడిచింది. ఆ సమయంలోనే ఓ బిల్డరు నుంచి ఆమె రూ.70 లక్షలు వడ్డీకి తీసుకున్నారు. అయితే, కేవలం 3 నెలల్లో సొమ్ము మొత్తం వెనక్కి ఇచ్చేయడం ఆశ్చర్యానికి గురిచేసింది. వనిత హయాంలో జరిగిన అవినీతిపై గోడు వెళ్లబోసుకునేందుకు బాధితులు కొందరు సోమవారం తూర్పుగోదావరి ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. అయితే, ఆ రోజు బక్రీద్ కావడంతో ఎస్పీ అందుబాటులో లేరు. దీంతో వారంతా వెనుదిరిగారు. వనిత తమ్ముడు కుమార్‌పై కేసు నమోదయ్యే అవకాశముందని, నేడో రేపో అరెస్టు కూడా ఉంటుందనే చర్చ విస్తృతంగా నడుస్తోంది.

అక్రమాలకు రెడ్ కార్పెట్!

వైసీపీ హయాంలో అక్రమాలకు ఎప్పుడూ ద్వారాలు తెరిచే ఉండేవి. ఈ క్రమంలో నాటి హోం మంత్రి వనిత కూడా 'సింగిల్ విండో' విధానాన్ని అమలు చేశారు. ఆమె తరపు కుటుంబసభ్యులు నలుగురు కౌంటర్లు తెరిచి డబ్బులు వసూళ్లు చేసేవారనేది బహిరంగ రహస్యం. పోలీస్ శాఖలో చార్జ్‌మెమోలు, పనిష్ మెంట్లు డ్రాప్ చేయడానికి రూ.లక్షల రేటు పెట్టారని తెలిసింది. పదోన్నతికి అడ్డుగా ఉండే సాంకేతిక అంశాలను క్లియర్ చేయడానికి మరింత రేటు చెల్లించాల్సి వచ్చేది. ఉన్నతాధికారులు ఎంతటి కఠిన చర్యలకు ఉపక్రమించినా 'హోం' వద్దకు వెళితే ఆ తప్పు డబ్బుతో 'ఒప్పు' అయిపోయేది. చిన్న మెమో, పనిష్‌మెంట్ క్లియర్ చేయడానికి కూడా కనిష్ఠంగా రూ.లక్ష రేటు పెట్టారని పోలీసు వర్గాలే చెబుతున్నాయి. మూడు, నాలుగు ఇంక్రిమెంట్లు పోయే పరిస్థితి నుంచి కాపాడడం, సర్వీసు నుంచి తొలగింపు వంటివి రద్దు చేయడం, కావాల్సిన చోటకు పోస్టింగులు ఇప్పించడం వంటివి వనితకు భారీగా 'సంపాయించి' పెట్టాయని తెలుస్తోంది.

'ఆంధ్రజ్యోతి'కి ఫోన్లు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత.. తమ డబ్బులు వెనక్కి ఇవ్వాలని వనితకు సొమ్ములు ముట్టజెప్పిన బాధితులు నిలదీయడం ప్రారంభించారు. అయితే.. సొమ్ములు వసూలు చేసిన మాజీ మంత్రి వనిత కుటుంబానికి చెందిన 'ఆ నలుగురు' ముఖం చాటేస్తున్నారని బాధిత పోలీసులు చెబుతున్నారు. వనిత తమ్ముడు జొన్నకూటి కుమార్ ఫోన్ స్విచాఫ్ చేశారని ఓ బాధిత అధికారి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. నిలదీస్తున్న వారికి రూ.10 వేలు, రూ.20 వేలు ఇస్తున్నారని తెలిపారు.

ఎక్కువిచ్చిన వారే మక్కువ!

తానేటి వనిత హోం మంత్రిగా ఉన్న సమయంలో ఎవరు ఎక్కువ సొమ్ములు ఇస్తే వారికే 'పని' జరిగేదని టాక్. తూర్పుగోదావరి జిల్లాలో ఓ సీఐ పోస్టింగ్ కోసం రూ.10 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. మరో సీఐ అంతకంటే ఎక్కువ ఇవ్వడంతో ఆయనకు ఆ సీటు దక్కింది. మాజీ హోం మంత్రితో పని నిమిత్తం బేరం కుదిరిన తర్వాత కొంత మొత్తం బయానా కింద చెల్లించే విధానం అమలు చేశారు. మిగతా సొమ్ము నోట్ ఫైల్ సంతకానికి ముందు ఇచ్చేయాలి. ఆ డబ్బులు అందకపోతే నోట్ ఫైల్‌పై 'నో' అని రాసేస్తారు. శాఖలో అంతర్గతంగా జరిగే వ్యవహారం కాబట్టి బయటకి పొక్కేది కాదు. అయితే, ఇటీవల జరిగిన ఎన్నికలకు ముందు వసూళ్ల వేగం పెంచారు. మళ్లీ తామే అధికారంలోకి వస్తామని, తానే హోంమంత్రి అవుతానంటూ మిగతా సొమ్ములు కూడా ఇచ్చేస్తే 'పని' పూర్తవుతుందని ఒత్తిడి తీసుకురావడంతో ఆయా అధికారులు సొమ్ములు ముట్టజెప్పారు. ఇలా గుంటూరు జిల్లాకు చెందిన ఓ సీఐ రూ.10 లక్షలు, మరో సీఐ రూ.13 లక్షలు, మెమో డ్రాప్ చేయడానికి హెచ్‌సీ నుంచి రూ.లక్ష, ఉమ్మడి తూర్పుగోదావరిలోని ఓ సీఐ రూ.30 లక్షలు.. ఇలా చాలా మంది అధికారులు తమ పనుల నిమిత్తం సొమ్ములు చెల్లించారని డిపార్ట్‌మెంట్‌లో బాహాటంగానే వినిపిస్తోంది.

బాబు సర్కారులో 'జగన్' చొరబాటు!

(మొదటి పేజ తరువాయి)

అనుకూలమైన దిగువ, మధ్యస్థాయి సిబ్బందిని జొప్పించేందుకు వైసీపీ వ్యూహ రచన చేసింది. ఆ ఉన్నతాధికారులు బదిలీ అయిపోయినా... వైసీపీ మనుషులు మాత్రం ఆ శాఖలోనే ఉంటారు. తమకు కావాల్సిన సమాచారాన్ని, ముఖ్యమైన విషయాలను వారి ద్వారా వెంటనే తెలుసుకోవచ్చు. 2014-19 మధ్య జగన్ ఇదే టెక్నిక్ ఉపయోగించారు. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ... దిగువ, మధ్యస్థాయి అధికారుల ద్వారా ప్రభుత్వ సమాచారాన్ని తెలుసుకునేవారు. దానిని వక్రీకరించి, కల్పితాలు జోడించి తన రోత పత్రికలో తప్పుడు కథనాలు ప్రచురించేవారు. అనేక శాఖల నుంచి ప్రభుత్వంలో కీలకమైన ఫైల్స్ కూడా జగన్ శిబిరానికి అందేవి. ముందుగానే ఉన్నతాధికారులతో ఏర్పచుకున్న సన్నిహిత సంబంధాలను ఈ విధంగా ఉపయోగించుకునేవారు. కొందరు అధికారులు చంద్రబాబు వద్ద విధేయత నటిస్తూనే కీలక సమాచారాన్ని జగన్‌కు అందించేవారు. ఈ విషయాన్ని అప్పటి సీఎం చంద్రబాబు ఆలస్యంగా గుర్తించారు. కానీ, అప్పటికే ప్రభుత్వానికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

తన హయాంలో కట్టుదిట్టంగా...

గతంలో టీడీపీ ప్రభుత్వ సమాచారాన్ని అందించి, సహకరించిన అధికారులకు... జగన్ అధికారంలోకి రాగానే కీలకమైన స్థానాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆ తర్వాత తనకు అవసరమైన దోపిడీకి వాడుకున్నారు. అంతేకాదు... తన ప్రభుత్వంలో చిన్న కాగితం, అతి చిన్న సమాచారం కూడా బయటికి వెళ్లకుండా కట్టుదిట్టం చేశారు. పైస్థాయి నుంచి కింది స్థాయి సిబ్బంది దాకా ఎవరూ మీడియాతో మాట్లాడకుండా నిఘాపెట్టారు. చిన్న అనుమానం వచ్చినా వేటు వేసేవారు.

ఇప్పుడు మళ్లీ అదే టెక్నిక్

అధికారం కోల్పోగానే జగన్ మళ్లీ పాత టెక్నిక్ తెరపైకి తెస్తున్నారు. సీఎం చంద్రబాబు ఇంకా చాలామంది ఉన్నతాధికారులను పక్కకు తప్పించకపోవడంతో... ఆయా శాఖల్లో ఇప్పటికీ జగన్ అనుకూల అధికారులే కొనసాగుతున్నారు. ఇప్పుడు వారి ద్వారా తమకు కావాల్సిన వారిని దిగువ, మధ్యస్థాయి ఆఫీసర్లను జొప్పించే కార్యక్రమం మొదలైంది. ఉదాహరణకు.. జగన్ పేషీలో చక్రం తిప్పిన ధనుంజయ రెడ్డి దగ్గర ఓఎస్డీగా పని చేసిన మాధురిని ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లోకి ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధంచేశారు. ఆడిట్ శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న ఆమె ఏనాడూ ఫోకల్ పోస్ట్‌లో పని చేయలేదు. కేవలం తమ పేషీల్లో విధులు నిర్వహించారన్న ఒకే ఒక కారణంతో ధనుంజయ రెడ్డి, జవహర్ రెడ్డి కలిసి ఆమెకు కన్ఫర్డ్ ఐఏఎస్ కట్టబెట్టాలనుకున్నారు. ప్రభుత్వం మారడంతో అది కాస్తా ఆగింది. మొత్తం ఆ లిస్ట్‌నే ప్రభుత్వం వెనక్కి తెప్పిస్తోంది. అయితే... ఇప్పుడు మాధురికి ఆరోగ్యశ్రీ ట్రస్టులో ఫైనాన్స్ విభాగంలో జేఈవో పోస్టు కట్టబెట్టే ప్రయత్నాలు మొదలయ్యాయి. 'ఆ పోస్టు ఖాళీగా ఉంది. నాకు ఇప్పించండి' అని మంగళవారం ఆమె ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ కృష్ణబాబుకు దరఖాస్తు సమర్పించారు. ఆమె దరఖాస్తును అధికారులు ప్రాసెస్ చేసేశారు. రేపోమాపో ఆమెకు పోస్టింగ్ ఇవ్వనున్నారు. అలానే గత ప్రభుత్వంలో కీలకమైన కార్పొరేషన్‌లో విధులు నిర్వహించిన ఒక అధికారి ఇప్పుడు సీఎంవోలో చేరిపోయారు. ఇలా గత ప్రభుత్వంలో కీలకమైన స్థానాల్లో విధులు నిర్వహించిన అధికారులు మళ్లీ తమకు అనుకూలంగా ఉండే ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి పోస్టింగ్‌లు కోరుతున్నారు. ఇలాంటి వారి వల్ల ప్రభుత్వానికి నష్టమేనని కొంత మంది అధికారులు భావిస్తున్నారు. పోస్టింగ్ ఇచ్చేటప్పుడు జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

దుర్గగుడిలో గాలికి కూలిన టెంట్లు



దుర్గగుడి మహామండపం 7వ అంతస్తులో భక్తులు వేచి ఉండడానికి ఏర్పాటు చేసిన టెంట్లు మంగళవారం విపరీతంగా వీచిన గాలికి పడిపోయాయి. ఆ సమయంలో అక్కడ భక్తులెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. వెంటనే సిబ్బంది గమనించి పడిపోయిన టెంట్లను తొలగించారు.

- వన్‌టౌన్





నగరంలోని ఓ ఫ్యాషన్ కళాశాలలో జరిగిన ఫ్యాషన్ షోలో హొయలొలికిస్తున్న అందాల భామ

రామోజీకి బుద్ధప్రసాద్ ఘననివాళి



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

విజయవాడ కల్చరల్, జూన్ 18: సమాజ సంక్షేమానికి నిరంతరం పోరాడిన యోధుడు రామోజీరావు అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి, రాగలహరి కల్చరల్, సోషల్ ఆర్గనైజేషన్ సంయుక్త నిర్వహణలో మంగళవారం సాయంత్రం రామోజీరావు సంతాప సభ గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కళావేదికపై నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ వ్యవస్థలో మంచి మార్పు కోసం నిరంతరం కృషి చేసిన చెరుకూరి రామోజీరావు తెలుగు వారి మదిలో చిరస్మరణీయుడన్నారు. సభకు అధ్యక్షత వహించిన పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి అధినేత గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ బహుళ ప్రజాదరణ గల ఈటీవీ పాడుతా తీయగా ద్వారా అనేక మంది యువ గాయకులను చిత్రరంగానికి పరిచయం చేసిన వ్యక్తి రామోజీరావు అన్నారు. ఈనాడు, చతుర, విపుల, తెలుగు వెలుగు పత్రికల ద్వారా తెలుగు భాషకు అమూల్యమైన సేవలందించారని ప్రశంసించారు. తెలుగు కళావాహిని అధ్యక్షులు చింతకాయల చిట్టిబాబు నిర్వహణ చేయగా తొలుత రామోజీరావు చిత్రపటానికి బుద్ధప్రసాద్ పూలమాలతో నివాళులర్పించారు. పొట్లూరి హరికృష్ణ, కొల్లి మురళీకృష్ణ, ఎక్స్‌రే కార్యదర్శి బి.ఆంజనేయ రాజు, గాయకుడు డేవిడ్ రాజు పాల్గొన్నారు. అనంతరం సినీ సంగీత విభావరి ఆకట్టుకొంది.



వందే భారత్ రైలులో ప్రయాణికులను పలకరిస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత

వందేభారత్ రైలులో ప్రయాణించిన హోం మంత్రి అనిత

రైల్వేస్టేషన్, జూన్ 18: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖపట్నానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె రైలులో ప్ర యాణికులను కుశల ప్రశ్నలు వేశారు. వారు ఎదుర్కొంటున్న సమస్యల ను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.



ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు కేకును తినిపిస్తున్న మంత్రి పార్థసారథి

ఘనంగా ఎమ్మెల్యే బోడె జన్మదిన వేడుకలు

● శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ ఉమ్మడి కృష్ణా నేతలు

పెనమలూరు, జూన్ 18: స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. నగరంలోని గేట్‌వే హోటల్‌లో జరిగిన వేడుకల్లో మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, ఎంపీలు, ఎమ్మెల్యేలు, టీడీపీ ఉమ్మడి కృష్ణాజిల్లా నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు టీడీపీ నేతలు కేక్‌ను కట్ చేసి బోడేకు తి నిపించారు. టీడీపీ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అధ్యక్షులు కొనకళ్ల నారాయ ణ, నెట్టెం రఘురాం, ఎంపీలు కేశినేని చిన్ని, వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు మండలి బుద్ధ ప్రసాద్, బొండా ఉమా, శ్రీరాం తాతయ్య, వర్ల కు మార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్, వసంత కృష్ణప్రసాద్, కొలికపూడి శ్రీనివాసరావు, జనసేన నేత బండ్రెడ్డి రామకృష్ణ, అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, హనుమంతరావు, కొత్త నాగబాబు పాల్గొన్నారు.

రామోజీరావుకు బుద్దా వెంకన్న నివాళి



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బుద్దా వెంకన్న

వన్‌టౌన్, జూన్ 18: ఈనా డు సంస్థల అధినేత దివంగత రామోజీరావు చిత్రపటానికి టీడీ పీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెం కన్న మంగళవారం నివాళులర్పించారు. హైదరాబాద్ ఫిల్మ్ నగర్‌లో రామోజీరావు స్వగృహానికి బుద్దా వెంకన్న వెళ్లారు. రా మోజీ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ప్రగాఢ సంతాపం తెలిపి కుటుంబసభ్యుల కు సానుభూతి తెలిపారు.

స్పోర్ట్స్ అకాడమీలను పునఃప్రారంభించండి

● మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి కబడ్డీ సెక్రటరీ శ్రీకాంత్ వినతి




మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని బహుకరిస్తున్న శ్రీకాంత్

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 18: రాష్ట్రంలో మూత బడ్డ స్పోర్ట్సు అ కాడమీలను తిరిగి పునఃప్రారంభించాలని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఎం. రామ్‌ప్రసాద్‌రెడ్డికి ఆంధ్రా కబ డ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ విన్నవించారు. నగరంలో ఓ హోటల్‌లో బస చేసిన మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ని శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలుసుకుని వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మా ట్లాడు తూ 2019 వరకు రాష్ట్రంలో స్పోర్ట్సు అకాడమీలుండేవని, తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని మూసేసిందని, క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడే ఈ అకాడమీలను ప్రారంభించాలని కోరారు. అలాగే కబడ్డీ లీ గ్‌లను నిర్వహించి కబడ్డీ క్రీడాభివృద్ధికి సహకరించాలని విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో కృష్ణా జిల్లా కబడ్డీ సంఘం మాజీ కార్యదర్శి కేవీ నాంచారయ్య ఉన్నారు.

మాకు న్యాయం చేయండి

బందరు రోడ్డు విస్తరణ బాధితుల ఆవేదన



బాధితుల సమస్యలు వింటున్న అధికారులు జుబెన్ రాయ్, శివ, రామకృష్ణ

పటమట, జూన్ 18: గత టీడీపీ హయాంలో బెంజి సర్కిల్ నుంచి ఆటోనగర్ టెర్మినల్ వరకు 100 అడుగుల మేర రోడ్డుకు ఇరువైపులా విసర్తణ పనులు చేపట్టారు. రోడ్డు విస్తరణకు 219 మంది తమ స్థలాలను కార్పొరేషన్‌కు అప్పజెప్పారు. వారిలో 201 మందికి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం వారికి భూమి ఇచ్చినట్టుగా ఎండార్స్‌మెంట్ పత్రాలు అందజేయలేదు. ఎలాంటి ఆర్థిక సహాయం అందజేయలేదు. బందర్ రోడ్డు వైడెంగ్ బాధితులందరూ మంగళవారం పటమట సర్కిల్-3 కార్యాలయంలో సమావేశమయ్యారు. వారి సమస్యలను సర్కిల్-3 జోనల్ కమిషనర్ శివరామకృష్ణ, డిప్యూటీ సిటీ ప్లానర్ జుబెన్ రాయ్‌కు వివరించి, తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ బందర్ రోడ్డు వైడింగ్‌లో స్థలాలిచ్చిన భూ యజమానుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ స్థాయి అధికారిని సర్కిల్-3 కార్యాలయంలో ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ వారం రోజుల్లోపు కార్పొరేషన్ సిబ్బంది బందర్ రోడ్డు విస్తరణకు స్థలాలిచ్చిన వారి ఇళ్లకు వెళ్లి రోడ్డు విస్తరణలో వారు భూమి ఏ మేరకు కోల్పోయారో? వారి నివాస గృహంలో ఎంత మేరకు నష్ట జరిగిందీ? పూర్తిగా వివరాలు సేకరిస్తారని, వారు సేకరించిన వివరాల మేరకు తదుపరి సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని అధికారులు వివరించారు. కార్పొరేటర్ దేవినేని అపర్ణ, బందర్ రోడ్డు విస్తర్ణ బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిర్లక్ష్యమే మీటర్ రీడర్ మృతికి కారణం!

● సబ్‌స్టేషన్ గ్రేడ్-2 జేఎల్‌ఎం కిషోర్, జేఎల్‌ఎం, లైన్‌మెన్ కారకులంటూ మృతుడి భార్య, కుమారుడి ఫిర్యాదు



విద్యాధరపురం, జూన్ 18: సర్వీస్ వైర్ కలుపుతుండగా విద్యుత్ షాక్‌కు గురై ఆనంద్‌కుమార్ అనే మీటర్ రీడర్ మృతి చెందిన సంఘటన బెంజిసర్కిల్ సమీపంలోని స్క్రూబ్రిడ్జి సబ్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఈ మేరకు మృతుడి కుమారుడు భవానీపురానికి చెందిన డేవిడ్ రాజు మంగళవారం ఏపీసీపీడీసీఎల్ విజయవాడ విజిలెన్స్ పోలీస్ ఇన్స్‌పెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. తన తండ్రి పదేళ్లుగా స్క్రూబ్రిడ్జి సబ్‌స్టేషన్‌లో మీటర్ రీడర్‌గా పనిచేస్తున్నారని తాను కూడా నాలుగేళ్లుగా మీటర్ రీడర్‌గా అదే సబ్‌స్టేషన్ పరిధిలో పనిచేస్తున్నానన్నారు. ఈ నెల 17న మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత సబ్‌స్టేషన్‌లో ఏఈకి కనిపించి వస్తానని తన తండ్రి వెళ్లారన్నారు. మధ్యాహ్నం 1.37 గంటల సమయంలో గ్రేడ్-2 జేఎల్‌ఎం కిషోర్ ఫోన్‌చేసి చంద్రమౌళిపురంలో ఆదివారం గాలివాన వలన జ్యోతి కన్వెన్షన్ సెంటర్ పక్కరోడ్డులో కొబ్బరి చెట్టు విరిగిపడి కరెంట్‌తీగలు తెగిపడిపోయాయని తన తండ్రి ఆనందకుమార్‌ను కిషోర్ వెంటబెట్టుకుని ఘటనా ప్రదేశానికి వెళ్లారన్నారు. ఆ తరువాత కిషోర్ తాను భోజనానికి వెళుతున్నానని సర్వీస్‌వైర్ కలపాలంటూ తన తండ్రిని ఆదేశించి వెళ్లారన్నారు. అదే సమయంలో లైన్‌మ్యాన్ కే.రంజిత్‌కుమార్, రాఘవ ఉన్నా పట్టించుకోకుండా వెళ్లిపోయారన్నారు. అనంతరం తన తండ్రి విద్యుత్ స్తంభం ఎక్కి పనిచేస్తుండగా విద్యుదాఘాతంతో కిందపడిపోయారన్నారు. అటుగా వెళుతున్న ఒక ఆటోడ్రైవర్ ఆనందకుమార్‌ను తీసుకెళ్లి గవర్నమెంట్ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారన్నారు. అర్ధగంట తరువాత జేఎల్‌ఎం తనకు ఫోన్ చేసి తన తండ్రికి కరెంట్ షాక్ తగిలినట్టు చెప్పారన్నారు. ఈ సంఘటనలో బాధ్యతను విస్మరించిన లైన్‌మ్యాన్‌ను, జేఎల్‌ఎంను విచారణ జరిపి తగు న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఇదే సమయంలో కృష్ణలంక పోలీసులకు ఆనందకుమార్ భార్య తురిమిల్లి పార్వతి మరో ఫిర్యాదు చేస్తూ తన భర్త ఆనందకుమార్ పోల్ ఎక్కి సర్వీస్ వైర్ తగిలిస్తుండగా విద్యుదాఘాతం తగిలి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయారన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని విచారించి న్యాయం చేయాల్సిందిగా కోరారు.



రైల్వే డివిజన్‌లో బి.మురళీ, పి.శ్రీనివాస్‌లకు మ్యాన్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డులు అందజేసిన రైల్వే జీఎం

ఇద్దరు రైల్వే ఉద్యోగులకు మ్యాన్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డులు

రైల్వేస్టేషన్, జూన్ 18: రైల్వే డివిజన్‌కు చెందిన గొల్లప్రోలు ఆపరేటింగ్ డిపార్ట్‌మెంట్ పాయింట్స్ మెన్ డి.మురళీ, ఉలవపాడు ఇంజనీరింగ్ విభాగం ట్రాక్ మ్యాన్-4 పి.శ్రీనివాస్‌లకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ మంగళవారం మ్యాన్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డులను అందజేశారు. సికింద్రాబాద్ రైలు నిలయంలో జరిగిన సమీక్షలో ఆయన ఈ అవార్డులను అందజేశారు. మన డివిజన్ నుంచి నరేంద్ర ఏ పాటిల్, సికింద్రాబాద్ రైల్ నిలయం నుంచి డిపార్ట్‌మెంటల్ ప్రధాన అధిపతులు, గుంటూరు, సికింద్రాబాద్, గుంతకల్లు, హైదరాబాద్‌కు చెందిన అధికారులతో వర్చువల్ సేఫ్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థలో లోపాలను గమనించి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆయన సేఫ్టీకి సంబంధించి అన్ని అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా విజయవాడ రైల్వే డివిజన్‌లో తీసుకుంటున్న అప్రమత్తపు చర్యలపై డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్‌ను అభినందించారు. గొల్లప్రోలు వద్ద గూడ్సు రైల్ ఇంజన్ ఇరుసు వద్ద మంటలు గమనించి అప్రమత్తం చేసినందుకు పాయింట్స్ మెన్ డి.మురళీకి, ఉలవపాడులో స్విచ్ఛ్ విస్తరణ జాయింట్ స్టాక్ రైలు పగుళ్లను గుర్తించి సకాలంలో మరమ్మతులను చేసిన ట్రాక్ మెన్-4 పి.శ్రీనివాస్‌లకు మ్యాన్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డులను అందజేశారు.

ఉమ్మడి కృష్ణా అండర్-16 క్రికెట్ టీమ్ ప్రకటన

విజయవాడ స్పోర్ట్సు: 2024-25 సీజన్‌లో ఉమ్మడి కృష్ణా అండర్-16 పురుషుల క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్టు కేడీసీఏ అడహక్ కమిటీ ఛైర్మన్ టీ.త్రినాథ్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ప్లేయర్స్ వివిధ ఫార్మాట్లలో జరిగే మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

టీమ్ ఇదే.. టి.హర్ష సాయిసాత్విక్ (కెప్టెన్), సీహెచ్ పరంధామా (వైస్ కెప్టెన్), బి. ఆకాశ్, వై.హేమంత్, యజ్ఞ వాల్యా, ఆర్ఎన్‌వీ అభిరామ్, డి.సంజయ్, ఎం.రణధీర్, వి.మోక్షజ్ఞ, వై.లలిత్, ఎం.ధావిన్, జి.గౌతమ్, పి.ధీరు, ఎస్‌డీ. అయానుద్దీన్, పీవీ రేణేష్, స్టాండ్‌బైలుగా ఆర్.సుజిత్ కుమార్ రెడ్డి, ఎస్‌కే.ఇర్ఫాన్, జె.స్వామి, ఎంజగత్ చంద్ర, ఎస్‌జీ.చరణ్ తే జ, బి. గీతేష్

నేడు ఎన్టీఆర్ జిల్లా పురుషుల హాకీ ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు: అంతర్ జిల్లా సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా టీమ్ ఎంపికను ఈ నెల 19న అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎంబీపీ స్టేడియం ఉదయం 7 గంటలకు నిర్వహిస్తున్నట్టు జిల్లా హాకీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 1995 జనవరి 1 తర్వాత జన్మించిన క్రీడాకారులు ఎంపిలకు అర్హులని, హాజరయ్యే క్రీడాకారులు ఆధార్, పాన్, టెన్త్ క్లాస్ సర్టిఫికెట్‌తో రావాలన్నారు. ఈ నెల 27 నుంచి 30 వరకు శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో 14వ ఏపీ సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్‌కు వీరిని పంపుతామని రాజశేఖర్ వివరించారు. వివరాలకు 9550671671లో సంప్రందించాలన్నారు.

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి

ధర్నాచౌక్: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని అసెంబ్లీలో తీర్మానించాలని ఆలిండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. అన్ని రాజకీయ పక్షాలు ఐక్యంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. కేం ద్రం దిగివచ్చేవరకు ఉద్యమాన్ని కొనసాగించాలన్నా రు. దీనికి ఉమ్మడి కార్యాచరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక హోదాతోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ఫణిరాజ్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పేరును ఎన్టీఆర్ వైద్యసేవగా మార్చండి

● ఎమ్మెల్యే బొండా ఉమా వినతి



వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కృష్ణబాబుకు వినతిపత్రమిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

వన్‌టౌన్, జూన్ 18: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పేరును ఎన్టీఆర్ వైద్యసేవగా మార్చాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మంగళవారం వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కృష్ణబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో ఎన్టీఆర్ వైద్యసేవ పేరుతో అత్యుత్తమ వైద్య సేవలు ప్రజలకు అందినట్టు గుర్తుచేసి జగన్మోహనరెడ్డి ప్రభుత్వం ఆ పేరును మార్చి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అని పేరు పెట్టి ఆరోగ్యశ్రీని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవతో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు పారదర్శకంగా జరిగాయన్నారు. గుండెజబ్బులు వచ్చినవారికి స్టంట్ అమర్చడానికి ఆసుపత్రుల్లో దిక్కులేకుండా పోయిందన్నారు. జీర్ణకోశ వ్యాధులు, యాక్సిడెంట్ కేసులు, క్యాన్సర్ కేసులకు వైద్య సేవలు అందుబాటులో లేకుండా పోయాయని కనీసం మందులు కూడా అందుబాటులో లేని దుర్భర పరిస్థితుల్లో రాష్ట్రం ఉందన్నారు. చాలా ఆసుపత్రుల్లో వైద్యుల కొరత ఉందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్వీర్యం చేశారన్నారు. నాడు అపోలో ఆసుపత్రుల సహకారంతో ప్రతి డివిజన్‌లోని పేదవారికి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు గుర్తు చేశారు. ప్రైమరీ హెల్త్ సెంటర్లను నడపకపోగా వైద్యశాలలో చికిత్సను నిర్లక్ష్యం చేశారన్నారు. చాలా ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీని అమలు చేయడం లేదని గత ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు బకాయిలు చెల్లించక విఫలమయ్యారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో అనారోగ్యంలో ఉన్న పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలందించడమే లక్ష్యమన్నారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలుగు ప్రజల ఆరాధ్య దైవం ఎన్టీ రామారావు పేరిట ఎన్టీఆర్ వైద్యసేవ పేరును పెట్టాలన్నారు.

జగన్ రాజీనామా చేస్తే బ్యాలెట్ పోలింగ్ నిర్వహించవచ్చు

● ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య

వన్‌టౌన్, జూన్ 18: మాజీ సీఎం జగన్మోహనరెడ్డి పులివెందుల నియోజకవర్గం నుంచి రాజీనామా చేస్తే అక్కడ బ్యాలెట్ విధానంలో ఉప ఎన్నిక పోలింగ్ నిర్వహించవచ్చునని ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. జగన్మోహనరెడ్డి అంటున్నట్టు బ్యాలెట్ విధానమే అమలు చేయాలని ఆయన నియోజకవర్గం నుంచే మొదలు పెట్టవచ్చునన్నారు. ఇప్పుడు తన పార్టీ ఓడిపోవడానికి ఈవీఎం లేనని జగన్‌రెడ్డి చెబుతున్నాడని మరి 2019 ఎన్నికల్లో ఆయన ఈవీఎంలు బేష్ అని చెప్పాడన్నారు. బ్యాలెట్ పద్ధతిపై అంత నమ్మకం ఉంటే పులివెందులలో రాజీనామా చేస్తే ఆ విధంగా పోలింగ్ జరపాలని ఎన్నికల కమిషన్‌ను కోరుతామని మరోవైపు ఇప్పుడు గెలిచిన 11 మంది కూడా రాజీనామాలు చేస్తే బ్యాలెట్ పద్ధతి ద్వారా ఎంతమంది మళ్లీ ఎన్నికవుతారో చూద్దామన్నారు. ఇందిరాగాంధీ బంపర్ మెజారిటీతో గెలిచినప్పుడు రష్యా నుంచి రంగు తెప్పించారని ఎక్కడ ఏ గుర్తు మీద ముద్ర వేసినా హస్తం గుర్తు మీదే పడేటట్లు చేశారని అప్పట్లో అనుకున్నారన్నారు. సంజయ్ గాంధీ ఉన్నప్పుడు జరిగిన ఎన్నికలోనూ ఆవుదూడ గుర్తుతో పోటీ చేసిన కాంగ్రెస్ చిత్తుచిత్తుగా ఓడిపోయిందన్నారు. ఆవు ఒక దారిలో దూడ ఒక దారిలో పారిపోయాయని జోకులు వేసుకున్న సంగతిని ఆయన గుర్తు చేశారు. జగన్‌రెడ్డి పులివెందులలో రాజీనామా చేయడంతో పాటు వీలైతే పుంగనూరులో పెద్దిరెడ్డిని కూడా రాజీనామా చేయాలని చెప్పాలన్నారు. ఈ రెండు ఉప ఎన్నికల్లోనూ జగన్మోహనరెడ్డి కోరినట్లుగానే బ్యాలెట్ పద్ధతి పెట్టిద్దామన్నారు.

తప్ప తాగి 17 మందిని తొక్కించేశాడు

- నాగపూర్‌లో కారుతో ఇంజనీరింగ్ విద్యార్థి నిర్వాకం
- రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు గిరిజనుల దుర్మరణం

నాగపూర్, జూన్ 18: తప్ప తాగి కారు నడుపుతూ.. రోడ్డు మీద వెళ్తున్న ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను బలిగొన్న మైనర్ అరాచకం తరహాలోనే మరో ఘటన చోటుచేసుకుంది. నాటి ఉదంతం మహారాష్ట్రలోని పుణెలో జరగ్గా తాజా ప్రమాదం నాగపూర్‌లో చోటుచేసుకుంది. స్నేహితుడి పుట్టిన రోజు సందర్భంగా భూషణ్ లనేవర్ అనే ఫైర్ ఇంజనీర్ ఆదివారం అర్ధరాత్రి ఐదుగురితో కలిసి దాబాలో మందు పార్టీ చేసుకున్నాడు. తర్వాత వీరంతా కారులో బయటకు వచ్చారు. భూషణ్ వేగంగా నడుపుతూ దిఘోరీ టోల్‌ప్లాజా సమీపంలోని పాద బాటపై నిద్రిస్తున్న రాజస్థాన్ కూలీలపైకి పోనిచ్చాడు. తప్పించుకునే ప్రయత్నంలో కారును వెనక్కు, ముందుకు నడిపించాడు. దీంతో బగాడియా తెగకు చెందిన గిరిజన మహిళ కాంతీబాయి (42), మరో వ్యక్తి సీతారాం (30) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 15 మంది కూలీలు గాయపడ్డారు. వీరిలో తీవ్ర గాయాలైన ఏడుగురి పరిస్థితి విషమంగా ఉంది. కారులో వాన్ష్ జాదె, సన్మయ్ పత్రీకర్, అథర్వ వనాయత్, అథర్వ మోగ్రే, హృషికేశ్ చౌబే ఉన్నారని, వీరంతా ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులని పోలీసులు తెలిపారు. జాదె పుట్టిన రోజు సందర్భంగా పార్టీ చేసుకుని జాయ్ రైడ్‌కు బయల్దేరారని చెప్పారు. అందరినీ అరెస్టు చేసి ఐపీసీ సెక్షన్ 304, ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బుధవారం దాకా కోర్టు వీరిని పోలీస్ కస్టడీకి అప్పగించింది. నిందితుల రక్త నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు.

కార్యకర్తతో కాళ్లు కడిగించుకున్న కాంగ్రెస్ నేత



ముంబై, జూన్ 18: మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు నానా పటోలే వివాదంలో చిక్కుకున్నారు. సోమవారం ఆయన సంత్ గజానన్ మహారాజ్ పల్లకి దర్శనానికి అకోలా జిల్లాకు వెళ్లారు. వర్షం కారణంగా అక్కడ బురద ఉండడంతో అందులోనే నడిచి వెళ్లారు. తిరిగి వెళ్లే సమయంలో కారు వద్ద ఓ కాంగ్రెస్ కార్యకర్త ఆయన కాళ్లను కడిగారు. ఈ వీడియో వైరల్ అయింది. దీనిపై బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా స్పందిస్తూ కాంగ్రెస్ నాయకులు ప్రజలు, కార్యకర్తలను బానిసల్లా చూస్తున్నారని విమర్శించారు. ఇందుకు క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. నానా పటోలే వివరణ ఇస్తూ సమీపంలో కొళాయి లేనందునే కార్యకర్త చెంబుతో నీళ్లు తీసుకొచ్చాడని చెప్పారు. ఆయన నీళ్లు పోస్తే తాను బురద కడుగుకొన్నానని తెలిపారు.

41 విమానాశ్రయాలకు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ, జూన్ 18: దేశంలోని 41 ఎయిర్‌పోర్టులకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్స్ రావడం కలకలం రేపింది. న్యూఢిల్లీ, చెన్నై, పాట్నా, కోయంబత్తూరు, జైపూర్ తదితర విమానాశ్రయాలకు మంగళవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ-మెయిల్స్ ద్వారా సమాచారం రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. బాంబు స్క్వాడ్ బృందాలు ఆయా ఎయిర్‌పోర్టులను అణువణువూ తనిఖీ చేశాయి. చెన్నై ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు రావడంతో అధికారులు సోదాలు చేశారు. దీంతో పలు విమానాశ్రయాల్లో విమానాలు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు కొంత అసౌకర్యానికి గురయ్యారు. అయితే, సోదాల్లో ఎక్కడా అనుమానాస్పద వస్తువులు లభించలేదు. కాగా, ముంబైలోని దాదాపు యాభై ఆస్పత్రులకు కూడా మంగళవారం బాంబు బెదిరింపులు వచ్చాయి.

పురుషత్వ పరీక్షలతో సిగ్గుగా ఉంది: ప్రజ్వల్

బెంగళూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): 'ఇప్పటికే రెండు కేసుల్లో పురుషత్వ పరీక్షలు నిర్వహించారు. మరోసారి అటువంటి పరీక్షలే చేయిస్తామని అంటున్నారు. చాలా సిగ్గుగా ఉంది' అని లైంగిక దాడుల కేసులో నిందితుడు, జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ తన సమస్యను న్యాయాధికారి దృష్టికి మంగళవారం తీసుకెళ్లారు. దీంతో అవసరమైన వైద్య పరీక్షలు మాత్రమే చేయించాలని పోలీసులను న్యాయాధికారి ఆదేశించారు. కాగా.. ప్రజ్వల్ రేవణ్ణపై మూడు కేసులు ఉన్నాయి. రెండింటికి సంబంధించి సిట్ విచారణలు ముగిశాయి. వాటికి అనుగుణంగా పురుషత్వ పరీక్షలు జరిపించారు. మూడోసారి సిట్ ప్రజ్వల్‌ను కస్టడీకి తీసుకుంది. మళ్లీ మెడికల్ టెస్టుకు సిద్ధం కావడంతో ప్రజ్వల్ న్యాయాధికారి ఎదుట తన సమస్యను చెప్పుకొన్నారు. 14 రోజుల కస్టడీ ముగియడంతో ప్రజ్వల్‌ను సిట్ అధికారులు మంగళవారం కోర్టు ఎదుట హాజరు పరిచారు. దీంతో మరో 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీకి ఇస్తూ 42వ ఏసీఎంఎం ప్రజాప్రతినిధుల కోర్టు న్యాయాధికారి కేఎన్ శివకుమార్ ఆదేశాలు జారీ చేశారు.

ఆర్మీలో స్కిన్ బ్యాంక్.. దేశంలోనే తొలిసారి

న్యూఢిల్లీ, జూన్ 18: భారత సైన్యం అత్యాధునిక సౌకర్యాలతో కూడిన స్కిన్ బ్యాంక్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆర్మీ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు కాలిన గాయాలకు, చర్మ సంబంధ వ్యాధులకు మెరుగైన చికిత్స చేయడానికి ఇది ఎంతగానో ఉపకరిస్తుంది. ఈ మేరకు రక్షణ శాఖ మంగళవారం ఓ ప్రకటన చేసింది. 'ఢిల్లీ ఆర్మీ ఆసుపత్రిలో (రీసెర్చ్, రిఫరల్) స్కిన్ బ్యాంకును ఏర్పాటు చేశారు. ఇక్కడ అత్యంత నైపుణ్యం గల వైద్య బృందం ఉంది. చర్మ సేకరణ, ప్రాసెసింగ్, నిల్వ, పంపిణీ కేంద్రంగా ఇది పనిచేస్తుంది. అవసరమైన సమయాల్లో దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ఆర్మీ ఆసుపత్రులకు చేరవేస్తుంది' అని ఆ ప్రకటన వివరించింది.

వైసీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు కుమార్తె అరెస్ట్

- చెన్నై రోడ్డు ప్రమాదం.. వ్యక్తి మృతి కేసులో అదుపులోకి

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం కేసులో వైసీపీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు కుమార్తె మాధురిని చెన్నై పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుతో బెయిల్‌పై విడుదల చేశారు. అడయార్ ట్రాఫిక్ విభాగం పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక బీసెంట్ నగర్ ఓడకుప్పం ప్రాంతానికి చెందిన సూర్య (22) అనే పెయింటర్ సోమవారం రాత్రి కళాక్షేత్ర కాలనీ వరదరాజరోడ్డులో ఫుట్‌పాత్‌పై నిద్రపోయాడు. ఆ సమయంలో వేగంగా వచ్చిన కారు సూర్యను ఢీకొనడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం అనంతరం కారు ఆగకుండా వెళ్లిపోగా, అందులో ఇద్దరు మహిళలు ఉన్నట్టు స్థానికులు గుర్తించారు. సూర్యను రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ప్రమాదంపై మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అడయార్ ట్రాఫిక్ విభాగం ఇన్‌స్పెక్టర్ సతీష్ సంఘటనా స్థలికి చేరుకొని ఆ ప్రాంతంలో ఉన్న సీసీ టీవీ దృశ్యాలు పరిశీలించి కారు రిజిస్ట్రేషన్ నంబరు ఆధారంగా ప్రమాదానికి కారకురాలు మాధురి అని గుర్తించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం మాధురి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోగా, సొంత పూచీకత్తుతో బెయిలుపై విడుదల చేశారు. కాగా, మాధురితో పాటు కారులో ప్రయాణించిన మరో మహిళ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బిహార్‌లో ప్రారంభానికి ముందే కూలిన వంతెన

పట్నా, జూన్ 18: బిహార్‌లో ఓ భారీ వంతెన ప్రారంభానికి ముందే కుప్పకూలింది. బాక్రా నది మీద నిర్మాణంలో ఉన్న వంతెనలో ఓ భాగం మంగళవారం కూలిపోయింది. ఆరారియా జిల్లాలోని కుర్సకంట-సిక్తి ప్రాంతాలను అనుసంధానం చేస్తూ రూ.12 కోట్ల నిధులు వెచ్చించి ఈ వంతెనను నిర్మిస్తున్నారు. నిర్మాణం దాదాపుగా పూర్తయిన దశలో వంతెన కూలిపోవడంతో ఈ నిధులన్నీ బూడిదలో పోసినట్లయింది. నది ప్రవహిస్తుండగా.. కూలిన వంతెనను చూసేందుకు వచ్చిన జనంతో కూడిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.



ఐదేళ్లు అతలాకుతలం!

వ్యవసాయం నుంచి విక్రయం వరకు రైతును చేయిపట్టుకుని నడిపిస్తామని చెప్పిన జగన్ ప్రభుత్వం గత ఐదేళ్ల పాలనలో సాగు రంగాన్ని కుదేలు చేసింది. వరుస విపత్తులతో కర్షకులు తీవ్రంగా నష్టపోయి, అప్పుల పాలై, వందలాది మంది బలవన్మరణాలు పాల్పడినా.. అరకొరగా పెట్టుబడి సాయంతో చేతులు దులుపుకొంది. కష్ట సమయంలో అండగా ఉండాల్సిందిపోయి.. రైతులకు మేలు చేసే రాయితీ పథకాలకు స్వస్తి పలికింది. గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన అనేక పథకాలను రద్దు చేయడంతో పాటు కేంద్ర ప్రయోజిత పథకాలను వినియోగించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం చేసింది. రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టేసింది.



అన్నీ అటకెక్కించేశారు!

- జగన్ పాలనలో సాగురంగం తీసికట్టు
- వరుస విపత్తులతో కర్షకులకు కష్టనష్టాలు
- రాయితీ పథకాల రద్దుతో రైతులు కుదేలు
- పెట్టుబడి సాయం అరకొరగా ఇచ్చి అన్యాయం
- దిగజారిన పాడి, మత్స్యకార, ఉద్యానరంగాలు
- మార్కెటింగ్‌శాఖ నిర్వీర్యం.. రైతుకందని సాయం
- మద్దతు ధర లేదు.. ధరల స్థిరీకరణ నిధీ లేదు
- ఇతర అనుబంధ రంగాలదీ అదే దుస్థితి
- రబీ కొనుగోళ్లపై ఇప్పటికీ 1600 కోట్ల బకాయి
- బాబు రాకతో అన్నదాతల్లో కోటి ఆశలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవసాయం తీసికట్టుగా తయారైంది. రైతులకు ఏ రకంగానూ వైసీపీ మేలు చేయలేకపోయింది. ఆఖరికి రైతుభరోసా కింద ఏటా రూ.13,500 ఇస్తామని చెప్పిన జగన్ సర్కార్.. కేవలం రూ.7,500లే రైతుల చేతుల్లో పెట్టింది. కౌలురైతులకూ, అగ్రవర్ణ సాగుదారులకు పెట్టుబడి సాయం చేస్తామని చెప్పి ఎగనామం పెట్టింది. వ్యవసాయశాఖలో రాయితీ పథకాలకు స్వస్తి చెప్పడమే కాదు.. రబీ పంటలకు బీమా కూడా అమలు చేయలేదు. గత ఖరీఫ్ రైతులకు బీమా కూడా చెల్లించాల్సి ఉంది. రబీలో కరువు వల్ల నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాల్సి ఉంది. విపత్తులకు పంట నష్టపోతే.. పాత జీవో ప్రకారం అరకొరగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి చేతులు దులుపుకున్న పరిస్థితి. రూ.లక్షలోపు రుణాలపై ఏడాది లోపు వడ్డీతో సహా వసూలు చేసి, కొన్నాళ్ల తర్వాత వడ్డీ రీయింబర్స్‌మెంట్ చేసేది. గతంలో రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు పావలా వడ్డీకి ఇచ్చిన రుణాలను నిలిపివేసింది. కేంద్రం కొంత వడ్డీ భరిస్తున్నా.. పావలా వడ్డీ పథకాన్ని ఎత్తేసింది. ఫలితంగా కౌలురైతులు ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు చేసి, సాగు నష్టాలతో బాకీలు తీరక బలవన్మరణాలకు పాల్పడిన ఉదంతాలు కోకొల్లలు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వ్యాపారుల నుంచి లైసెన్సు ఫీజులు వసూలు చేస్తూనే.. వారి టర్నోవర్‌కు తగ్గ సరుకు కేటాయించకుండా, ఆర్బీకేల్లో విక్రయించి, డీలర్లను దెబ్బతీసింది. ఉద్యాన తోటల విస్తరణ కోసం కేంద్రం సహాయం చేసే మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని జగన్ సర్కార్ నిర్వీర్యం చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీ రైతులతో పాటు ముఖ్యంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర రైతులు రాయితీలు కోల్పోయి, సొంత డబ్బుతో సూక్ష్మసేద్య పరికరాలు కొనుక్కోవాల్సి వచ్చింది. గతంలో ఈ పరికరాలు సరఫరా చేసిన కంపెనీలకు బకాయిలు చెల్లింపులోనూ తీవ్ర జాప్యం చేసింది. ఫలితంగా ఉద్యాన తోట విస్తరణ కుంటుపడింది. రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చాలన్న చంద్రబాబు ఆలోచనకు జగన్ సర్కార్ గండికొట్టింది. పట్టు పరిశ్రమకు అసలే అరకొరగా నిధులిచ్చి, రైతులకు రాయితీలు వర్తింపజేయకుండా ఇబ్బంది పెట్టింది. మార్కెటింగ్‌శాఖ ద్వారా ప్రభుత్వ మద్దతు ధరలకు పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని.. అరకొరగా కూడా సేకరించలేకపోయింది. ఏటా ధాన్య సేకరణ లక్ష్యం మేరకు కొనుగోలు చేయకుండా, రైతులకు సొమ్ము సకాలంలో చెల్లింపులు జరపకుండా ఇబ్బంది పెట్టింది. ఇటీవల రబీ ధాన్యం కొనుగోలుకు సంబంధించి, ఇప్పటికీ రూ.1,600కోట్లపైగా చెల్లించాల్సి ఉంది.

మత్స్యకారులకూ అంతే!

మత్స్యశాఖ ద్వారా మత్స్యకారులకు రాయితీపై పడవలు, వలలు, ఇతర వేట సామగ్రిని ఇవ్వకుండా, వేట నిషేధ సమయంలో మత్స్యకార భరోసా పేరుతో చేతులు దులుపుకొంటోంది. పెద్ద జలాశయాల్లో మత్స్యకార సంఘాల సభ్యుల చేపల పెంపకానికి గండికొట్టి, వేలం విధానాన్ని తెచ్చింది. ఆక్వా సాగును జోన్లుగా విభజించి, నాన్ జోన్ రైతులకు విద్యుత్ రాయితీకి కత్తెరేసింది. కోవిడ్ సమయం నుంచి చేపలు, రొయ్యల ఎగుమతులు మందగించి, గిట్టుబాటు ధర రాక డోర్‌డెలివరీలు చేసుకునే స్థితి వచ్చింది. విత్తన, దాణా చట్టాలను మార్చి ఆక్వా, పశువైద్య రంగాన్ని ఆంక్షల్లోకి నెట్టింది.

అన్నీ అటకెక్కించేశారు!

నియోజకవర్గానికో మార్కెట్ పేరుతో యార్డుల సంఖ్యను పెంచినా అధికార పార్టీ నేతలకు పదవులివ్వడం తప్ప.. వైసీపీ ప్రభుత్వం రైతుకు ఒరగబెట్టిందేమీ లేదు. ధాన్యం, ఆక్వా ఉత్పత్తులపై మార్కెట్ సెస్ పెంచి, అదనపు సొమ్ముపై రుణం తెచ్చి, గ్రామీణ రోడ్లు వేస్తామని చెప్పి, ఏ రోడ్లూ వేయలేదు. నాబార్డు నిధులతో చేపట్టిన అగ్రి ఇన్‌ఫ్రా పనులు సగం కూడా పూర్తి కాలేదు. రైతుబజార్లలో అస్తవ్యస్తంగా దుకాణాలు ఏర్పాటు చేసి, అద్దెలు భారీగా పెంచేసినా.. సిబ్బందికి మాత్రం కనీస వేతనాలివ్వడం లేదు. మొబైల్ రైతుబజార్లకు స్వస్తి చెప్పారు. పశుసంవర్ధకశాఖలో గతంలో ఉన్న మినీ గోకులాలు, రాయితీపై పశుదాణా, పశుగ్రాస క్షేత్రాల వంటివి అటకెక్కించింది. గోపాలమిత్రల సేవలను గుర్తించకుండా, సంచార పశువైద్యం ముసుగులో గ్రామీణ పశువైద్యాన్ని నిర్వీర్యం చేసింది.

అంతా సొంత లాభమే!

రాష్ట్రంలోని సహకార సంఘాలకు ఐదేళ్లలో ఎన్నికలు నిర్వహించలేకపోయింది. పీఏసీఎస్, డీసీసీబీ, డీసీఎంఎస్, ఆప్కాబ్, మార్క్‌ఫెడ్ వంటి సంస్థల పగ్గాలను నామినేటెడ్ పద్ధతిలో సొంత పార్టీ నేతలకు అప్పగించడంతో ఆయా సంస్థల్లో చాలా మంది అందిన ప్రభుత్వ ధనాన్ని దోచేశారు. వాటిపై విచారణ, చర్యలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ నియామకంలో నిబంధనలు పాటించకుండా, రెండోసారి వీసీని కొనసాగించడంతో కోర్టులో వ్యాజ్యం దాఖలైంది. ఉద్యాన వర్సిటీ వీసీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయ, పశువైద్య, మత్స్య విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జి వీసీతో నెట్టుకొస్తున్నారు. సెర్చ్ కమిటీలతో రెగ్యులర్ వీసీలను నియమించాల్సి ఉంది. ఈ నాలుగు వర్సిటీల్లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలున్నాయి. సిబ్బందికి కనీసం జీతాలు కూడా నెలనెలా ఇవ్వని దుస్థితి నెలకుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ, ఉద్యాన, సహకార, మార్కెటింగ్, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారులంతా రైతులకు అందుబాటులో ఉండాలని ఈ శాఖల మంత్రి అచ్చెన్నాయుడు ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. దీంతో కూటమి ప్రభుత్వంలో సాగురంగంతోపాటు, అనుబంధ రంగాలకు మంచి రోజులు వచ్చినట్లేనని రైతాంగం భావిస్తోంది.

ఆక్వా ఎగుమతుల్లో భారత్ ఆల్‌టైమ్ రికార్డు

- సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అధికారి స్వామి

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాన ఎగుమతి మార్కెట్లలో అనేక సవాళ్లు ఉన్నా.. 2023-24లో భారతదేశ మత్స్య ఎగుమతులు ఆల్ టైమ్ రికార్డు సాధించినట్లు సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల ఐఏఎస్ అధికారి డీవీ స్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం కొచ్చిన్ నుంచి ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దేశ మత్స్య ఎగుమతులు వాల్యూమ్ పరంగా ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయిని తాకాయి. 2023-24లో రూ.60,523.89కోట్ల విలువైన 17,81,602 మెట్రిక్ టన్నుల సముద్ర ఉత్పత్తుల ఆహారాన్ని భారత్ రవాణా చేసింది. ఘనీభవించిన రొయ్యల పరిమాణం, విలువ రెండింటి పరంగా ప్రధాన ఎగుమతి ఉత్పత్తిగా నిలిచింది. అమెరికా, చైనా.. భారత సముద్ర ఆహారాన్ని ప్రధాన దిగుమతి ఉత్పత్తిగా మార్చాయి. దీంతో భారత్ నుంచి గతేడాది కంటే 2023-24లో ఎగుమతి పరిమాణం 2.67% మెరుగుపడింది. 2022-23లో రూ.63,969.14కోట్ల విలువైన 17,35,286మెట్రిక్ టన్నుల సముద్ర ఉత్పత్తుల ఆహారాన్ని ఎగుమతి చేసింది. ఘనీభవించిన రొయ్యలు రూ.40,013.5 కోట్ల ఆదాయం తీసుకురావడమే కాక, సముద్ర ఆహార ఎగుమతుల మార్కెట్‌లో 40.19% ఘన పరిమాణంలో 66.12% అధిక డాలర్ల లాభంతో ప్రపంచ స్థాయిలో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. ఘనీభవించిన చేపలు రెండో అతిపెద్ద ఎగుమతి ఉత్పత్తిగా గుర్తింపు పొంది, రూ.5,509.69 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఈ చేపలు అమెరికా డాలర్ల ప్రకారం 9.09% లాభాన్ని, 21.42% పరిమాణాన్ని వృద్ధి చేశాయి. చేపలు, రొయ్యల ద్వారా ఆహార, పొడి దాణా ఉత్పత్తుల్లో మూడో అతి పెద్ద ఎగుమతి మొత్తాదుగా గుర్తింపు పొంది, రూ.3,684.79కోట్ల ఆదాయం తెచ్చి పెట్టడంలో 15.89% పరిమాణ భాగస్వామ్యాన్ని, 6.08 యూఎస్ మిలియన్ డాలర్ల అధిక ఆదాయాన్ని తెచ్చి పెట్టాయి.

టమాటా ధరల స్థిరీకరణకు మార్కెటింగ్ శాఖ చర్యలు

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి తగ్గుదల కారణంగా టమాటా ధరలు పెరుగుతుండటంతో ప్రభుత్వం ధరల స్థిరీకరణ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో టమాటా కిలో రూ.65 పలుకుతోంది. చాలా రాష్ట్రాల్లో టమాటా సాగు లేకపోవడంతో ఉత్పత్తి తగ్గింది. అయితే ఏపీలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొంత లభ్యత ఉండటంతో అక్కడి నుంచి రాష్ట్రవ్యాప్తంగా సరఫరా జరుగుతోంది. కానీ, బయట ధర అధికంగా ఉండటంతో చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లోని మార్కెట్ల నుంచి టమాటా సేకరించి, పట్టణ ప్రాంత రైతుబజార్లలో లాభనష్టాలతో నిమిత్తం లేకుండా కిలో రూ.52-55 మధ్య వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గత 10రోజుల్లో 30టన్నులు సేకరించి, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రైతుబజార్లకు పంపమన్నారు.

పర్యావరణ, కాలుష్య మండలి పదవులకు రాజీనామాలు

వైసీపీ అధికారం కోల్పోయి, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రాష్ట్ర పర్యావరణ నిర్వహణ సంస్థ చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్ రాజీనామా చేశారు. అలాగే రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు శివకృష్ణారెడ్డి, వి.హనుమారెడ్డి, ఎం.సునీల్‌కుమార్, మహ్మద్ సాదిక్ రాజీనామా చేశారు. వీరి రాజీనామాలను ఆమోదిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పెళ్లి కోసం నిందితుడికి బెయిల్!

- గతేడాది మైనర్‌పై లైంగిక దాడి.. శిశువుకు జన్మనిచ్చిన బాధితురాలు
- ఇద్దరి వివాహానికి అంగీకరించిన పెద్దలు.. బెయిల్ ఇచ్చిన హైకోర్టు

బెంగళూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమించిన యువకుడు ఆమెపై లైంగిక దాడికి పాల్పడటంతో గర్భం దాల్చింది. శిశువుకు జన్మనిచ్చింది. చిన్నారి భవిష్యత్ కోసం వారిద్దరూ పెళ్లి చేసుకోవాలని భావించారు. ఈ మేరకు హైకోర్టును ఆశ్రయించగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నిందితుడికి 16 రోజుల బెయిల్ మంజూరు చేస్తూ ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. 2023లో మైనర్‌పై లైంగిక దాడి జరగ్గా ఆమెకు శిశువు జన్మించింది. శిశువుతోపాటు బాధితురాలికి రక్షణ కల్పించేందుకు హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. జూలై 3వ తేదీ వరకు నిందితుడికి మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది ఈలోగా వివాహ రిజిస్ట్రేషన్ పత్రాన్ని కోర్టుకు సమర్పించాలని, వారానికోసారి సమీప పోలీస్ స్టేషన్ లో హాజరు కావాలని ధర్మాసనం ఆదేశించింది. 23 ఏళ్ల యువకుడు, బాలిక ప్రేమించుకున్నారు. 2023లో ఆమెను నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అతన్ని అరెస్టు చేశారు. ఇటీవల నిందితుడు కేసు రద్దు చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. బాలిక తరఫు న్యాయవాది కోర్టుకు హాజరై నిందితుడు, బాలిక పరస్పరం ప్రేమించుకున్నారని, వారి మధ్య తల్లిదండ్రులు జోక్యం చేసుకున్నారని తెలిపారు. ఆమె శిశువుకు జన్మనిచ్చిందని, బాధితురాలికి 18 ఏళ్లు నిండినందున వారిద్దరూ వివాహం చేసుకోదలిచారని వివరించారు. ప్రస్తుతం ఇద్దరి తల్లిదండ్రులు వివాహానికి అంగీకరించారని కోర్టుకు తెలిపారు. చిన్నారితో పాటు బాధిత యువతికి న్యాయం చేయడంలో భాగంగా రాజీ ద్వారా కేసు రద్దు చేయాలని కోరారు. మరోవైపు ధర్మాసనం చిన్నారికి డీఎన్ఏ పరీక్షలు జరిపించగా, వారిద్దరూ తల్లిదండ్రులు అని నిర్ధారణ అయింది. ఏం జరిగిందో శిశువుకు తెలియదని, ఆ చిన్నారి భవిష్యత్తులో ఎటువంటి అవమానాలు ఎదుర్కోకుండా ఉండాలనే పెళ్లికి బెయిల్ మంజూరు చేస్తున్నామని న్యాయమూర్తి తెలిపారు. దీంతో పెళ్లికి రెండు కుటుంబాలు సిద్ధమయ్యాయి.

రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతానికి కట్టుబడి ఉన్నాం: ఖర్గే

- ఢిల్లీలో షర్మిల భేటీ.. వేణుగోపాల్‌తో కూడా



న్యూఢిల్లీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కష్టపడి పనిచేసి ప్రజల గొంతుకగా నిలవాలని 'ఎక్స్' వేదికగా పిలుపిచ్చారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారమిక్కడ ఖర్గేతో, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో వేర్వేరుగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి చేపట్టవలసిన కార్యాచరణ, ప్రణాళికలను వారికి వివరించారు.

ట్రూఅప్ చార్జీల భారం వద్దు: బాబూరావు

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు వినియోగదారులపై రూ.7,200 కోట్ల ట్రూ అప్ చార్జీల భారం పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్‌సీ)కి మంగళవారం లేఖ రాశారు. పూర్తి సమాచారంతో పారదర్శకంగా విచారణలు జరపాలని కోరారు. ఫిర్యాదుదారులు స్వయంగాను, ఆన్‌లైన్‌లోనూ విచారణలో పాల్గొనే అవకాశం కల్పించాలన్నారు.

ఉద్యోగుల్ని అవమానించిన వైసీపీ ప్రభుత్వం: కేఆర్

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం 11వ పీఆర్సీలో ఉద్యోగులను అవమానించిందని ఏపీ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్య వేదిక చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు 12వ పీఆర్సీ ఇస్తానని, మసిపూసి మారేడు కాయ చేశారన్నారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 12 పీఆర్సీ కమిషన్‌ని నియమించి, రిటైర్డ్ ఐఏఎస్ మన్మోహన్‌సింగ్‌ను చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులివ్వడం తమ పోరాట ఫలితమేనని కొన్ని సంఘాలు పాలాభిషేకాలు కూడా చేశాయన్నారు. అయితే, ఇప్పటికీ పీఆర్సీ కమిషనర్‌కి ఛాంబర్, సిబ్బందిని కేటాయించలేదని వివరించారు. పీఆర్సీ చైర్మన్ రాజీనామా చేయడాన్ని ఐక్య వేదిక తరఫున స్వాగతిస్తున్నామన్నారు. పీఆర్సీ కమిషన్ రిటైర్డ్ ఐఏఎస్‌లకు పునరావాస కేంద్రంగా మారిందని, నివేదికలు అన్నీ కాపీ పేస్టులా ఉన్నాయని ఆక్షేపించారు. ఉద్యోగుల డిమాండ్ల పట్ల కొత్త ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందని భావిస్తున్నామన్నారు. గత ఐదేళ్లుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల హక్కులను హరించివేసి, వారికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు నష్టం కలిగించడమే కాకుండా నిజాయితీగా పని చేసే ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు.

ఇంగ్లీష్ మీడియంపై మోజు ఆత్మహత్యా సదృశమే!

- ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జూన్ 18: విద్యార్థుల తల్లిదండ్రులకు ఇంగ్లీష్ మీడియంపై ఉన్న మోజు ఆత్మహత్యా సదృశమేనని ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ డీపీ సక్లానీ ఆవేదన వ్యక్తం చేశారు. "అనేక స్కూళ్లలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు లేరు. అయినా కూడా తల్లిదండ్రులు ఇంగ్లీష్ మీడియం స్కూళ్లపైనే మోజు పడుతున్నారు. ఇది ఆత్మహత్య కన్నా తక్కువకాదు" అని సక్లానీ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చిందని.. అయినా ప్రైవేటు ఇంగ్లీషు మీడియం స్కూళ్లవైపే తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సక్లానీ మాట్లాడుతూ.. ఇంగ్లీష్ కంటెంట్‌ను పిల్లలపై రుద్దేయడం కారణంగా వారు విజ్ఞానాన్ని కోల్పోతున్నారని, సంస్కృతి, మూలాలకు కూడా దూరమవుతున్నారని వ్యాఖ్యానించారు. తల్లిదండ్రులు ఇంగ్లీష్ మీడియా స్కూళ్లపై మక్కువ పెంచుకుని, ఆయా పాఠశాలలో శిక్షణ పొందిన గురువులు లేరని తెలిసినా, బోధనా సిబ్బంది కొరత ఉందని తెలిసినా.. అటువైపే అడుగులు వేస్తున్నారని తెలిపారు. అయితే, జాతీయ విద్యావిధానం మాత్రం స్థానిక భాషకు పట్టంకట్టాలని, తద్వారా విద్యార్థుల్లో జ్ఞానం పెరుగుతుందని మారుతుందని చెబుతోందన్నారు. మాతృభాషలో చదవడం వల్ల మూలాలు త్వరగా అర్థమవుతాయని, సంస్కృతి తెలుస్తుందని చెప్పారు. బహుభాషా విధానం అంటే.. ఇతర భాషల్లో విద్యాబోధన చేయాలని కాదని, బహుళ భాషలు నేర్చుకోవడమేనని వివరించారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి ఎన్సీఈఆర్టీ 121 భాషల్లో ప్రాథమిక విద్యకు సంబంధించిన పాఠ్యాంశాలను ముద్రించిందని, వాటిని త్వరలోనే అందుబాటులోకి తెస్తామని సక్లానీ తెలిపారు. తద్వారా విద్యార్థులు వారి సంస్కృతి, మూలాలకు అనుసంధానమై.. ప్రగతి సాధిస్తారని వివరించారు.

నవ్విపోదురుగాక... అన్నట్లుంది వైసీపీ తీరు: యామినీ శర్మ

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు ఈవీఎంలపై నిందలేయడం చూస్తుంటే నవ్విపోదురుగాక మాకేటి సిగ్గు అనే సామెత గుర్తుకొస్తోందని బీజేపీ నాయకురాలు సాదినేని యామినీ శర్మ ఎద్దేవా చేశారు. దాచుకోవడం, దోచుకోవడం తప్ప ఏదీ పట్టించుకోని జగన్ పార్టీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయాక మతి భ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. '2019లో వైసీపీ 151 సీట్లు గెలిస్తే అది నవరత్నాల హామీ మహిమ. ఇప్పుడు వైసీపీ ఓడితే ఈవీఎంలపై నెపం వేయడమా? గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ అసమర్థతను మాజీ మంత్రి అంబటి రాంబాబు వెల్లడించడంతోనైనా ఎందుకు ఓడిపోయామో పిల్ల కాంగ్రెస్ పార్టీ నేతలు గ్రహించాలి' అని యామినీ శర్మ హితవు పలికారు.

లోకేశ్‌ను కలిసిన రిజిస్ట్రేషన్ అధికారులు

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్‌ను స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో అద్భుత విజయం సాధించినందుకు గాను ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ల శాఖలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. లోకేశ్‌ను కలిసిన అధికారుల బృందంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ గుంటూరు డీఐజీ జీ శ్రీనివాసరావు, విజయవాడ డీఆర్ కే రామారావు, గుంటూరు డీఆర్ డీ శైలజ, ఏపీ సబ్‌రిజిస్ట్రార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ గోపాల్, జనరల్ సెక్రటరీ ఎం కృష్ణప్రసాద్, ఇతర సభ్యులు ఉన్నారు.

నీట్ లీక్‌పై న్యాయవిచారణ జరిపించాలి: సీపీఐ

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన చేశారు. 'బిహార్‌కు చెందిన ముఠా ఒక్కో విద్యార్థి నుంచి రూ.30 లక్షలు తీసుకుని నీట్ ప్రశ్నపత్రాన్ని లీక్ చేసినట్లు తెలిసింది. ఇది వైద్య విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటమే. నీట్ లీక్ వ్యవహారానికి కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బాధ్యత వహించాలి. నీట్ ప్రశ్నా పత్రాలను అమ్మకానికి పెట్టిన అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని రామకృష్ణ డిమాండ్ చేశారు.

డిగ్రీ కళాశాలల సమస్యలను పరిష్కరించండి

- ప్రభుత్వానికి ఏపీపీడీసీఏ విజ్ఞప్తి

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిగ్రీ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన చేశారు. 'మా సమస్యలను గత ప్రభుత్వానికి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి దృష్టికి తీసుకెళ్లాం. వాటిని పరిష్కరించకపోగా రాష్ట్రంలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో సంవత్సరానికి రెండు, మూడు సార్లు తనిఖీలు నిర్వహించాలంటూ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆదేశాల జారీ చేశారు. ప్రభుత్వం మారినా యూనివర్సిటీల అధికారులు కళాశాలలను తనిఖీల కమిటీల పేరుతో బెదిరిస్తున్నారు. కొత్త ప్రభుత్వమైనా మా సమస్యలను పరిష్కరించాలి' అని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

గెలిస్తే జగన్‌పై విశ్వసనీయతా..!

- ఓడితే ఈవీఎంలపై అనుమానమా..?: ఎంపీ కలిశెట్టి
- నాడు మీ విజయం... నేడు ఈవీఎంల తప్పిదమా..!: బుద్దా వెంకన్న

శ్రీకాకుళం, విజయవాడ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గెలిస్తే తనకు ప్రజల్లో విశ్వసనీయత ఉందని చెప్పుకునే జగన్మోహనరెడ్డి.. ఓటమి చెందగానే ఈవీఎంలపై అనుమానం వ్యక్తం చేయడం విడ్డూరంగా ఉందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. మంగళవారం శ్రీకాకుళంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. '2019లో ఒక్కచాన్స్ అంటూ జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు గెలిపించారు. అప్పుడు ఈవీఎంలు సక్రమంగా పనిచేస్తే.. ఇప్పుడు ప్రజలు తిరస్కరిస్తే ఆ నిజాన్ని అంగీకరించలేక ఈవీఎంలపై అనుమానం అంటూ ట్వీట్లు చేయడం సమంజసం కాదు. జగన్మోహన్‌రెడ్డి ఇకనైనా ప్రజల్లో గుర్తింపు పొందేలా వ్యవహరించాలి' అని సూచించారు. ఇదే అంశంపై బుద్దా వెంకన్న ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'జగన్‌రెడ్డీ నీకు 151 సీట్లు వచ్చినపుడు అది మీ విజయమా..? అదే మాకు 161 సీట్లు వస్తే ఈవీఎంల గురించి మాట్లాడుతున్నావు. ఒకపని చేద్దా. నువ్వు పులివెందులలో రాజీనామా చెయ్యి. బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నిక పెట్టమని అందరం కలసి ఈసీని కోరదాం. నీకు ఈసారి మొన్న వచ్చిన మెజారిటీ అయినా వస్తుందో రాదో, అసలు గెలుస్తావో లేదో చూద్దాం..!' అని వెంకన్న వ్యాఖ్యానించారు.

డిప్లొమాలు కొన్ని ఎంప్లాయిమెంట్ కల్పించడంలో కల్పతరువులు అని చెప్పొచ్చు. అలాంటి వాటిలో ఒకటి ప్రింటింగ్ టెక్నాలజీ. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్‌లో మాత్రమే ఈ కోర్సు ఉంది. దీనిలో చేరడానికి పదో తరగతి పాసై తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించే పాలిసెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి. హైదరాబాద్‌లో జూ పార్క్‌కి సమీపంలోని కులి కుతుబ్‌షా (క్యూ.క్యూ) గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో మాత్రమే ఈ కోర్సును అందిస్తున్నారు.

వంద శాతం ఎంప్లాయిమెంట్ కల్పించే ప్రింటింగ్ టెక్నాలజీ



కోర్సు తీరు తెన్నులు

ఆధునిక ప్రపంచంలో ముద్రణ మాధ్యమానికి ఉన్న విస్తృత అవసరాల దృష్ట్యా ప్రింటింగ్ టెక్నాలజీ డిప్లొమాను మూడు సంవత్సరాల కోర్సుగా రూపొందించారు. అత్యాధునిక ముద్రణ సాంకేతిక విధానాలైన offset, gravure, flexography, screen, digital ప్రింటింగ్ గురించి బోధిస్తారు. ఈ కోర్సులో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థి మూడు సంవత్సరాల్లో ఆరు సెమిస్టర్లు చదవాల్సి ఉంటుంది. మొదటి రెండు సెమిస్టర్లలో రెండు ప్రింటింగ్ సబ్జెక్టులు మినహాయిస్తే మిగిలిన సబ్జెక్టులన్నీ తతిమా అన్ని డిప్లొమాలతో సమానంగా ఉంటాయి. 3, 4, 5వ సెమిస్టర్లలో పూర్తిగా ప్రింటింగ్‌కు సంబంధించిన సబ్జెక్టులు మాత్రమే ఉంటాయి.

క్షేత్రస్థాయి అవగాహన

ఈ కోర్సు ద్వారా థియరీతోపాటు ప్రాక్టికల్స్‌లో కూడా మంచి పట్టు సాధించాల్సి ఉంటుంది. ప్రింటింగ్ టెక్నాలజీ చదువుతున్న విద్యార్థులను హైదరాబాద్‌లోని ప్రముఖ ముద్రణ సంస్థల్లో ఇండస్ట్రియల్ విజిట్‌కి తీసుకుని వెళతారు. తద్వారా పారిశ్రామిక స్థితిగతులను అవగాహన చేసుకునే అవకాశం కల్పిస్తారు. చివరి సెమిస్టర్‌లో ఆరు నెలలు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఉంటుంది. ఈ ఆరు నెలల్లో విద్యార్థి ముద్రణ రంగంలోని అన్ని విభాగాలలో పనిచేసి సంబంధిత నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి. తద్వారా యంత్రాలు నడపగలిగే స్థాయికి విద్యార్థి చేరుకుంటాడు. అంతే కాకుండా నిర్వహణ సామర్థ్యానికి సంబంధించిన నైపుణ్యాలు(మేనేజ్‌మెంట్ స్కిల్స్), ఆధునిక సాంకేతికత(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్), మార్కెటింగ్ నైపుణ్యాలు(మార్కెటింగ్ స్కిల్స్)లో తర్ఫీదు పొందుతాడు.

అభిరుచికి అనుగుణంగా....

ఈ కోర్సు చదివిన విద్యార్థి ముద్రణ పరిశ్రమలోని ముఖ్యమైన నాలుగు విభాగాలు ప్రి ప్రెస్, ప్రెస్ వర్క్, పోస్ట్ ప్రెస్, మార్కెటింగ్‌లలో వారి వారి ఆసక్తులను బట్టి ఎంచుకునేందుకు, సదరు విభాగాల్లో స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది.

- ప్రి ప్రెస్ విభాగాన్ని డి.టి.పి & డిజైనింగ్‌లో ఆసక్తి, నైపుణ్యం ఉన్నవారు ఎంపిక చేసుకుంటారు. ప్రెస్-వర్క్ విభాగంలో యంత్ర నిర్వాహకుడిగా, పర్యవేక్షకుడిగా పెద్ద స్థాయుల్లో అవకాశాలుంటాయి. ప్రింట్ ఫినిషింగ్‌లో బైండింగ్, ప్యాకింగ్‌పై ఆసక్తి ఉన్నవారుంటారు. మార్కెటింగ్ విభాగంలో సరైన నిర్ణయాలు, అంచనా వేయగలిగిన వారు, వినియోగదారులతో వ్యాపార సంబంధాలను నెరపగలిగిన వారుంటారు.

ఉన్నత స్థానాల్లో పూర్వ విద్యార్థులు

రిజర్వ్‌బ్యాంక్ కరెన్సీ ప్రెస్‌లో ఉద్యోగం పొందాలంటే డిప్లొమా ఇన్ ప్రింటింగ్ టెక్నాలజీ తప్పనిసరి. ఈ కోర్సు చేసిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఎంతో మంది ప్రభుత్వ రంగ సంస్థలు మింటింగ్, భారతీయ రిజర్వు బ్యాంకు, ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయాలు అలాగే ప్రైవేటు రంగంలో వివిధ ముద్రణ సంస్థల్లోనూ, పత్రికారంగంలోనూ ఉన్నత స్థాయిలో ఉన్నారు. ప్రింటింగ్ టెక్నాలజీ చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ప్రింటింగ్ పరిశ్రమలలో అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అనుభవం గడించిన తరవాత కొందరు సొంతగా ప్రింటింగ్ ప్రెస్‌లు స్థాపించి అనేక మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఏటా క్రమం తప్పకుండా జరుగుతుంది. అందరూ దాదాపుగా ఏదో ఒక దగ్గర ఉద్యోగం పొందుతారు. కొద్ది సంవత్సరాలుగా విద్యార్థినుల సంఖ్య పెరగుతోంది. ప్రింటింగ్ డిప్లొమా చేసే విద్యార్థినులు ఎక్కువగా డిజైన్, పోస్ట్ ప్రెస్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలను ఎంచుకుంటుంటారు.

ఉన్నత విద్యావకాశాలు

ఈ డిప్లొమా కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈసెట్‌లో ఉత్తీర్ణత సాధించి లేటరల్ ఎంట్రీ ద్వారా ప్రింటింగ్ టెక్నాలజీలో మాత్రమే కాకుండా మెకానికల్, కంప్యూటర్స్, ఐ.టి., ప్రొడక్షన్ ఇంజనీరింగ్‌లలో కూడా బీటెక్ చదివే అవకాశం ఉంది. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశం ద్వారా 40 శాతం విద్యార్థులు ఉన్నత విద్యను పొందగలుగుతున్నారు.

డిగ్రీ అందిస్తున్న సంస్థలు

- మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(మణిపాల్, కర్ణాటక)
- జాదవపూర్ యూనివర్సిటీ, కోల్‌కతా(పశ్చిమ బెంగాల్)
- కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, గిండీ(చెన్నై, తమిళనాడు)
- గురు జంబేశ్వర్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(హిస్సార్, హరియాణ)
- సింఘానియా యూనివర్సిటీ, ఝునుఝును(రసూల్‌పూర్, రాజస్థాన్)
- పుణె విద్యార్థి గృహ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(పుణె, మహారాష్ట్ర)
- కాలికట్ యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, మల్లప్పురం(కేరళ)
- అవినాశలింగమ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హోమ్‌సైన్స్ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫర్ ఉమన్, కోయంబత్తూరు(తమిళనాడు)

కొండా లక్ష్మణ్ వర్సిటీలో హార్టికల్చర్ డిప్లొమా



ములుగు(సిద్దిపేట)లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ)- 'డిప్లొమా ఇన్ హార్టికల్చర్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఒక్కో కళాశాలలో 40 చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. వీటిలో 60 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులకు, 40 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల విద్యార్థులకు కేటాయించారు. తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్/పదోతరగతి మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. స్థానికులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు

- ఆదిలాబాద్ హార్టికల్చర్ పాలిటెక్నిక్
- రామగిరిఖిల్లా హార్టికల్చర్ పాలిటెక్నిక్
- కొల్లాపూర్ హార్టికల్చర్ పాలిటెక్నిక్

అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలలు

- గంట గోపాల్ రెడ్డి హార్టికల్చర్ పాలిటెక్నిక్-గడ్డిపల్లి, సూర్యాపేట్ జిల్లా
- విశ్వధరణి హార్టికల్చర్ పాలిటెక్నిక్-తొర్రూరు, మహబూబాబాద్ జిల్లా

అర్హత: అభ్యర్థులు కనీసం 35 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ పాలిసెట్ 2024లో అర్హత పొంది ఉండాలి. సీబీఎస్‌ఈ/ఐసీఎస్‌ఈ/ఎన్‌ఐఓఎస్/టీఓఎస్‌ఎస్ నుంచి సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా పదోతరగతి పూర్తిచేసిన వారు, ఇంటర్ ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్/హయ్యర్ డిగ్రీ కోర్సులు పూర్తిచేసిన వారు దరఖాస్తుకు అనర్హులు. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1100; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 15
- **చిరునామా:** రిజిస్ట్రార్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, ములుగు, సిద్దిపేట్ జిల్లా-502279
- **వెబ్‌సైట్:** www.skltshu.ac.in

దామోదరం సంజీవయ్య వర్సిటీలో ఎల్ఎల్‌బీ



విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ(డీఎస్ఎన్ఎల్‌యూ)- ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. దేశవ్యాప్తంగా వర్సిటీ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్(డీఈటీ) ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్ల వివరాలు: మొత్తం 138 సీట్లు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కేటగిరీ కింద 66 సీట్లు, ఆలిండియా కేటగిరీ కింద 54 సీట్లు, విదేశీయులు/ఎన్ఆర్ఐలు/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ అభ్యర్థుల కేటగిరీ కింద 12 సీట్లు, కశ్మీరీ పండిట్స్/కశ్మీరీ మైగ్రెంట్స్/కశ్మీరీ హిందూ కుటుంబాలకు చెందిన పిల్లల కేటగిరీ కింద 6 సీట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; బీసీ అభ్యర్థులకు 42 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: ఈ పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో జనరల్ నాలెడ్జ్, లీగల్ ఆప్టిట్యూడ్, కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,500; బీసీ, ఓబీసీ అభ్యర్థులకు రూ.2,200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1800
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 12
- ఎంట్రెన్స్ టెస్ట్ తేదీని త్వరలో ప్రకటిస్తారు.
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు టెస్ట్ సెంటర్లు:** విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, గుంటూరు, హైదరాబాద్
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **ఈ-మెయిల్:** admissions@dsnlu.ac.in
- **వెబ్‌సైట్:** https://dsnlu.ac.in

SCHOLARSHIP ALERT

Legrand Empowering Scholarship Program

Description: Legrand invites applications from meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans pursuing B.Tech., B.E., B.Arch., or other undergraduate degrees in Finance or Science (such as B.Sc., B.Com., B.B.A., etc.) across India. The scholarship is meant to support meritorious students to pursue a career in Engineering, Architecture, Finance and Sciences.

Eligibility: The scholarship is open to meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans across India.

- Applicants must have secured admission in B.Tech., B.E., B.Arch., B.B.A., B.Com., or B.Sc. degrees in India.
- Applicants must have passed Class 12 in the year 2023–24.
- Girl students must have secured a minimum of 70% and above marks in Classes 10 and 12 examinations.
- Special category* students must have secured 60% marks in Classes 10 and 12 examinations. Exceptions may be considered on a case-by-case basis.
- The annual family income of the applicant from all sources must be less than INR 5,00,000.
- Preference will be given to special category* students.

Prizes & Rewards: Girl students are awarded 60% course fees up to INR 60,000 per year till the completion of course based on academic performance.

- Students in the special category* will be awarded 80% fees up to INR 1,00,000 per year till the completion of the course based on academic performance.

Last Date to Apply: 15-07-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LFLS9



Aadhar Kaushal Scholarship Program for Youth with Disabilities

Description: An initiative of Aadhar Housing Finance Limited (AHFL) to ensure equal educational opportunities for all physically disabled students, irrespective of their geographical location, gender, or socio-economic condition.

Eligibility: Students with physical disabilities pursuing general or professional undergraduate courses across India. Pan-India students can apply. Students must have achieved a minimum of 60% marks in the preceding academic year. Applicants with a gross annual family income of up to INR 2.5- 3 lakh are eligible to apply.

Prizes & Rewards: Scholarship between INR 10,000 - INR 50,000
Last Date to Apply: 23-07-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/AKSP1

Raman Kant Munjal Scholarships

Description: The Raman Kant Munjal Scholarships 2024-25 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: Students enrolled in the first year of BBA, BFIA, B.Com. (H, E), BMS, IPM, B.A. (Economics), BBS, BBI, BAF, B.Sc. (Statistics), or any other finance-related degree courses are eligible.

- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12.
- The annual family income of the applicants should be less than INR 4 lakh.
- Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years

Last Date to Apply: 02-08-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/RMKSP4

లిటిల్స్

మీకు తెలుసా?



పులుల మధ్య ఎలాంటి కమ్యూనికేషన్ ఉంటుంది? ఒక దానితో మరొకటి ఎలా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటాయి? అనేది పెద్ద పజిల్. పులులపై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు అవి- లో ఫ్రీక్వెన్సీ ఇన్‌ఫ్రాసౌండ్ అనే పద్ధతి ద్వారా సంకేతాలు ఇచ్చిపుచ్చుకుంటాయని పేర్కొంటున్నారు. వీటి తరంగదైర్ఘ్యం తక్కువగా ఉండటం వల్ల ఇవి మానవులకు వినబడవు.



ఫ్రాన్స్‌లో ఒక రోడ్డును రోజుకు రెండు సార్లు మాత్రమే తెరుస్తారు. మిగిలిన సమయాల్లో అలలు ఆ రోడ్డును నీటిలో ముంచెత్తుతాయి. అందువల్ల ఆ రోడ్డు మీదుగా వాహనాలు ప్రయాణించలేవు.

ఎన్ని పందులు ఉన్నాయి?



7 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 336

					3			
		8					7	6
	7			2		5	9	
	3	1	2		8			
6			1		7			5
			6		9	1	3	
	4	2		6			1	
9	8					2		
			4					

సుడోకు - 335 సమాధానం

1	4	9	2	7	8	5	3	6
8	7	5	6	3	1	2	4	9
6	2	3	9	5	4	8	1	7
9	6	2	4	8	7	1	5	3
7	1	8	5	2	3	6	9	4
3	5	4	1	6	9	7	8	2
4	8	6	3	1	2	9	7	5
5	9	1	7	4	6	3	2	8
2	3	7	8	9	5	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.